అనుదినం... జనస్వరం
Dwaraka
నవతెలంగాణ
సోమవారం 22-1-2018
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 4 సంచిక : 24 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00


20 మందిపై వేటు

- ఆప్ ఎమ్మెల్యేలపై ఈసీ సిఫారసుకు రాష్ట్రపతి ఆమోదం
- ఢిల్లీ హైకోర్టులో నేడు విచారణ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీలోని ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్)కి చెందిన 20మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది. కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) సిఫారసుకు రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ఆమోద ముద్ర వేశారు. రాష్ట్రపతి తరఫున కేంద్ర న్యాయశాఖ ఆ 20మంది ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేస్తూ ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. లాభదాయక పదవుల ఆరోపణలతో ఆప్‌నకు చెందిన 20మంది ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దుకు రాష్ట్రపతికి ఈసీ సిఫారసు చేసిన విషయం తెలిసిందే. అనర్హతకు గురైన ఈ 20మంది ఎమ్మెల్యేలు 2015,మార్చి 13 నుంచి 2016, సెప్టెంబర్ 8 వరకు పార్లమెంటరీ కార్యదర్శులుగా లాభదాయక పదవుల్లో ఉన్నారని రాష్ట్రపతికి పంపిన నివేదికలో ఈసీ పేర్కొన్నది. దీంతో, 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ బలం 65 నుంచి 45కు తగ్గింది. మెజారిటీకి అవసరమైన 36 సభ్యుల బలంకన్నా ఆప్ ఎమ్మెల్యేల సంఖ్య అధికంగానే ఉండటం వల్ల కేజ్రీవాల్ నేతృత్వంలోని ప్రభుత్వానికి ఇప్పటికిపుడు ఇబ్బందేమీ లేదు. అయితే, రద్దయిన 20మంది ఎమ్మెల్యేల స్థానాలకు ఎన్నికలు



జరిగితే కేజ్రీవాల్ ప్రభుత్వంపై ప్రజాతీర్పుగా ప్రచారానికి ప్రతిపక్ష బీజేపీకి అవకాశముంటుంది. తమ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దుపై ఆప్ తీవ్రంగా స్పందించింది. అన్ని విధాలా వైఫల్యం చెందిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ...9లో



కరెంటు మీటర్లు ఎందుకు కాలిపోతున్నాయి... తిరగనని ఎందుకు మొరాయిస్తున్నాయి?
అదీ సామాన్యుల మీటర్లే కాలిపోవడం వెనుక మర్మం ఏంటి? హెచ్‌టి మీటర్లు సమర్థవంతంగా పనిచేస్తుంటే...
అధిక సంఖ్యలో ఉన్న ఎల్‌టి డొమెస్టిక్ కేటగిరికి మాత్రమే ఈ సమస్య ఎందుకు ఎదురౌతోంది. 'గుంపులో గోవిందా'
తరహాలో మీటర్ల మార్పిడి వెనుక జరుగుతున్న కహానీ ఏంటి? నాణ్యతాలోపమా...నాణ్యమైన విద్యుత్ ఇవ్వట్లేదా...
మీటర్ల కొనుగోళ్లలో గోల్‌మాల్ ఉందా... తెరవెనుక ఏం జరుగుతోంది?

కాలుతున్న మీటర్లు

11.48 లక్షలు రీప్లేస్‌మెంట్

- మెదక్, సిద్దిపేట, నిజామాబాద్‌ల్లోనే అత్యధికం
- మీటర్ల కంపెనీలతో డిస్కంలు కుమ్మక్కు!
- విద్యుత్తు, మీటర్ల నాణ్యతపై సందేహాలు
- 'ఓవర్‌లోడ్' పేరుతో తప్పుల్ని మోస్తున్న వైనం
- స్మార్ట్‌గా జనం సొమ్ము బదలాయింపు

\- ఎస్ఎస్ఆర్ శాస్త్రి

కరెంటు మీటర్ల నాణ్యత ఏపాటిదో అర్థంకాక వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. కొత్త మీటర్ బిగించిన కొద్దిరోజుల్లో మళ్లీ అవే సమస్యలు పునరావృతమౌతున్నాయి. సమస్య వచ్చిన ప్రతిసారీ వినియోగదారుడి జేబుకి చిల్లు పడుతోం ది. మీటర్లు సరఫరా చేసే కంపెనీలకు మాత్రం దండిగా కాసుల వర్షం కురుస్తోంది. కరెంటు మీటర్లలో నాణ్యత ఉన్నా లేకున్నా 'లాగ్‌బుక్స్'లో మాత్రం 'ఓవర్‌లోడింగ్'



పేరుతో సదరు కంపెనీల ను విద్యుత్‌సంస్థలు గట్టెక్కించేస్తున్నాయి. దీంతో వారం టీ గడువు ఉన్నా 'రీప్లేస్‌మెంట్' చేసే బాధ్యతల నుంచి కంపెనీలు తప్పుకుంటున్నాయి. ఓవర్‌లోడింగ్ వల్ల మీటర్లు కాలిపోవడంతో డిస్కంలు తప్పంతా తమదేనని అంగీకరిస్తున్నాయి. ఓల్టేజ్ లెవల్స్‌ను సక్రమంగా నియంత్రించకపోవడం వల్ల ఈ తరహా సమస్యలు ఏర్పడుతున్నాయని డిస్కంల అధికారులు చెప్తున్నారు. మరి సర్కారు చెప్తున్న 'నాణ్యమైన విద్యుత్' సరఫరా ఎటు పోతోందనే ప్రశ్నలకు సమాధానాలు కనిపించట్లేదు. కాలిపోతున్న మీటర్లన్నీ గృహ వినియోగ కేటగిరి (ఎల్‌టి-1)కి చెందినవే కావడం గమనార్హం. 2016-17 డిస్కంల లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎల్‌టి డొమెస్టిక్ కేటగిరిలో 54,26,404 మీటర్లు ఉన్నాయి. వీటిలో గడచిన రెండేండ్లలో 11,48,713 (21.17 శాతం) మీటర్లు కాలిపోవడం, తిరగకపోవడం వంటి కారణాలతో రీప్లేస్‌మెంట్ చేశారు. దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) పరిధిలో 5,41,723 మీటర్లు, ఉత్తరప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) పరిధిలో 6,06,990 మీటర్ల రీప్లేస్‌మెంట్ జరిగింది. టీఎస్-ఎస్పీడీసీఎల్ పరిధిలోని మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఈ తరహా రీప్లేస్‌మెంట్స్ అత్యధికంగా ఉన్నాయి. డిస్కం పరిధిలోని మొత్తం రీప్లేస్‌మెంట్ మీటర్లలో ఈ రెండు జిల్లాల్లోనే 84,128 (గృహవినియోగం-ఎల్‌టి-1 కేటగిరి) ఉన్నాయి. ఆ తర్వాతి స్థానం నల్గొండ జిల్లాది. ఇక టీఎస్ఎన్పీడీసీఎల్ పరిధిలోని నిజామాబాద్ జిల్లాలో రెండేండ్లలో 1,31,508 మీటర్లను రీప్లేస్ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పోల్చితే నిజామాబాద్ జిల్లా రీప్లేస్‌మెంట్సే అత్యధికంగా ఉండటం గమనార్హం. గృహ వినియోగ మీటర్లు కాలిపోవడానికి ఎర్తింగ్ సరిగా లేకపోవడమే కారణమని, వాటిని ...9లో

రసాయన కర్మాగారంలో పేలుడు

- నలుగురు మృతి, తొమ్మిది మందికి గాయాలు
- గుజరాత్‌లోని వదోదరలో

వివరాలు 2లో

స్మార్ట్ సిటీలకు వరద ముప్పు

- దేశవ్యాప్తంగా 642 జిల్లాల్లోపై ప్రకృతి విపత్తుల ప్రభావం

వివరాలు 2లో

బీజేపీ, కాంగ్రెస్‌కు తేడా లేదు

ఉదార ఆర్థిక విధానాల్లో..

- పొలిట్‌బ్యూరో ముసాయిదా రాజకీయ తీర్మానానికి సవరణలతో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఆమోదం
- త్రిపురలో బీజేపీకి భంగపాటు తప్పదు : సీతారాంఏచూరి



కోల్‌కతా: 22వ పార్టీ మహాసభ కోసం పొలిట్‌బ్యూరో ప్రతిపాదించిన ముసాయిదా రాజకీయ తీర్మానానికి సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ కొన్ని సవరణలతో ఆమోదం తెలిపింది. ఈ నెల 19 నుంచి 21 వరకూ కోల్‌కతాలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. ప్రతిపాదిత సవరణలకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ నిర్వహించి ఆమోదం తెలిపారు. ఈ మూడు రోజుల్లో పార్టీ పొలిట్‌బ్యూరో కూడా సమావేశమైంది. పార్టీ సభ్యుల మధ్య చర్చకు వీలుగా ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని మహాసభకు రెండు నెలల ముందు కేంద్ర కమిటీ విడుదల చేయనున్నది. పార్టీ 22వ మహాసభలను హైదరాబాద్‌లో నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆదివారం కేంద్ర కమిటీ సమావేశాలు ముగిసిన సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాంఏచూరి మీడియాతో మాట్లాడారు. ఉదార ఆర్థిక విధానాలను అమలు చేయడంలో కేంద్రంలో ఇప్పుడు ...9లో

ట్రంప్ పాలనపై నారీ భేరి

- యూఎస్‌లోని 250కి పైగా నగరాలు..లక్షలాది మంది నిరసన
- అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేకంగా రెండో ఆందోళన



వివరాలు 2లో



మహిళలపై దాడులు అరికట్టాలి

- ప్రత్యేక చట్టాలు, యంత్రాంగాన్ని రూపొందించాలి : పెరూ పర్యటనలో పోప్ ఫ్రాన్సిస్



వివరాలు 2లో

అనుమతి లేకుండా ఆమెను తాకరాదు

- కిక్కిరిసిన జనం మధ్య తాకటం.. తడమటం నేరమే : ఢిల్లీ కోర్టు తీర్పు



న్యూఢిల్లీ : ఓ మహిళ లేదా ఓ బాలిక అనుమతి లేకుండా ఆమె శరీరాన్ని ఎవరూ తాకరాదని ఢిల్లీ అడిషనల్ సెషన్స్ కోర్టు శనివారంనాడు సంచలన తీర్పు వెలువరి ంచింది. జనసమ్మర్దం ఉన్న ప్రాంతాల్లో, బస్సుల్లో, మెట్రో రైళ్లలో, సినిమా హాళ్లలో ...9లో

సీఈసీగా రావత్

- ఈసీగా అశోక్ లావాసా



న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఓం ప్రకాశ్ రావత్ ను నియమిస్తూ కేంద్ర ప్రభు త్వం ఆదివారం ఓ ప్రకటన జారీ చేసింది. 23న ఆయన సీఈసీగా బాధ్యతలు స్వీకరిం చనున్నారు. ఈమేరకు న్యాయ మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం చీఫ్ ఎన్నికల ...9లో

వీధికుక్కల ముందు తలవంచం



- దళితులపై కేంద్రమంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు
- తీరుమారని హెగ్డే..ట్విట్టర్‌లో ప్రకాశ్‌రాజ్ ఆగ్రహం

9



పాతికేండ్లైంది.. ఆయనకు అరవైఏండ్లు వచ్చినా.. కలర్ వేసుకుని ఇంకా టీనేజే అని ఫోజు కొడుతున్నాడే..!!

పోటెత్తిన మేడారం

జాతర పరిసరాలు జనంతో కిటకిట

- అదనపు సర్వీసులు లేక ప్రయాణికుల ఇబ్బందులు
- రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం

నవతెలంగాణ-తాడ్వాయి/ములుగు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతర ఆదివారం సందర్శకులతో పోటెత్తింది. అధికారికంగా 31న ప్రారంభమయ్యే జాతరకు ముందు నుంచే ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఆదివారం సుమారు రెండు లక్షలకు పైగా సందర్శకులు సమ్మక్క- సారలమ్మలను సందర్శించినట్టు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, తెలంగాణ నలుమూలల నుంచి సందర్శకులు భారీగా తరలి వస్తున్నారు. రద్దీ దృష్ట్యా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. జాతరకు వచ్చి, పోయే క్రమంలో ఆర్టీసీ బస్సు సర్వీసులు సరిగా లేక ప్రజలు ఇబ్బంది పడ్డారు. జంపన్నవాగులోని బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు ఆచరిం చి సమ్మక్క- సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకుంటున్నారు. అమ్మవార్లకు ఇష్టమైన బంగారం (బెల్లం), చీరె, సారె, పసుపు, కుంకుమ సమర్పించి సందర్శకులు ముందస్తుగా మొక్కులు చెల్లించుకుం టున్నారు. అనంతరం మేడారం అటవీ ప్రాంతాల్లో విడిది చేసి సహఫంక్తి భోజనాలు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడం, మహా జాతరకు ఇంకా 9 రోజుల గడువే ఉండటంతో ...9లో



సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు ఖాగెన్‌దాస్ కన్నుమూత

- కేంద్ర కమిటీ, పార్టీ నేతలు ఏచూరి, ప్రకాశ్‌కరత్, త్రిపుర సీఎం మాణిక్‌సర్కార్‌ల సంతాపం



కోల్‌కతా : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు, త్రిపుర రాష్ట్ర లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ ఖాగెన్‌దాస్(79) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. కేంద్ర కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు కోల్‌కతా వెళ్లిన ఖాగెన్‌దాస్ అక్కడి త్రిపురభవన్‌లో తీవ్ర గుండెనొప్పితో బాధ పడుతూ తెల్లవారుజామున 3.30కి మృతి చెందారని కుటుంబసభ్యులు, పార్టీ వర్గాలు తెలిపాయి. ఖాగెన్‌దాస్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఖాగెన్‌దాస్ కుటుంబం పట్ల పార్టీ కేంద్ర కమిటీ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపింది. ఖాగెన్‌దాస్ భౌతికకాయానికి సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్‌కరత్, త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్, పార్టీ నేతలు నివాళు లర్పించారు. త్రిపురలో రెండురోజులపాటు సంతాపాన్ని పాటించాలని ఆమేరకు పార్టీ కార్యక్రమాలను రద్దు చేసినట్టు ఆ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఖాగెన్‌దాస్ 1978లో, ఆ తర్వాత 1983లో త్రిపుర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1996 నుంచి 1998 వరకు రాజ్యసభ సభ్యుడిగా, 1998 నుంచి 2014 వరకు లోక్‌సభ సభ్యుడిగా పని చేశారు.

యూపీలో కాషాయ మంత్రం

- లక్నోలోని పార్కులూ, డివైడర్లకు కొత్తరంగు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో యోగి అదిత్యనాథ్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి కార్యాలయం సహా ఇంకా పలు ప్రభుత్వ భవనాలను కాషాయంతో నింపేస్తున్నారు. యూపీలో హజ్ హౌస్ వివాదాన్ని మరవకముందే లక్నోలోని గోమతినగర్ మున్సిపల్ కార్యాలయానికి, పార్కులకు, డివైడర్లకు కాషాయ రంగు వేశారు. యోగి సర్కారు రాష్ట్రాన్ని కాషాయీకరణ చేస్తున్నదని ప్రజాసంఘాలు, విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వం గతనెల లక్నోలోని హజ్ హౌస్ ప్రహారీగోడకు కాషాయ రంగు వేయించారు. దీనిపై ప్రతిపక్షాలు, ముస్లిం సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో హజ్ కమిటీ సెక్రెటరీ ఆర్.పి సింగ్ గోడపై మరో రంగును వేయించారు. దీంతో ఆయను పదవీ బాధ్యతల నుంచి తొలగించిన విషయం విదితమే.

80 ఏండ్ల వృద్ధురాలిపై లైంగికదాడి

ముంబయి: కామాంధులకు కండ్లు మూసుకుపోతున్నాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా లైంగికదాడులకు పాల్పడుతున్నారు. తాజాగా 80 ఏండ్ల వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తి లైంగికదాడి చేసిన ఘటన మహారాష్ట్రలోని పూణేలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పూణే నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాల్వాడే గ్రామంలో ఓ ఆగంతకుడు ఇంటివద్ద ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై కన్నేశాడు. అదను చూసుకుని ఇంట్లోకి చొరబడి ఆమెపై లైంగిక దాడికి దిగాడు. తనపై జరిగిన దారుణాన్ని కుమారుడికి చెప్పుకొని విలపించింది. బాధితురాలైన తల్లిని ఆస్పత్రికి తరలించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వృద్ధ మహిళపై దారుణానికి ఒడిగట్టిన నిందితుడి జాడ కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు.

స్మార్ట్ సిటీలకు వరద ముప్పు

- దేశవ్యాప్తంగా 642 జిల్లాలపై ప్రకృతి విపత్తుల ప్రభావం
- మౌలిక వసతుల కల్పన జరగాలి..లేదంటే..
- కోట్లాది మంది నిరాశ్రయలవుతారు : స్వచ్ఛంద సంస్థ వెల్లడి

న్యూఢిల్లీ : ఏచిన్న వర్షం వచ్చినా దేశంలోని 642 జిల్లాలు, అందులోని నగరాలు వరద ముంపుకు గురవుతున్నాయి. ఇక ఈమధ్య భూకంప ప్రమాదాలూ నగర ప్రజల్ని తీవ్రంగా భయపెడుతున్నాయి. మోడీ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్మార్ట్ సిటీ'లు ఇందులో అత్యధికంగా ఉన్నాయి. కాబట్టి మౌళిక వసతుల కల్పన జరగకుండా ప్రకృతి విపత్తులను ఈ నగరాలు ఎదుర్కోలేవని ఓ నివేదిక హెచ్చరించింది. మొత్తంగా చూస్తే...ప్రకృతి విపత్తుల ప్రమాదం భారత్‌లోని స్మార్ట్ సిటీలకు పొంచి ఉందని ఓ స్వచ్ఛంద సంస్థ నివేదిక తేల్చింది. ప్రతీ ఏటా పడుతున్న భారీ వర్షాల వల్ల సగానికిగా భారతీయ నగరాల్లో ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారని, 2000-17 మధ్యకాలంలో చోటుచేసుకున్న ప్రకృతి విపత్తులపై 'సీడ్స్' అనే స్వచ్ఛంద సంస్థ, బ్రస్సెల్స్‌లోని లోవైన్ వర్సిటీ సంయుక్తంగా ఓ నివేదిక తయారుచేశాయి. ఈ నివేదికలోని మరిన్ని విషయాలు ఇలా ఉన్నాయి..

18 సంవత్సరాల్లో (2000-17 మధ్య) ప్రతీ జిల్లాలో సగటున 11వరదలు ముంచెత్తాయి. మొత్తం ప్రకృతి విపత్తుల్లో వరదల తాకిడి నగరాలపై అత్యధికంగా (77 శాతం) ఉంది. తుఫాన్‌లు-22 శాతం, అత్యధిక ఉష్ణోగ్రతలు-11 శాతం, కొండచరియలు విరిగిపడటం-7 శాతం, భూకంపాలు-4 శాతం, వర్షాభావం-ఒక శాతం ఉంది. దేశంలోని 642 జిల్లాలు వరదల తాకిడికి గురయ్యాయి. ప్రకృతి విపత్తుల కారణంగా గతఏడాది కోటీ 56లక్షల మంది నిరాశ్రయులయ్యారు. 3.16లక్షల మంది తీవ్రంగా గాయపడి, వికలాంగులుగా మారాల్సి వచ్చింది. సగటున కోటీ 50 లక్షలమంది ప్రతీ ఏటా ప్రభావితమవుతున్నారు. దేశంలోని 2,200 నగరాల్లోని ప్రజల జీవితాల్ని ప్రకృతి విపత్తులు తలకిందులు చేసే ప్రమాదముంది. గత 18సంవత్సరాల్లో ఈ నగరాల్ని 11వరదలు ముంచెత్తాయి. ఈపరిస్థితికంతటికీ కారణం నగరాల్లో మౌళిక వసతుల కల్పనసరైన స్థాయిలో లేకపోవటమే.



ప్రకృతి ప్రమాదాల ముంగిట అస్సాం...

భారీ వర్షాలు, వరదల తాకిడి అస్సాంకు ఎక్కువగా ఉంది. లఖింపూర్‌లో 30సార్లు వరదలు వచ్చాయి. గుజరాత్, రాజస్థాన్‌లలో కూడా ఈ మధ్య వరదలు పెరిగాయి. కాబట్టి భారత ప్రభుత్వం పట్టణాల్లో మౌళిక వసతుల కల్పనపై వెంటనే దృష్టి సారించాలి. విపత్తుల ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలి. 2015 చెన్నై వరదలు చూసిన తర్వాత కూడా మేల్కోకపోతే నష్టం అపారంగా జరుగుతుంది. పట్టణీకరణ పేరుతో జరిగిన అభివృద్ధి ఆయా నగరాల్లో నీరు ఇంకే పరిస్థితే లేకుండా పోయింది. ఇందుకు చెన్నై మంచి ఉదాహరణ. చెన్నైలో పడ్డ భారీ వర్షపు నీరు అంతా కోయం, అడయార్ నదుల్లోకి, బకింగ్‌హాం కాలువల్లోకి వెళ్లాలి. కానీ విశృంఖలంగా జరిగిన భవన నిర్మాణాలు వరద నీరుకు అడ్డంగా మారి ప్రమాదం తెచ్చిపెట్టింది. కాబట్టి 2018 ఏడాది వర్షాల వల్ల వరదలు ముంచెత్తకుండా ఉండాలంటే, నగరాలన్నీ ఇప్పట్నుంచే సన్నద్ధం కావాలి. ప్రభుత్వం తీసుకునే చిన్న చిన్న చర్యలు సైతం మంచి ఫలితాలు ఇస్తాయని నివేదిక అభిప్రాయపడింది.

సహచరుల ఆవేదనపై పెదవి విప్పండి..!

- ప్రధాన న్యాయమూర్తికి మాజీ న్యాయమూర్తుల లేఖ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు పాలనలో అవకతవకలపై గొంతెత్తిన సహచర న్యాయమూర్తుల ఆవేదనపై ఇప్పటికైనా పెదవి విప్పాలని నలుగురు మాజీ న్యాయమూర్తులు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఆయనకు రాసిన బహిరంగ లేఖను ఆదివారం నాడు మీడియాకు విడుదల చేశారు. వివిధ ధర్మాసనాల ఏర్పాటు, వాటికి కేటాయించే కేసుల విషయంలో నలుగురు న్యాయమూర్తులు ప్రస్తావించిన సమస్యలు అత్యంత తీవ్రమైనవని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పిబి సావంత్, మరో మూడు రాష్ట్రాల హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు ఈ లేఖలో పేర్కొన్నారు. కేసుల కేటాయింపు విషయంలో వివక్ష చూపుతున్నారని, కొన్ని ఎంపిక చేసిన కేసులను జూనియర్ న్యాయమూర్తుల నేతృత్వంలోని కొన్ని ఎంపిక చేసిన ధర్మాసనాలకు మాత్రమే కేటాయిస్తున్నారని ఇది ఏకపక్షంగా సాగుతోందని సీనియర్ న్యాయమూర్తులు ఆందోళన వ్యక్తం చేశారని వారు ఈ లేఖలో వివరించారు. ఇది న్యాయవ్యవస్థ పాలనపైన, శాంతి, భద్రతల పరిస్థితిపైన తీవ్ర ప్రభావం చూపే అంశమని ఈ లేఖలో పేర్కొన్నారు.

ప్రధాన న్యాయమూర్తి సర్వోన్నత న్యాయస్థానం సారథే అయినప్పటికీ కేసుల కేటాయింపు విషయంలో ఏకపక్షంగా వ్యవహరించరాదన్న వారి వాదనతో తాము ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యను ధర్మాసనాల ఏర్పాటు, కేసుల కేటాయింపు వంటి అంశాలకు సంబంధించిన నియమ నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాల్సిన అవసరం వుందన్నారు. న్యాయవ్యవస్థలోనూ, సుప్రీంకోర్టుపైన ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు తక్షణమే ఈ చర్యను చేపట్టాల్సి వుందని వారుసూచించారు. అయితే అది చేసే వరకూ పెండింగ్ కేసులతో సహా ప్రధానమైన కేసులన్నింటినీ ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలన్నారు.

ఇటువంటి చర్యలు మాత్రమే సుప్రీంకోర్టులో తమకు న్యాయం జరుగుతుందన్న విశ్వాసాన్ని ప్రజలకు కలిగిస్తాయని, సుప్రీం కోర్టు సారధిగా ప్రధాన న్యాయమూర్తి కొన్ని సున్నితమైన కేసుల కేటాయింపు విషయంలో నిర్దిష్ట ఫలితాలను ఆశించే విధంగా తన అధికారాలను దుర్వినియోగం చేయరాదని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన చర్యలను తక్షణమే తీసుకోవాలని తాము కోరుతున్నామని వారు ఈ లేఖలో పేర్కొన్నారు.

గుజరాత్ రసాయన కర్మాగారంలో పేలుడు

- నలుగురు మృతి : తొమ్మిది మందికి గాయాలు

వడోదర : గుజరాత్‌లోని వడోదర సమీపంలో ఉన్న ఒక రసాయన కర్మాగారంలో ఆదివారం జరిగిన పేలుడులో నలుగురు కార్మికులు మృతి చెందగా 9 మంది గాయపడ్డారు. ఫర్టిలైజర్ కంపెనీ జిఎస్‌పి క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కర్మాగారం వద్ద తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగిందని పోలీసు అధికారి ఒకరు తెలిపారు.. నందేశరి వద్ద ఉన్న గుజరాత్ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ జోన్‌లో ఈ కర్మాగారం ఉంది. ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు మృతి చెందినట్లు జిల్లా కలెక్టర్ పి. భారతి ధృవీకరించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు సంఘటనపై విచారణకు ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. పేలుడుకు గల కారణం ఇంకా తెలియ రాలేదు. పేలుడు వల్ల సంభవించిన మంటలను అదుపులోకి తెచ్చేందుకు దాదాపు రెండు గంటలు పట్టిందని అగ్నిమాపక అధికారి ఓం జడేజా తెలిపారు. కర్మాగారంలో పేలుడు సంభవించిన తరువాత, పరిసర కర్మాగారాలకు కూడా మంటలు వ్యాపించాయని ఆయన చెప్పారు. అక్కడ మండగల రసాయన పదార్థాలు ఉండటమే దీనికి కారణమన్నారు.

గుజరాత్‌లో పద్మావత్‌పై లొల్లి

కొనసాగుతున్న ఆందోళనలు

- పలు బస్సు సర్వీసులు రద్దు

అహ్మదాబాద్ : పద్మావత్ సినిమాను నిరసిస్తూ రాజ్‌పుట్ సంఘాలు నిర్వహిస్తున్న ఆందోళనల నేపథ్యంలో గుజరాత్‌లో పలు బస్సు సర్వీసులను అధికారులు రద్దు చేశారు. ఉత్తర గుజరాత్‌లోని 6 జిల్లాల్లో 100కు పైగా మార్గాలలో బస్సు సర్వీసులను రద్దు చేసినట్లు వారు తెలిపారు. నిరసనకారులు పలు ప్రాంతాలలో జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలను దిగ్బంధిస్తుండటంతో ముందస్తు జాగ్రత్త చర్యగా పలు బస్సులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో శనివారం నాలుగు చోట్ల హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. కర్ణిసేనకు చెందిన కార్యకర్తలు పలు బస్సులను ధ్వంసం చేశారు. పద్మావత్ సినిమా విడుదలను వ్యతిరేకిస్తూ కర్ణిసేన కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సుప్రీం కోర్టు సినిమా విడుదలకు అనుమతిచ్చింది. అయినా నిరసన కారులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న మరో సంఘటనలో ఒక థియేటర్‌ను ధ్వంసం చేశారు.

పద్మావత్ సినిమాను కర్ణిసేనతో పాటు మరో 10 సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ సంఘాలు కూడా నిరసన ఆందోళనలు చేపట్టాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగేలా జాతీయ రహదారులను దిగ్బంధించాయి. సినిమాను ప్రదర్శించాలనుకుంటున్న థియేటర్లను లక్ష్యంగా చేసుకుని వాటిని ధ్వంసం చేస్తున్నాయి. ఈ సంక్షోభాన్ని నివారించేందుకు తాము ప్రయత్నిస్తున్నట్లు ప్రభుత్వంలోని ఒక ఉన్నతాధికారి తెలిపారు. దీనికి సంబంధించి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నదన్నారు. కర్ణిసేన వంటి రాజపుట్ సంఘాలు నిరసన వ్యక్తం చేస్తుండటంతో తాము సినిమాను ప్రదర్శించలేమంటూ రాష్ట్రానికి చెందిన పలు థియేటర్ల నిర్వాహకులు, యజమానులు ఇప్పటికే ప్రకటించారు. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన పద్మావత్ సినిమా ఈ నెల 25న విడుదల కానున్నది.



శాస్త్ర సమాజానికే అవమానం

- కేంద్ర మంత్రి సత్యపాల్‌సింగ్ వ్యాఖ్యలపై శాస్త్రవేత్తల ధ్వజం

న్యూఢిల్లీ: ఛార్లెస్ డార్విన్ ఆవిష్కరించిన జీవ పరిణామ సిద్ధాంతంపై కేంద్ర మానవ వనరుల శాఖ ఉప మంత్రి సత్యపాల్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. జీవుల పరిణామ క్రమంపై డార్విన్ ఆవిష్కరించిన ఈ సిద్ధాంతం 'శాస్త్రీయంగా తప్పు' అని మంత్రి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. మంత్రి వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఇన్సా) మాజీ అధ్యక్షుడు రాఘవేంద్ర గద్కర్‌తో సహా పలువురు శాస్త్రవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు శాస్త్ర సమాజాన్ని అవమానించటమేనని గద్కర్ అన్నారు. శాస్త్రవిజ్ఞానాన్ని, శాస్త్రవేత్తలను రాజకీయంగా విడదీసే లక్ష్యంతోనే మంత్రి ఈవ్యాఖ్యలు చేశారని, అత్యంత ప్రమాదకరమైన ఈ ధోరణిని శాస్త్ర సమాజం కలిసికట్టుగా ప్రతిఘటించాలని ఆయన సూచించారు. ప్రాథమిక స్థాయిలో లభిస్తున్న ఆధారాలన్నీ లక్షల సంవత్సరాల క్రితం నివశించిన చింపాంజీల నుండి ప్రస్తుత మానవాళి ఆవిర్భవించినట్లు తెలుస్తోందన్నారు. అందువల్ల మానవాళి ఆవిర్భావానికి సంబంధించిన అంశాలను శాసనాలు, పురాణాలలో పొందుపర్చే అవకాశమే లేదని ఆయన స్పష్టం చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు శాస్త్ర విజ్ఞానానికి, శాస్త్ర సమాజానికి తీరని అవమానమని ప్రముఖ జీవశాస్త్రవేత్త కిరణ్‌మజుందార్‌షా తీవ్రంగా విమర్శించారు. బాధ్యతాయుతమైన మంత్రిపదవిలో వుంటూ ఇటువంటి వ్యాఖ్యలుచేయటం ఆ పదవికే సిగ్గుచేటైన విషయమని ఆయన దుయ్యబట్టారు. సత్యపాల్ సింగ్ వ్యాఖ్యలు 'నాన్సెన్స్' అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్‌రమేష్ కొట్టిపారేశారు. ఇదిలా వుండగా డార్విన్ సిద్ధాంతంపై తాను చేసిన వ్యాఖ్యలను మంత్రి సత్యపాల్‌సింగ్ గట్టిగా సమర్థించుకున్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

- పెరూ పర్యటనలో పోప్




లిమా : లాటిన్ అమెరికా దేశాల్లో మహిళలపై జరుగుతున్న దాడుల పట్ల పోప్ ఫ్రాన్సిస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడులను అరికట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పెరూ పర్యటనలో ఉన్న పోప్ ట్రుజిల్లో నగరంలో మాట్లాడారు.' లాటిన్ అమెరికా దేశాల్లో మహిళలపై దాడులు, ఆకృత్యాలు శృతిమించాయి. ప్లేగు వ్యాధిలా ఈ దాడులు విజృంభిస్తున్నాయి. వీటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉంది' అని అన్నారు. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం...లాటిన్ అమెరికాలోని 15దేశాల్లో మహిళలపై దాడులు, హత్య ఉధంతాలు అధికంగా జరుగుతున్నాయి. పలు దేశాల్లో మహిళలపై జరుగుతున్న అరాచకాలు బహిర్గతం కావడం లేదన్నారు. మహిళలపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలను, యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై లైంగికదాడులకు, హత్యలకు పాల్పడిన నేరస్థులను కఠినంగా శిక్షించాలని పోప్ కోరారు.

దక్షిణ కొరియాకు ఉత్తర కొరియా 'ఆర్మీ ఆఫ్ బ్యూటీస్'

ప్యాంగ్‌యాంగ్: వరుస అణు క్షిపణి ప్రయోగాలతో ప్రపంచాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. దక్షిణ కొరియాలో వచ్చేనెల వింటర్ ఒలింపిక్ గేమ్స్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో దక్షిణకొరియా ఒలింపిక్స్‌కు ఒక 'అందగత్తెల సైన్యం' బృందాన్ని పంపనున్నారు. ఒలింపిక్స్ వీక్షించేందుకు వచ్చిన వారిని అహ్లాదపరిచేందుకు వీరు వెళ్తున్నారు. ఈ అందగత్తెల బృందాన్ని ఆంగ్లంలో 'ఆర్మీ ఆఫ్ బ్యూటీస్' అని పిలుస్తారు. ఉత్తర కొరియా అథ్లెట్లతో పాటూ ఈ బృందాన్నీ దక్షిణ కొరియాకు పంపనున్నారు. తమ దేశం గురించి మీడియాలో విపరీత ప్రచారం రావాలనే ఉద్దేశంతోనే ఈ బృందాన్ని శత్రు దేశానికి పంపుతున్నట్టు సమాచారం. సైనిక దుస్తుల తరహాలో డిజైన్ చేసిన దుస్తులు ధరించిన 230 మంది నృత్యాలు చేస్తారు. పాటలు పాడతారు. నినాదాలు చేస్తారు.

యూఎస్ విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా ప్రవాస భారతీయురాలు

- మనీషా సింగ్‌తో ప్రమాణం చేయించిన టిల్లర్‌సన్



వాషింగ్టన్ : భారత సంతతికి చెందిన ప్రముఖ అమెరికా న్యాయవాది మనీషా సింగ్(45) యూఎస్ విదేశాంగ శాఖలోని ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాల సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ ఆమె చేత ప్రమాణం చేయించారు. ఈ పదవిలోకి వచ్చిన తొలి మహిళగా ఆమె అరుదైన గౌరవం దక్కించుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పుట్టిన మనీషా...ఉన్నత చదువుల కోసం ఫ్లోరిడాకు వచ్చారు. ఆమె కుటుంబ సభ్యులంతా ప్రస్తుతం ఇక్కడే స్థిరపడిపోయారు. రాజకీయాల్లోకి ప్రవేశించకముందే ఆమె న్యాయవాదిగా పనిచేశారు. అమెరికా విదేశాంగ శాఖలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న అత్యున్నత స్థాయి భారత సంతతి అధికారిగా ఎంపికయ్యారు. కొత్త బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో అమెరికా ఆర్థికపరమైన దౌత్యవ్యవహారాలను ఆమె పర్యవేక్షించనున్నారు.

ట్రంప్ పాలనపై నారీ 'భేరి'

యూఎస్‌లోని 250కి పైగా నగరాలు.. లక్షలాది మంది నిరసన

- అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేకంగా రెండో ఆందోళన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలన ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన అమలు చేస్తున్న విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ లక్షలాది మంది మహిళలు దేశవ్యాప్తంగా వివిధ నగరాలలో భారీ యెత్తున ప్రదర్శనలు నిర్వహించారు. వాషింగ్టన్, న్యూయార్క్, లాస్‌ఏంజెల్స్, చికాగోతో సహా దాదాపు 250కి పైగా నగరాలలో ఈ ప్రదర్శనలు కొనసాగాయి. ఈ ప్రదర్శనల్లో ప్రసంగించిన వక్తలందరూ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు మహిళలకు నరకాన్ని చూపుతున్నాయని విమర్శలు గుప్పించారు. లక్షలాది మంది మహిళలు తమ జీవిత భాగస్వాములతో కలిసి ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా ఏడాది పాలన పూర్తి చేసుకున్న ట్రంప్‌పై నిరసన వ్యక్తం చేస్తూ కొనసాగిన ప్రదర్శనల్లో ఇది రెండోది కావటం విశేషం. వచ్చే నవంబర్‌లో జరుగనున్న కాంగ్రెస్ ఎన్నికల్లో ట్రంప్‌కు ఓటు ద్వారా తగురీతిలో బుద్ధి చెప్పాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. రాజకీయాల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు చేబూని లక్షలాదిగా రోడ్లపైకి తరలి వచ్చారు. ట్రంప్ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ట్రంప్ విదానాలను విమర్శించారు. అమెరికాలో మాత్ర మే కాక ఇతర దేశాల్లోని పలు నగరాల్లో సైతం ట్రంప్ పాల నకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు కొనసాగాయి. లాస్‌ఏం జెల్స్ ర్యాలీలో ప్రసంగించిన నటి ఇవా లంగోరియా మాట్లాడుతూ ప్రజలు తమ శక్తివంతమైన ఓటుతో అధ్యక్షుడికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.



ట్రంప్ ప్రతిస్పందన

మహిళల నిరసన ప్రదర్శనలపై స్పందించిన ట్రంప్ గత ఏడాది పాలనలో తాను అనుసరించిన విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవటమే కాక మహిళలు కూడా లబ్ది పొందారని ట్విట్టర్‌లో వివరించారు. దేశ వ్యాప్తంగా అందమైన ప్రశాంత వాతావరణంలో మహిళలు పురోగతి సాధిస్తున్నారని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. గత 12 నెలల పాలనలో అనేక మైలు రాళ్లను అధిగమించామన్నారు. ఆర్థికపరంగా అనేక విజయాలు సాధించామని, సంపదను సృష్టించామని, మహిళల నిరుద్యోగిత 18ఏళ్ల కనిష్ట స్థాయికి తీసుకు వచ్చామని తెలిపారు. అమెరికా కార్మికశాఖ లెక్కల ప్రకారం గత నెలలో అమెరికాలో మహిళల్లో నిరుద్యోగిత 3.7 శాతం నమోదు కాగా అమెరికా మొత్తమ్మీద 4.1 శాతం నమోదయినట్లు తెలుస్తోంది. అయితే ట్రంప్ వాదనను టెన్నీస్సీలోని నాక్స్ విల్లేకు చెందిన కాంగ్రెస్ సభ్యురాలు కేటీ ఓ కనూర్ కొట్టి పారేశారు. గత ఏడాది పాలనలో ట్రంప్ సర్కారు మహిళలకు ఒరగబెట్టిందేమీ లేదని ఆమె అన్నారు. గత ఏడాది అధికారం చేపట్టిన సమయంలో ట్రంప్ మహిళలపై చేసిన అసభ్య వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళనకారుల్లో అనేక మంది గులాబి రంగులో వున్న 'పుస్సీహాట్స్' టోపీలను ధరించి ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ట్రంప్ గత ఏడాది పాలనాకాలం మహిళల హక్కులను కాలరాసిందని, లైంగిక వేధింపులు, దాడులు పెరిగిపోయాయని సోషల్ మీడియాలో పలువురు నిరసన తెలియ చేశారు. శనివారం నాటి నిరసన ప్రదర్శనల్లో ప్రసంగించిన పలువురు వక్తలు సైతం మహిళలపై పెరిగిపోతున్న లైంగిక దాడులను ప్రస్తావిస్తూ మహిళలను అగౌరవించే సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలని అమెరికన్లకు పిలుపునిచ్చారు.

లాస్‌ఏంజెల్స్‌లో భారీ ప్రదర్శన

ట్రంప్ పాలనకు వ్యతిరేకంగా శనివారం నాడు దేశవ్యాప్తంగా జరిగిన నిరసన ప్రదర్శనల్లో లాస్‌ఏంజెల్స్‌లో జరిగిన ప్రదర్శన అత్యంత భారీగా కొనసాగిందని, దాదాపు 6 లక్షల మంది మహిళలు దీనికి హాజరయ్యారని నగర మేయర్ ఎరిక్ గార్సెట్టీ చెప్పారు. వాషింగ్టన్‌లో జరిగిన ప్రదర్శనలో ప్రసంగించిన డెమొక్రాటిక్ పార్టీ నేతలు గత ఏడాది ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమాని కన్నా తక్కువ సంఖ్యలో హాజరయ్యారని అంచనా వేసారు. అధ్యక్షుడు ట్రంప్ తన పాలన తొలి వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ తాము ఆయన పనితీరుకు 'ఎఫ్' గ్రేడ్‌ను ఇస్తున్నామని ప్రతినిధుల సభలో మైనార్టీ పక్ష నేత నాన్సీ పెలోసీ వ్యాఖ్యానించారు. చికాగో నగరంలో జరిగిన నిరసన ప్రదర్శనలో దాదాపు 2 నుండి 3 లక్షల మంది వరకూ పాల్గొన్నారని అధికారులు అంచనా వేశారు. గతంలో మహిళలు సాధించుకున్న శిశు జననాల నియంత్రణ, సమాన వేతన హక్కుల వంటి వాటిని ట్రంప్ విధానాలు కాలరాశాయని, అందువల్లే పలువురు మహిళలు తొలిసారిగా నిరసన తెలియచేస్తూ రోడ్డెక్కారని విశ్లేషకులు చెబుతున్నారు.

హోండ్యూరస్‌లో అల్లర్లు

- నిరసనకారుడు మృతి



తెగ్యూసిగల్ప: హోండ్యూరస్‌లో అధ్యక్ష ఎన్నికల అనంతరం రాజకీయాలు వేడెక్కాయి. అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థి రిగ్గింగ్‌కు పాల్పడినట్టు రాజకీయ ప్రత్యర్థిపక్షం సభ్యులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ఫలితాలను రద్దు చేసి మరోసారి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో హోండ్యూరస్‌లో ఇరుపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. హోండ్యూరస్ ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం...గతేడాది నవంబర్‌లో హోండ్యూరస్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికలు వివాదాస్పదమయ్యాయి. ఈ ఎన్నికల్లో జువాన్ ఓర్లాండో హెర్నాండెజ్ గెలుపొందారు. ఎన్నికల్లో భారీ అక్రమాలు చోటుచేసుకున్నట్టు ఆయన రాజకీయ ప్రత్యర్థి సాల్వేడర్ నాస్‌రల్లా ఆరోపిస్తున్నారు. ఎన్నికల్లో ఓర్లాండో మద్దతుదారులు, కార్యకర్తలు భారీ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని విమర్శిస్తున్నారు. గతేడాది జరిగిన ఎన్నికలను రద్దు చేసి మరోసారి నిర్వహించాలని పట్టుబడుతున్నారు. సాల్వేడర్ మద్దతుదారులు అల్లర్లు సృష్టించారు. దీంతో, ఈ ప్రాంతమంతా భీతావహంగా మారింది. నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. నిరసనకారులపై పోలీసులు విరుచుకుపడ్డారు. భాష్పవాయుగోళాలు ప్రదర్శించారు. కాల్పులకు తెగబడ్డారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఓ నిరసనకారుడు మృతి చెందాడు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సబా నగరంలో ఈ అల్లర్లు జరిగినట్టు ఎస్పీ తెలిపారు.నిరసనకారులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టయితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకొన్నామని అన్నారు. ఆమ్నెస్టీ హక్కుల పర్యవేక్షణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం...హోండ్యూరస్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల తదనంతరం చోటుచేసుకున్న పరిణామాల కారణంగా ఆదివారం నాటికి మృతిచెందిన వారి సంఖ్య 14కి చేరుకుందని తెలిపింది. వందలాది మంది గాయపడ్డారని పేర్కొన్నది.

సిరియాలో టర్కీ దాడులు : ఎర్డోగన్

డమాస్కస్ : సిరియాలోని కుర్దు తిరుగుబాటుదారుల లక్ష్యంగా దాడులు నిర్వహించినట్టు టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ తెలిపారు. ఆఫ్రిన్ నగరంలో కుర్దు తిరుగుబాటుదారుల కార్యకలాపాలు శృతిమించాయని అన్నారు. అంతేగాకుండా, సిరియాలోని వైపీజీ (పీపుల్స్ ప్రొటెక్షన్ యూనిట్స్) తిరుగుబాటుదారులకు సంబంధించిన శిబిరాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించారు. సిరియా సరిహద్దు గుండా వెళ్తున్న టర్కీ వాహనాలపై వైపీజీ విధ్వంసాలకు పాల్పడుతోందని ఎర్డోగన్ ఆరోపించారు. కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీకి అనుబంధంగా వైపీజీ తమ కార్యకలాపాలు కొనసాగిస్తోందన్నారు. కాగా, వైపీజీ తిరుగుబాటుదారులకు నాటో బలగాలు మద్దతిస్తున్న సంగతి తెలిసిందే. ఈ దాడులను ఆపాలని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు టర్కీ, రష్యా దౌత్యవేత్తలతో ఆదివారం సమావేశమాయ్యరు. ఆఫ్రిన్ తూర్పు ప్రాంతంలో 2016 ఆగస్టు నుంచి గతేడాది మార్చి వరకు వైపీజీ తిరుగుబాటుదారులు, ఐఎస్ ఉగ్రవాదుల లక్ష్యంగా టర్కీ బలగాలు దాడులు నిర్వహించాయి. సిరియాలోని ఉగ్రస్థావరాల లక్ష్యంగా తమ దాడులు కొనసాగిస్తామని ఆర్మీ చీఫ్ జనరల్ హులీసీ అకర్ తెలిపారు. ఇదిలా ఉండగా, సిరియాలోని కుర్దు తిరుగుబాటుల లక్ష్యంగా టర్కీ దాడులకు పాల్పడటాన్ని సిరియా అధ్యక్షుడు అస్సద్ ఖండించారు. 'సిరియాపై దురాక్రమణకు టర్కీ కాలు దువ్వుతోంది' అని అన్నారు. ఆఫ్రిన్ గగనతలంలో టర్కీ యుద్ధవిమానాలు కనిపిస్తే కూల్చేస్తామని హెచ్చరించారు. ఈనేపథ్యంలో సిరియాలో అశాంతియుత వాతావరణం నెలకొనే ప్రమాదముందని ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది. సిరియాలోని టర్కీ దాడులను నిలిపివేసే అంశంపై అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు ప్రకటించింది.

జంపన్న పాత్రపై విచారణ

- రంగంలోకి దిగిన ఐబీ,కోబ్రా
- మావోయిస్టు మిలటరీ కమిషన్‌పైనే వారి కన్ను?

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి




మావోయిస్టు అగ్రనేతగా ఉండి ఇటీవనే లొంగిపోయిన జినుగు నర్సింహారెడ్డి ఎలియాస్ జంపన్నను విచారించడానికి కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో తో పాటు సెంట్రల్ రిజర్వు పోలీసు ఫోర్సులోని యాంటీ నక్సలైట్ కోబ్రా విభాగానికి చెందిన నిఘా అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. గత నెలలో జంపన్న రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. తర్వాత జంపన్నను ఇప్పటి వరకు రాష్ట్ర నిఘా విభాగంతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిషా రాష్ట్రాలకు చెందిన యాంటీ నక్సలైట్ విభాగాల అధికారులు హైదరాబాద్‌కు వచ్చి విచారించారు. దండకారణ్యంలో పార్టీ తాజా పరిస్థితి బలంపైనే దాదాపుగా వారి శోధన సాగిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే తాను అవసరమైనంత మేరకే వారితో మాట్లాడి చాలా వరకు మౌనమే సమాధానంగా జంపన్న ఉన్నట్టు తెలుస్తోంది.

కాగా కేంద్ర స్థాయిలో మావోయిస్టు కార్యకలాపాలపై కన్నేసి ఉంచిన ఐబీలోని ప్రత్యేక విభాగానికి చెందిన అధికారులు లొంగిపోయిన జంపన్న నుంచి ఏ మేరకు సమాచారాన్ని సేకరించగలమనే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా, ఒడిషాతో పాటు మిలట్రీ కమిషన్ బాధ్యుడిగా ఉన్న జంపన్న కొత్తగా ఒడిషా,జార్ఖండ్, దండకారణ్యాన్ని కలిపి ప్రత్యేక జోన్‌గా ఎందుకు ఏర్పాటు చేశారు, దాని వెనుక ఉన్న వ్యూహమేమిటనే కోణంలో సీఆర్‌పీఎఫ్ కోబ్రా నిఘా విభాగం ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మిలట్రీ కమిషన్ రూపు రేఖలు మొదలు దాని బలం, ఎత్తుగడలు, కొత్తగా ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని మావోయిస్టులు వాడుతున్నారు, ఆధునిక ఆయుధాలు ఏమైనా ఉన్నాయా కోణంలో ఇటు ఐబీ, అటు కోబ్రా నిఘా విభాగం ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే ఒక సారి జంపన్నను విచారించిన ఐబీ అధికారులు మరో సారి రానున్నారని తెలిసింది. అలాగే కోబ్రా నిఘా విభాగం అధికారులు సైతం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారని తెలిసింది.

జలగీతం అనువాదం - కొన్ని అనుభవాలు

అనువాదం అనగానే ఒక రచనను ఒక భాషలోకి తీసుకువెళ్లటం అని స్ఫురిస్తుంది. కాని అనువాదం కఠినమయిన పని అని కొంత అనుభవానికి వచ్చింది జలగీతం అనుభవంతోనే. తెలుగులో ఉన్న జలగీతాన్ని సంస్కృతంలోకి చేయాలనుకున్నప్పుడు ఎదురయ్యే మొదటి చిక్కు. డా.ఎన్.గోపి తెలుగు మూలం వ్యవహారిక భాషానుసరణలో రాసింది. సంస్కృతం సంపూర్తిగా వ్యాకరణ పటుత్వం కల భాష. వ్యాకరణాన్ని విస్మరిస్తే ఆ భాషకున్న ఉనికి సృజనలోంచి వెళ్లిపోతుంది. అప్పుడది సంస్కృతం అని చెప్పుకోవడం సరికాదు. వ్యాకరణం చేత సంస్కరించబడినది కదా సంస్కృతం. అనువాదంలో మూలంనుంచి ఏవి పొందాలో అనువాదకునికి తెలియాలి. సీతారాం పండిట్‌ని కలహణ రాజతరంగిణిని అనువాదం చేసిన సందర్భంలో అప్పటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ "రాజ తరంగిణి ఒక చరిత్ర, ఒక కావ్యం కూడా. నిజానికి ఈ రెండు కలిసి ఉండడం ఇబ్బందే. ఈ అనువాదంలో ఆ కలయిక ఇరుకున పడిందని గమనించవచ్చు. ఎందుకంటే, కవిత్వంలోని సంగీతాన్ని గానీ, కలహణ ఉదాత్త మధుర భాషా సౌందర్యాన్ని గానీ అనుభవించే అవకాశం ఇందులో మనకు దొరకదు" -(కలహణ - సోమనాథ ధర్.పే.6) అన్నారు. కవికి ఉండే భాషా సౌందర్యాన్ని, అందులోని నాద మాధుర్యాన్ని తీసుకురావడం అనువాదకునికి అవసరం అని అనిపిస్తుంది ఈ వ్యాఖ్య చూస్తే. ఇండో ఆర్యన్ భాషల్లోంచి ఇండో ఆర్యన్ భాషల్లోకి వెళ్లినపుడు ఇది కొంత సాధ్యమని కూడా అనిపిస్తుంది. తెలుగులో తత్సమ పదాలెక్కువ. లేదా ప్రమాణభాషలో వాటి ఉనికి ఎక్కువ. డా.గోపి అనువాదంలో ఈ పదాలు ఎక్కువ ఉంటాయి. అయితే కేవలం భాష మాత్రమే అనువాదం కాదు. శ్రీనాథుడు నైషధీయ చరితా'న్ని చేస్తున్నప్పుడు తాను చేసిన పనిని చెప్పాడు. అశేష మనీషి హృదయంగమంబుగా శబ్దం బనుసరించియు, అభిప్రాయంబు గుర్తించియు, భావంబు పలక్షించియు, రసంబు పోషించియు, అలంకారంబు భూషించియు, ఔచిత్యం బాదరించియు, అనూచిత్యంబి పరిహరించియు, మాత్రుకానుసారంబున చెప్పబడె" - (శృంగార నైషధం) అన్నాడు. ప్రతీ అనువాదకుడు ఈ అభిప్రాయాలను గమనించాల్సి ఉందనిపిస్తుంది.



చాలా వరకు అనువాదాల్లో మూలంలోని సారం సౌందర్యాల కన్న కవి ఆత్మ యధాతథంగా రావాలనేది చాలా మంది చెప్పే మాట. ముఖ్యంగా తెలుగునుంచి ఇతర భాషలకు అనువాదం చేసేటప్పుడు కొన్ని ప్రశ్నలు సమస్యలు ముందుకొస్తాయి. అందునా గోపి గారి లాంటి సుదీర్ఘ కవితానుభవం, సృజన దీక్ష కలవాళ్ళ కవిత్వంలో కవితాసౌందర్యం, మానవీయ సారం ఎక్కువ. ఈ రెంటినీ కూడగట్టుకోవాల్సిన అవసరం అనువాదకునికి ఎక్కువగా ఉంటుందని అనుకుంటాను. కవిని కావ్యాత్మను, ఆ కవి నిర్మాణ ముఖంగా చేసే సృజన సౌందర్యాన్ని వదిలేసి ఆ అనువాదం మిగుల్చుకునేది ఏ ముంటుంది. అనువాదం అంటే కేవలం శరీరాన్ని ఇతర భాషలోకి మార్చటమే కాదు.

అనువాదంలో మూల లక్ష్యభాషల స్థితులు రెండూ గమనించదగినవి. తెలుగు సంస్కృతభాషల విషయంలో తెలుగులో వర్తమానంలో వస్తున్న కవిత్వ భాష నిర్ణీతమైన వ్యాకరణ సత్వం కన్న వ్యవహార అనుసరణ, సౌందర్యసత్వం ఎక్కువ. సంస్కృతంలో వ్యాకరణం, సౌందర్యం ఈ రెండూ ఒక దానికి ఒకటి సమానంగా నిలుస్తాయి. బహుశ: సంప్రదాయ, ప్రాచీన భాషలు వ్యవహారాలు కాకపోవడం వల్ల వాటిలోని వ్యాకరణ పటుత్వం చెక్కుచెదరకుండా నిలకడగా ఉంటుంది. మరొక విషయం ఏమిటంటే వ్యవహారభాష కవిత్వభాషకు ఆధారమే కాని వ్యవహారమే కవిత్వభాషకాదు. రోమన్ యాకోబ్ సన్ (Roman Jacobson) కవిత్వభాషను అధిభాషగా చెప్పి దానికి రెండు లక్షణాలను ఉదహరించాడు. వాక్యాత్మకత (Syntagmatic), వ్యాకరణాత్మకత (paradigmatic).

మొదటి దానివల్ల ఆధునిక కవిత్వం, కవిత్వ భాష కొన్ని ప్రయోగాలు చేస్తుంది. సమకాలీన వచన కవితా నిర్మాణాలను గమనించిన వాళ్లకు ఇది అర్థమౌతుంది. తెలుగు కవిత్వ భాషలో వాక్యాత్మకత అంటే భాషాగతమైన విన్యాసాలు ఎక్కువ. సాధారణంగా వ్యవహార భాషలోనే వ్యాకరణ నిర్దిష్టత తక్కువ. కవితాత్మకత వల్ల ఇది మరింతగా పెరుగుతుంది.

గోపీ గారి జలగీతాన్ని అనువాదం చేయటంలో ఒకటి రెండు సౌకర్యాలున్నాయి. ఈ కవిత్వ భాషలో తత్సమాలు అంటే సంస్కృతభాషకు సమానాలైన పదాలే ఎక్కువ. మిగిలిన తెలుగుపదాల

గోపీ గారి జలగీతాన్ని అనువాదం చేయటంలో ఒకటి రెండు సౌకర్యాలున్నాయి. ఈ కవిత్వ భాషలో తత్సమాలు అంటే సంస్కృతభాషకు సమానాలైన పదాలే ఎక్కువ. మిగిలిన తెలుగుపదాల వెలుగులు కుడా వాక్యాత్మకంగా వ్యవహారభాషకు ప్రాతినిధ్యాన్నిచ్చేవి. ఈ క్రమంలో పల్లె శ్వాసలు నింపుకున్న మాండలికాలు కూడా సౌందర్యాన్నిస్తాయి. సాధారణంగా వ్యాకరణ పటుత్వాన్ని పాటించే సంస్కృతంలోకి తెలుగు కవితా వాక్యం వెళుతున్నప్పుడు కొన్ని ఇబ్బందులున్నాయి. అవి లింగ వచన విభక్తులకు సంబంధించినవి.

వెలుగులు కుడా వాక్యాత్మకంగా వ్యవహారభాషకు ప్రాతినిధ్యాన్నిచ్చేవి. ఈ క్రమంలో పల్లె శ్వాసలు నింపుకున్న మాండలికాలు కూడా సౌందర్యాన్నిస్తాయి. సాధారణంగా వ్యాకరణ పటుత్వాన్ని పాటించే సంస్కృతంలోకి తెలుగు కవితా వాక్యం వెళుతున్నప్పుడు కొన్ని ఇబ్బందులున్నాయి. అవి లింగ వచన విభక్తులకు సంబంధించినవి.

ఉదా : "ఆకాశం పెంచుకున్న నీలికురుల అమ్మాయిలు మేఘాలు"

- ఈ వాక్యంలో 'మేఘాలు' పుంలింగం, 'అమ్మాయిలు' స్త్రీ లింగం. వీటి సంయోజనం సంస్కృతంలో అడ్డుపడుతుంది. అందుకని - "గగనేన ప్రవర్ధితాః సునీలవేణీ కన్యకాః మేఘబాలాః" అని చేయవలసి వచ్చింది.

ఇలాంటి వాక్యాలు కొన్ని ఈ అనువాదంలో ఉన్నాయి. తెలుగులో ఈ ప్రయోగం సాధారణమైంది, కాని సంస్కృతంలో కాదు.. వ్యవహారంలోని వాక్యాత్మకతను, వ్యాకరణ ముఖంగా అనువాదం చేయడంలో అనువాదకుడు చేయాల్సిన పనులు నాకొక పాఠంలా అనుభవాన్నిచ్చాయి.

భాషీయాలు, సామెతలు, నానుడులు, జాతీయాలు, మాండలికాలు ఒక భాషలోంచి ఒకభాషలోకి వెళ్ళడం కష్టం. గోపిగారి కవిత్వభాష సౌందర్యంలో ఇవి సహజంగానే భాగస్వాములు.

ఉదా : 1.చేతులు కాలిన తరువాత పట్టుకోడానికి ఆకులుండవు.
కరౌ దహనానంతరం పత్రౌ నస్తః
2. మర్రాకు తెప్పమీద కుర్రాడు వస్తాడని అనుకోకండి
వటపత్రప్లవోపరి బాలకః అయాతీతి మా భావయతు
ఉదా : నిగనిగలాడే - నిగారాదిభిః ప్రదీప్తః
రెపరెపలాడే - ప్రపత్ ప్రపత్ శబ్దేన లసంతః

ఇలాంటివి చేస్తున్నప్పుడు వీటిలో నిక్షిప్తమయిన అనుభవం, జ్ఞానం మొదలైనవాటిని దృష్టిలో వుంచుకున్నాను. 'నిగనిగలాడటం' అనుభవానికి సంబంధించింది. ఇది దృశ్యానుభవం. చూపుకు చిక్కేది. 'రెపరెపలాడటం' జ్ఞానం. అనుభవం ఇచ్చిన అంశానికి కట్టిన రూపు జ్ఞానం. ఈ ఉద్దేశంతోనే అనువాదం చేసాను. గోపీ గారు కొన్ని మాండలిక పదాలు, ఇంగ్లీష్ మొదలైన ఇతర భాషా పదాలను ఉపయోగించారు. కొన్ని సంస్కృతంలో సిద్ధరూపం లేనివి కూడా ఉన్నాయి. ఇలాంటి వాటిని సృజనాత్మకంగా చేయవలసి వచ్చింది.

ఉదా : చారికలు -జ్ఞాపకరేఖాః
కన్వేయర్ బెల్టు - సంతులన భ్రమణపట్టకా
రిబ్బను - దీర్ఘపటఖండః
గుండ్రని నవ్వు - వర్తుల దరహాసః
మ్యాజిక్ రిబ్బన్- ఐంద్రజాల దీర్ఘపటఖండః
తూము - నిర్గమమార్గః
ఒండ్రుమట్టి - అనార్ద్రపంకం
పూడిక - మృత్తికాపూర్ణం

చారికలు- అనే పదానికి 'స్మృతిహారికా' అనే పదబంధం సంస్కృతంలో అలావాటు ఉంది. అర్థ సంబంధంగా స్మృతి శబ్దం కొన్ని మార్పులకు లోనైంది. మూలంలోని పదాన్ని అది సంతృప్తి పరచలేదని అనిపించింది. మిగతావీ అంతే. కొన్ని చోట్ల బాంబులు, ప్రోటాన్లు, న్యూట్రాన్లు, ఫ్లోరిన్ లాంటి సాంకేతిక పదాలకు 'నైట్రోజన్- నత్రజని' లాంటివి ఉన్నాయి. కొన్నిటికి లేవు. చేసినా ఎంతగా పాఠకులకు చేరుతాయనేది అనుమానం. ఏ భాషా వ్యవహర్తలైనా, అనువాదకులైనా వీటిని యధాతథంగా ఉపయోగిస్తారు. కొన్నిటిని అలాగే చేసాను.

ఇలా చెప్పుకోడానికి చాలా అంశాలున్నాయి. ప్రధానంగా సంస్కృతానువాదంలో లింగ వచన విభక్తులు గమనిస్తూ చేయడం చాలా అవసరం. ఇతర భాషలలో ఉన్నట్టు తెలుగు నుంచి సంస్కృతంలోకి అనువాదాన్ని దృష్టిలో ఉంచుకుని తయారు చేసుకున్న నిఘంటువులు లేవు. అసలు ఏ భాషలోకైనా ఇలాంటి అవసరం చాలా ఉంది. తెలుగు నేల మీద అనువాదాలపై జరిగిన కృషి చాలా తక్కువ. అందులోనూ సంస్కృతం విషయంలో అసలు లేదనే అనాలి. అందుకోసం కొన్ని ఏర్పాట్లు జరగాల్సిన అవసరం ఉంది. ఈ అనువాదంలో నా తప్పులను నాకు చూపి సలహాలిచ్చిన వారు తిరుపతి వేద విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ మహామహోపాధ్యాయ జి.ఎస్.రామకృష్ణ మూర్తి గారు, సుప్రసిద్ధ సంస్కృత పండితులు డా॥వి.ఏ.కుమారస్వామి గారు వీరిద్దరి సలహాలు ఈ పుస్తకాన్ని అనువాదం చేయడానికి నాలోని ఆలోచనలను తీర్చిదిద్దాయి. తెలుగులో మానవీయ దృష్టితో నీటిని వస్తువుగా చేసుకుని ప్రపంచంలో నీటికి సంబంధించిన బాధలను, చరిత్రను చిత్రించిన ఈ కావ్యం ఈ కాలానికి గొప్ప కావ్యం. ఇప్పటికే పన్నెండు భాషలలోకి అనువదింప బడిన కావ్యమిది. అనేక సంస్కృత కావ్యాలకు వ్యాఖ్యానాన్ని రాసిన మల్లీనాథుడు మహాకావ్యాన్ని గురించి ఒకమాటంటాడు "తత్ర తత్ర నదీ నగర సముద్రవర్ణనాన్మహాకావ్యత్వం" (అక్కడక్కడా నగర నదీ సముద్రాలను వర్ణిస్తే ఆ కావ్యానికి మహా కావ్యత్వం సిద్ధిస్తుంది). జలగీతం నిండా విశ్వంలోని నీటిని గురించి వాటిని ఆనుకున్న నగరాలను గురించి అందులోని మానవుల గురించిన చర్చే ఉంది.

(డా॥ఎన్.గోపి జలగీతం కావ్యానికి గాను ఈ నెల 29 న 'జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్' 'లక్ష్మి నారాయణ జాతీయ పురస్కారం' స్వీకరిస్తున్న సందర్భంగా)

- ఎం.నారాయణ శర్మ

జి.ఎన్.సాయిబాబా జైలు లేఖ



కూతురుకు :
ప్రియమైన మంజీర

మనకిప్పుడు మరింత స్వేచ్ఛ లభించింది

ఆ రోజు
రోహిత్ వేముల
తనకు తాను ఉరి వేసుకొని
'నేను నా గుర్తింపుకు కుదించబడకూడద'ని
ప్రకటించిన నాడు
నా గుండెచప్పుళ్ళు తప్పిపోయినవి

ఆ రోజు
పెరుమాళ్ మురుగన్
'నాలో రచయిత చనిపోయినాడు'
అని ప్రకటించిన నాడు
మగత నిదురలోని ప్రాణాంతక శ్వాస నన్ను కాటేసింది

ఆ రోజు
హన్స్‌దా సత్‌వేంద్ర శేఖర్
'ఆదివాసీ నృత్యం చేయదు'
అని ప్రకటించిననాడు
నా కండరాలు నొప్పితో సలిపినవి

ఆ రోజు
హదియా
కోర్టుగదిలో తన కాళ్ళమీద నిలబడి
'నాకు స్వేచ్ఛ కావాలి'
అని అడుక్కోక తప్పనప్పుడు
జైలుగుహలో
నా ఊపిరి ఆగిపోయింది

అనువాదం : **వరవరరావు**

రామదాసి రాజారాం మహారాజ్ సాహితీ పురస్కారాలు

తేజ ఆర్ట్ క్రియేషన్స్, దివ్య సంజీవని హనుమదాశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో రామదాసి రాజారాం మహారాజ్ స్మారక సాహితీ పురస్కారాలు ఈ నెల 28న ప్రదానం చేస్తారు. ఈ పురస్కారాలను డా॥అయాచితం నటేశ్వర శర్మ, దాస్యం సేనాధిపతి, శ్రీచరణ్, ఏనుగు నరసింహారెడ్డి, వి.పి.చందన్‌రావు, పాయల్ లకు ప్రదానం చేస్తారు. నిజామాబాద్ నిఖిల్ సాయి ఇంటర్నేషనల్‌లో ఉదయం పది గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో డా॥నందిని సిధారెడ్డి, భరత్ నగేష్, డా॥మూడ నాగభూషణం గుప్త, డా॥పోరెడ్డి రంగయ్య, సురేశ్ ఆత్మారాం మహారాజ్, పొద్దుటూరి మాధవీలత, ఘనపురం దేవేందర్, నరాల సుధాకర్ పాల్గొంటారు.

సాహిత్యవార్తలు

'ఆధునిక సాహిత్య విమర్శ' పుస్తకావిష్కరణ

యాకూబ్ రచించిన 'ఆధునిక సాహిత్య విమర్శ' పుస్తకావిష్కరణ ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు హైదరాబాద్ ఎన్టీయార్ స్టేడియంలోని హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో జరుగుతుంది. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి, జి.లక్ష్మీనర్సయ్య, ఎ.కె.ప్రభాకర్ పాల్గొంటారు.

ఉగాది జాతీయ స్థాయి కథల పోటీ

అక్షరాల తోవ సాహిత్య సారధి 'అక్షరాల తోవ సాహిత్య పురస్కారం' పేరుతో ఉగాది జాతీయ స్థాయి కథల పోటీ నిర్వహిస్తోంది. కథలను ఫిబ్రవరి 10 వ తేదీలోపు అక్షరాల తోవ, ఖమ్మం, దాసరోజు శ్రీనివాస్, ఇం.నెం. 11-9-166/1, లెనిన్ నగర్, అసాధారణ్ హాస్పిటల్ వెనుక, ఖమ్మం - 507001 చిరునామాకు పంపాలి.

వివరాలకు : నామా పురుషోత్తం - 9866645218

పత్తిపాక మోహన్‌కు జానుకవి పురస్కారం

మల్లవరపు జానుకవి జయంతి పురస్కారాన్ని పత్తిపాక మోహన్‌కు ప్రకటించారు. ఈ రోజు తేదీ ఒంగోలులో జరిగే జానుకవి జయంతి సభలో ఈ పురస్కారాన్ని అందజేస్తారు.

శబ్ద పరిణామం



బయట నుంచి ఒకటో అరో
అర్థం కాని శబ్దాలు

గడియారపు ముళ్ళ చప్పుడులో
వినిపించే కాలపు అలసట శబ్దం
చెక్కుచెదరని ఆత్మ విశ్వాసాన్ని
కుంగదీసే శబ్దం.
ఆత్మలు విరుగుతున్న శబ్దం
రోజులు కాలుతున్న శబ్దం
అనుబంధాలు నుసిలా మారుతున్న శబ్దం

ఈ శబ్దాలు స్ఫురించే అర్థాలు ఏమిటో
కాలానికే అంతు పట్టడం లేదు.

అక్కడక్కడా కొన్ని రక్తపు చుక్కలు,
కూలిన శకలాలు, తవ్విపోసే ఊహాజనిత కథనాలు


అన్ని అవశేషాల నుండి
బయట పడుతున్న శకుని పాచికలు
శబ్దాల్ని కేవలం శబ్దాలుగానే ఇకపై అనుకోలేం-
వాటికీ ఏవో మర్మార్థాలున్నాయి.
బహు. పరాక్!

- శిలాలోలిత, 919391338676

గుగి బాల్య జ్ఞాపకాలు

రచయితగా, విద్యావేత్తగా, సామాజిక కార్యకర్తగా సుప్రసిద్ధుడైన గుగి కెన్యాలోని ఒక రైతు కుటుంబంలో 1938లో జన్మించారు. కెన్యా, ఉగాండా, బ్రిటన్‌లలో చదువు ముగించుకుని గుగి ఆంగ్ల అధ్యాపకుడిగా నైరోబి విశ్వవిద్యాలయంలో పనిచేశారు. గ్రామీణ ప్రజానాటకరంగాన్ని అభివృద్ధి చేసినందుకు ప్రభుత్వ ఆగ్రహానికి గురై రెండు సంవత్సరాలకు పైగా జైలులో గడిపారు. విడుదలయ్యాక స్వదేశంలో జీవించలేని పరిస్థితుల్లో అమెరికాలో ప్రవాస జీవితం గడుపుతూ, ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. నవలలు, కథలు, నాటకాలు, వ్యాసాలు సంపుటాలుగా వెలువరించారు. వారు 2010లో ప్రారంభించి ఇప్పటికి ప్రచురించిన మూడు భాగాల ఆత్మకథలో ఇది మొదటి భాగం.

బ్రిటీష్ వలసగా వున్న కెన్యాలో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడానికి ఒక సంవత్సరం ముందు పుట్టి, ఊహ తెలిసినప్పటి నుంచి పదహారో ఏట హైస్కూల్‌లో ప్రవేశం దొరికి అక్కడికి ప్రయాణం ప్రారంభించేవవరకు జరిగిన ఘటనలకు, జ్ఞాపకాలకు అక్షరరూపం ఈ 'యుద్ధకాలంలో స్వప్నాలు'. నలుగురు భార్యల తండ్రికి పుట్టిన ఇరవై నాలుగు మంది పిల్లల్లో ఒకడిగా, మూడో భార్యకు అయిదో శిశువుగా 1940 నాటి ఆఫ్రికన్ సమాజంలో తాను అనుభవించిన కష్టాలు, కడగండ్లూ, సామాజిక సాంస్కృతిక విశేషాలు నిండిన ఈ పుస్తకం ఆయన పద్నాలుగో యేట కెన్యాలో ప్రారంభమైన నిషిద్ధ సాయుధ ప్రజా ఉద్యమంలో కలగలిసిన రాజకీయ జీవితాన్ని కూడా స్పృశిస్తుంది. బాల్యంలో మొదలయిన ఈ కథనం స్వయంగా తన అన్న సాయుధ కార్యకర్త కావడం ఒకవైపు, చదువు ద్వారా తల్లికీ, సమాజానికీ సేవ చేయాలన్న తపన ఒక వైపు నిండిన కౌమార దశ దాకా సాగుతుంది.



కెన్యాలో వలస పాలన ప్రారంభదశ, వలస పాలనను నిరసిస్తూ ప్రారంభంలోనే ఎగిసిన పోరాట జ్వాలలు గుగి తండ్రిగారి కథలో మనకు కనిపిస్తాయి. గుగి వ్యక్తిగత కుటుంబ చరిత్ర, కెన్యా దేశపు సార్వజనిక చరిత్ర రెండూ కలగలిసిపోయి కనిపిస్తాయి. కెన్యా వలస దేశంగా రూపొందే క్రమంలో గుగి బాల్యం గడుస్తుంది. సామ్రాజ్యవాద యుద్ధాల మధ్య, తన చుట్టూవున్న పరిస్థితులతో పెనుగులాడుతూ గుగి ఎదుగుతాడు. ఆయన తల్లి నిరక్ష్యరాస్యురాలయిన గిరిజన స్త్రీ. వాళ్ల అమ్మ ఎల్లప్పుడూ గుగిలో స్ఫూర్తి నింపుతూ సలహాలనిస్తూ, మార్గదర్శకంగా నిలుస్తుంది. చదువుకోసం ఆయన కన్న కలలు, ఆత్మస్థైర్యంతో స్వతంత్ర్యంగా ఆలోచించే తత్వాన్ని అలవరుచుకోవడం ఆమె పెంపకంలో గుగి నేర్చుకున్నవే. గుడ వాలసగా పిలవబడే ఆయన సోదరుడు వాలిస వాంగి స్వేచ్ఛా స్వతంత్ర్య పోరాటం, ప్రపంచ జ్ఞానం పొందడం కోసం గుగి పడిన ఆరాటం వీరగాథలను తలపిస్తుంది. ఎలిమెంటరి చదువు పూర్తయ్యేసరికి గుగి మూడు స్కూళ్ళు మారతాడు. వీటి ద్వారా వలసవాద మిషనరీ స్కూళ్ళు స్థానిక విద్యాసంస్కృతులపై కొనసాగించే ఆధిక్యాన్ని, అణచివేతను తెలియజేయగలిగారు. ప్రజారచయితగా జైలు నిర్బంధంలో వుండి రచనలు చేసిన గుగికి, ఆయన జ్ఞాపకాలను ఖైదులో వుంచి అనువాదం చేసిన ప్రొ॥సాయిబాబాకు ఎన్నో పోలికలు కనిపిస్తాయి. ఏ దేశమైనా, ఏ ఖండమైనా రాజ్య స్వభావం ఒకటేనని వీరి ఉదంతం మనకు తెలియజేస్తుంది. ఈ పుస్తకానికి ప్రొ॥సాయిబాబా రాసిన ముందుమాట గుగి జీవిత విశేషాలను తెలియజేస్తే, వరవరరావు రాసిన ముందుమాట సాయిబాబా గురించి తెలియజేస్తుంది. ఈ రెండు ముందుమాటల కోసమైనా ఈ పుస్తకాన్ని తప్పకుండా చదవాలి.

యుద్ధకాలంలో స్వప్నాలు (బాల్య జ్ఞాపకాలు)
మూలం : గుగివాథియాంగో
అనువాదం : ఒ.ఎన్.సాయిబాబా
పేజీలు : 264, వెల : 170/-
ప్రతులకు : నవతెలంగాణ పుస్తక కేంద్రాలు

- కె.పి.అశోక్‌కుమార్

దళితుల బాధలకి అక్షర రూపం



స్వాతంత్ర్యం వచ్చి ఎన్నో దశాబ్దాలు అయినా ఇంకా మనిషి తోటి మనిషి పట్ల సమభావనతో మసులుకోవడం లేదు. మనిషికి మనిషికి మధ్య ఎన్నో అవాంతరాలు. అంటరానివాడని ఊర్లోకి రానీయకుండా వెలేసిన ఘటనలు ఇంకా జరుగుతుండడం ప్రజాస్వామ్యానికి గొప్ప ఉదాహరణగా చెప్పుకునే భారతదేశంలో మాయని మచ్చే. తరతరాల దళితుల బాధలకి అక్షరం రూపమే 'దగ్ధం' కథలు. భూతం ముత్యాలు రాసిన ఈ కథాసంపుటిలో కథలు గుండెల్ని పిండేస్తాయి. అచ్చమైన తెలంగాణ నుడికారంతో సాగే కథలు ప్రజల జీవభాషని పట్టిస్తాయి. పదహారు కథల్లో చాలా వరకు నిజజీవితంలో జరిగినవే కావడం విశేషం.

తను కడజాతికి చెందిన వాడు అయినా ముష్టి ఎత్తుకొనే వారిని చూసి అసహ్యించుకుంటాడు. భార్య ఇది సరికాదు అన్నా కూడా వినిపించుకోడు. చివరికి ఎండకి సొమ్మసిల్లి పోతే, తాను ఎవరినయితే అసహ్యించుకుంటాడో ఆ ముష్టి ఆమెనే నీళ్లిచ్చి వడదెబ్బ నుంచి అతన్ని కాపాడుతుంది. మానవత్వానికి ఏ కులం అక్కర్లేదని చెప్పే కథే 'జాలి'. చదువుకోవాలన్న మీనా ఆశ తాగుబోతు తండ్రి వలన గల్లంతు అవుతుంది. తాగొద్దు అని చెప్పినందుకు కొట్టిన ఫలితంగా అమ్మ అడ్డం పడుతుంది. ఈ హింసని తప్పించుకుందామని వాళ్ళ అమ్మమ్మ ఇంటికి వెళ్తుంది. వెళ్లిన రెండో రోజుకే తండ్రి ఉరేసుకొని చనిపోతాడు అని తెలుస్తుంది. అది తెలిసి మీనా వాళ్ళ అమ్మ కూడా చనిపోతుంది. తాగుడు వ్యసనం కుటుంబాన్ని కాటేస్తే, లేని కులంలో పుట్టడం వలన చదువుకి దూరం అయ్యానని ఆ పసిపిల్ల బాధపడ్తుంది (మీనా).

ఆశయసాధనలో గెలుస్తానో లేదో అన్న అపనమ్మకాన్ని కలిగించిన సమాజాన్ని వెలివేస్తూ ఆశయ్య తీసుకున్న నిర్ణయం విషాదమైనా కూడా తప్పక ఆలోచింపచేస్తుంది. వేల ఏళ్ళ నుంచి అంటరానితనపు బానిసత్వం నుంచి తన జాతిని విడిపించాలని అది అంబేడ్కర్ సూచించిన మార్గంలోనే సుగమం చేసుకోవాలి అనుకుంటాడు. కాలేజ్‌లో, ఇంట్లో, అన్ని చోట్లా అపజయపు భయం ఆశయ్యని వెక్కిరిస్తుంది. తన జాతి ఎదుర్కొంటున్న అంటరానితనాన్ని దేశం నుంచి తరిమికొట్టాలని ఎంతో తపిస్తాడు. చివరికి అమరుడు అవుతాడు. గుండెని మెలిపెట్టే కథనే (ఆశయ్య కల). ఇలాంటి ఆశయ్యలు నేడు ఎందరో అగుపిస్తారు. ఈనాటికీ మన చుట్టూ అంటరానితనపు ఉచ్చులు కలిగివుండటం విచారకరం. ఇవి కేవలం కొన్ని కథలు మాత్రమే. దళితవాడల గురించి, అంటరానితనపు వెతల గురించి, బహిష్కరణ, వెలి ఎంత దారుణంగా ఉంటుందో ఇందులోని కథల్లో చూడవచ్చు.

దగ్ధం కథలలో దళిత సంవేదన ప్రతి అక్షరంలో ప్రతిబింబిస్తుంది. ఈ కథల నిండా 'యాస' తంగేడు పూవోలె మన భాష పరిమళాన్ని నలుదిశలా చాటి చెప్తుంది. అచ్చమైన నుడికారంలో, దళిత వాడల జీవన పరిస్థితులకి నిలువుటద్దం ఈ దగ్ధం కథలు. భూతం ముత్యాలు అంటరానితనపు భావజాలాన్ని, అంటరానితనంతో మనుషుల్ని హింసించే పద్ధతులని నిరసించారు. మనిషి మరో మనిషిని ప్రేమగా చూడని కులాలు, మతాలు ఎందుకని ప్రశ్నిస్తారు. ఈ దగ్ధం కథలు ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట మనకి వినిపిస్తూనే ఉంటాయి. తమ జాతి ఆత్మగౌరవం కోసం అహరహం కృషిచేసే వారికి ఈ కథలు ఊరటనిస్తాయి.

- పుష్యమీ సాగర్, 9032215609

Dwaraka

మానవి

నవతెలంగాణ

manavi@navatelangana.com

హైదరాబాద్ 5

సోమవారం 22-1-2018



రాజస్థాన్‌లో జైపూర్‌కు 60కిలోమీటర్ల దూరంలో ఉండే సొడా గ్రామం మా సొంతూరు. చిన్నప్పుడు ఇక్కడే పెరిగినా.. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని రిషీవ్యాలీలో చదువుకున్నాను. ఆ తర్వాత అజ్మీర్‌లోని మయో కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేశాను. ఢిల్లీలోని లేడీ శ్రీరామ్ కాలేజ్‌లో డిగ్రీ చదివాను. పూణేలోని బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మోడ్రన్ మేనెజ్‌మెంట్‌లో ఎంబీఏ కంప్లీట్ చేశాను. చదువుకునే రోజుల్లో స్కూలు, కాలేజీల్లో నిర్వహించే పోటీల్లో, కల్చరల్ యాక్టివిటీస్‌లో ఆసక్తిగా పాల్గొనేదాన్ని. రాజకీయాలు, ఎన్నికలు వంటి అంశాలపై ఎలాంటి అవగాహన లేదు. కొన్ని నాపై ప్రభావం చూపించాయి. ఆ మార్పు నాతోనే మొదలు కావాలనుకున్నాను. కార్పోరేట్ ఉద్యోగాన్ని.. నగర జీవితాన్ని విడిచిపెట్టాను.

ఒక్కొక్కటిగా...

ఊరి సమస్యలపై గ్రామంలోని పెద్దవారితో చర్చించి.. అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వమని అడిగాను. నా కమిట్‌మెంట్‌కు వారంతా పూర్తి మద్దతిచ్చారు. ఏకగ్రీవంగా 2010లో సర్పంచ్‌గా గెలిచాను. సమస్యలను తెలుసుకోవడం.. వాటి పరిష్కారానికి కావల్సిన నిధులను సేకరించడం.. మొదలు పెట్టాను. ఊరి పెద్దల సహకారంతోనే మొదటిసారి సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్న నాలుగు సంవత్సరాల్లో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. బడి, రోడ్లు, ఆసుపత్రి ఇలా ఒక్కొక్కటే గ్రామస్తులకు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని సంస్థల

గ్రామాన్ని మార్చిన ఆమె క్రియాశీలత

భారతదేశంలో అత్యధిక సంఖ్యలో గ్రామాలు, తక్కువ సంఖ్యలో పట్టణాలున్నా.. ప్రభుత్వాలు మాత్రం స్మార్ట్‌సిటీ అంటూ పట్టణీకరణను ప్రోత్సహిస్తూ.. గ్రామాలను నిర్లక్ష్యం చేస్తున్నారని భావించిన ఒక యువతి వైపై లైఫ్‌ను వదిలి.. పల్లె బాట పట్టారు. ఎంబిఏ పూర్తి చేసి, నెలకు 80వేల రూపాయల ఉద్యోగాన్ని వదిలేసి తమ గ్రామం కోసం ఎనిమిదేండ్లుగా కష్టపడుతున్నారు. గ్రామాలను అభివృద్ధి చేసినప్పుడు దేశం నిజమైన ప్రగతి సాధిస్తుందన్న ఆమె ఆశయాన్ని గౌరవించిన ఆ ఊరి ప్రజలు సర్పంచ్‌గా ఆమెను మొదటిసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె చేసిన అభివృద్ధి పనులను చూసి ఇలాంటి సర్పంచ్ ఉంటే తమ ఊరు ఆదర్శగ్రామంగా మారితీరుతుందన్న విశ్వాసంలో మరోసారి ఆమె నాయకత్వానికి మద్దతునిచ్చారు. ఆమే చావి రజావత్. రాజస్థాన్‌లోని సోడా గ్రామ సర్పంచ్. రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ఎన్నిక కావడంతో పాటు యంగ్ సర్పంచ్‌గా, ఎంబీఏ చదివిన సర్పంచ్‌గా రికార్డు సృష్టించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఆమె మానవితో పంచుకున్న ముచ్చట్లు..



దశాబ్దాల కిందట మా తాతగారు బ్రిగ్ రఘువీర్‌సింగ్ చావి సొడాకు సర్పంచ్‌గా ఉన్నారట. మా నాన్న ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో ఎక్కువగా ఉండటంతో అప్పుడప్పుడు మాత్రమే మేం మా ఊరికి వెళ్ళేవాళ్లం. ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత ఢిల్లీలోనే ఉద్యోగంలో చేరాను. అనేక ప్రముఖ కార్పోరేట్ సంస్థల్లో పనిచేశాను. నెలకు 80వేల రూపాయల జీతం.. అన్ని సదుపాయాలతో... నగరంలో నివాసం. రాజకీయాలు అన్న ఊహనే నాకు లేదు.

దారి మార్చిన పలుకరింపు..

చాలా రోజులు తర్వాత ఒక పండగకు మా ఊరికి వెళ్లాం. ఊరివాళ్లు వచ్చి ఆప్యాయంగా పలుకరించారు. వారందరీ క్షేమసమాచారాలు తెలుసుకునే క్రమంలో ఊరికి సంబంధించిన చాలా వాస్తవాలు తెలిసాయి. సరైన బడి లేదు.. రోడ్లు లేవు. కనీసం తాగడానికి మంచినీళ్ళు లేవు. స్మార్ట్ సిటీలంటూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పట్టణీకరణకోసం కేటాయిస్తున్న ప్రభుత్వాలు గ్రామాలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాయో అర్థం కాలేదు. ఇంట్లో పెద్దవాళ్లతో ఊరి పరిస్థితిపై చర్చ జరిగింది. సరైన నాయకత్వం లేకపోవడం ఒక కారణమైతే.. ప్రభుత్వాల నిర్లక్ష్యం మరో కారణం అని స్పష్టమైంది. గ్రామీణ భారతాన్ని అభివృద్ధి చేయడానికి చదువుకున్న యువత ముందుకు రావాలి అని ఇంట్లో పెద్దవారు అన్న మాటలు



సహకారంతో సురక్షిత మంచినీటి సౌకర్యం తీసుకువచ్చి తాగునీటి సమస్యలను పరిష్కరించాం. ఇండ్లు లేనివారి జాబితా తయారు చేసి వారికి పట్టాలిచ్చి.. సొంతింటిని కట్టుకునేలా ప్రోత్సహించాం. ప్రజల సహాకారంతో చాలా వరకూ వాన నీటిపారుదల, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాం.

విద్యతోనే మార్పు సాధ్యం..

బడిలో ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి.. మౌలిక సదుపాయాలు ఉన్నప్పుడే ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యను అందించడంతో పాటు వృత్తివిద్యాకోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చాం. చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించేలా ఉపాధ్యాయులుకు కౌన్సెలింగ్ ఇచ్చాం. అందుబాటు లోకి వచ్చిన సాంకేతికవిద్యలో వారికి శిక్షణనిచ్చాం. ఉన్నత విద్య అభ్యసించేలా అవకాశాలు కల్పించాం. రోడ్డు సదుపాయాలు కల్పిస్తూ..రవాణాసదుపాయాలు మెరుగుపరిచాం. ఇప్పుడు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు రైతులకు సేంద్రీయవ్యవసాయం పై అవగాహన కల్పించేలా వర్క్‌షాపులు నిర్వహిస్తున్నాం.

దాడులను ఎదుర్కొంటూ..

ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి కొన్ని సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందించాయి. మరికొన్ని కంపెనీలు ఇక్కడి విలువైన భూములను కాజేయాలన్న ఉద్దేశ్యంతో పరిశ్రమలు ఏర్పాటుచేస్తామంటూ వచ్చారు. పంటలు పండే పొలాలను పరిశ్రమల నిర్మాణానికి ఇస్తే పర్యావరణంతో పాటు వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. పరిశ్రమల నిర్మాణాలను అడ్డుకున్నామని మాపై దాడులు చేశారు. అయినా.. ధైర్యంగా రైతుల పక్షాన నిలబడ్డాం. రైతన్న క్షేమమే దేశక్షేమం. రైతులను విస్మరిస్తే.. అంతా క్షామమే అని చిన్నప్పుడు మా తాత చెప్పేమాటల ప్రభావం నాపై ఎంతో ఉంది. మా గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతోనే పనిచేస్తున్నాం.

స్థానిక సంస్థలకు నిధులు పెంచాలి..

కేంద్రప్రభుత్వం స్మార్ట్‌సిటీల కాన్సెప్ట్ తీసుకువచ్చి.. వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పట్టణాభివృద్ధి కోసం కేటాయిస్తుంది. ఈ స్మార్ట్‌సిటీలతో ఎంతమంది జీవితాల్లో మార్పులు వస్తాయి? కేవలం కాంట్రాక్టర్ల జేబులు నిండుతాయి. గ్రామాలను నిర్లక్ష్యం చేయడంతో అక్కడ ఉపాధి కోల్పోతున్న వారంతా పట్టణాల కు వలస వస్తున్నారు. పట్టణీకరణ పెరగడంతో ఎన్నోసమస్యలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం స్మార్ట్ విలేజ్ కాన్సెప్ట్ తీసుకువచ్చి స్థానిక సంస్థలకు నిధులను పెంచితే విద్య, వైద్య, ఉపాధితో పాటు కాలుష్య సమస్య పరిష్కారం అవుతుంది. ప్రభుత్వం పంచాయితీ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామాల ఆర్థికావసరాలను గుర్తించాలి. అప్పుడే గ్రామీణ భారతం సుసంపన్నం అవుతుంది. చదువుకున్న యువత రాజకీయాలకు అతీతంగా తమ ఊరి అభివృద్ధి గురించి ఆలోచించాలి.

వి.యశోద

వెన్ను విరిగేలా..!

మహిళలను అబలలుగా భావించి దాడులు చేస్తుంటారు. తన మాట వినలేదనో.. తాను చెప్పినట్టు నడుచుకోవడం లేదనో కోపంతో విచక్షణారహితంగా దాడులు చేసి ప్రాణాలు హరిస్తారు. ముఖ్యంగా ఆమె గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చేస్తారు. ఇలాంటి సంఘటనల్లో రెప్పపాటు కాలంలో ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. తమపై జరుగుతున్న దాడిని అరికట్టలేక భయంతో వణికిపోతూ.. బేలగా చూస్తూ.. చాలామంది అమ్మాయిలు తమ ప్రాణాలను కోల్పోతారు. ఎంతటి బలవంతుడైనా సరే చేతినే కత్తిగా మార్చి అడ్డుకునే టెక్నిక్స్ ఈ వారం మనం నేర్చుకుందాం..!

1



రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లుతున్న అమ్మాయిని ఎదురుగా వచ్చిన వ్యక్తి అడ్డగించాడు. దారికి ఎందుకు అడ్డంగా నిలబడ్డాడో అని ఆమె ఆలోచించే వ్యవధిలోనే ఆ అమ్మాయి గొంతు నులిమే ప్రయత్నం చేశాడు.

తప్పించుకోవడానికి వీలులేకుండా .దారికి అడ్డంగా నిలబడి.. తన గొంతును గట్టిగా పట్టేయడంతో అమ్మాయి భయపడిపోయింది. ఆ వ్యక్తి చేయి బలంగా గొంతును నొక్కి పట్టడంతో ఊపిరి అందడం లేదు. అయినా సరే తెరుకుని తన గొంతు నులుముతున్న వ్యక్తి చేతిని తన కుడిచేయితో గట్టిగా పట్టుకుంది. ఎడమచేయితో ఆ వ్యక్తి మోచేతి ఫోల్డింగ్‌లో అటాక్ చేసింది.

2



3



ఊహించని ఈ సంఘటనతో ఆ వ్యక్తి తప్పించుకోడానికి ప్రయత్నిస్తాడు. వెనక్కి తిరిగి మరోచేతితో ఆమెపై దాడికి ప్రయత్నిస్తాడు. ఆమె తన ఎడమ చేయితో అతడి దాడిని అడ్డుకోవాలి.

సెల్ఫ్ డిఫెన్స్

4



మరో దాడికి అతడు ప్రయత్నించే అవకాశం ఇవ్వకుండా రెండుచేతులతో అతడిని వెనక్కి వంచుతూ వీపు మధ్యభాగంలో వెన్ను విరిగేలా మోకాలితో అటాక్ చేయాలి. అంతే బాధతో గిలగిలలాడుతూ అతడు కిందపడిపోతాడు.

అమ్మాయిలూ!మీ దారికి అడ్డువచ్చేవారిని, మిమ్మల్ని అడ్డగించేవారిని ఎదుర్కోవడానికి పదునైన ఆయుధాలు అవసరం లేదు.. మీ చేతులే ఆయుధాలు.. వాటికి ఆత్మవిశ్వాసాన్ని జత చేస్తే చాలు.



ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170, 9949039049

రోజు రోజుకు ఒత్తిడి అధికమవుతూనే ఉంది. కుటుంబ సంబధిత సమస్యలు, ఆఫీసు పనులు వలన మెదడులో రసాయనిక మార్పులు జరిగి ఒత్తిడికి కారణం అవుతున్నాయి. కానీ ఇలా ఒత్తిడికి గురైనప్పుడల్లా బాధపడకుండా ఒత్తిడిని అదుపులో ఉంచుకునే చిట్కాలను పాటిస్తే సరిపోతుంది. అవేంటో తెలుసుకుందాం!

అదుపులో ఉంచుకోవాలంటే!

విటమిన్ 'బి': ఇది మెదడు, నాడీ వ్యవస్థ కు విశ్రాంతిని అందిస్తుంది. అలాగే మెదడు పని తీరును మెరుగుపరుస్తుంది. తృణధాన్యాలు, బీన్స్, పీ నట్స్, కాలేయం, గుడ్లు, పాలు వంటి పదార్థాలలో విటమిన్ 'బి' అధికంగా ఉంటుంది.

వేడినీటి స్నానం: వినడానికి సరదాగా ఉన్న వేడి నీటితో స్నానం మానసికంగా చాలా ప్రశాంతతను చేకూర్చుతుందని చెబుతున్నాయి పరిశోధనలు. ఐదు నిమిషాల పాటు వేడి నీటితో స్నానం చేయటం వలన కండరాలు విశ్రాంతికి గురవటమేకాకుండా, ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారు.



గ్రీన్ టీ: గ్రీన్ టీ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది చాలాసార్లు విని ఉంటారు. ఇది పాలీఫినాల్, ఫ్లావనాయిడ్స్, క్యాటెచిన్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉండి మెదడును ప్రశాంతతకు గురి చేస్తుంది. అంతే కాకుండా దీంట్లో ఉండే 'థయామిన్' అనే అమైనో ఆసిడ్ ఒత్తిడిని తగ్గిస్తుంది.

వ్యాయామం: వ్యాయామాలు మెదడుకు చాలా ఆరోగ్యకరం. దాంతో పాటు ఒత్తిడిని అధిగమించటంలో బాగా పని చేస్తుంది. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం వలన ఆత్మవిశ్వాసం పెరగటమేకాకుండా, శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ఆమ్ల గుణాలు ఉంటే చాలు!



అందంగా రెడీ అయ్యేక తల బాగా దురద పెడితే ఎలా ఉంటుంది! చాలా చికాకుగా, పిచ్చిలేచినట్టనిపిస్తుంది కదా! మరీ ఆ దురదకు చుండ్రు రాలితే చెప్పలేనంత కోపం, భయం పుట్టుకొస్తుంది. చుండ్రు ఎక్కువ కావడానికి దుమ్ము, దూళి, ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు కారణం అవుతాయి. చుండ్రును నివారించడానికి ఉత్తమైన మార్గం ఆమ్ల గుణాలు కలిగిన ఉసిరి, నిమ్మకాయ, కుంకుడు కాయ వంటివి ఉపయోగిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

- అత్యధికంగా ఆమ్ల గుణాలను కలిగి ఉంటుంది నిమ్మకాయ. రెండు చెంచాల నిమ్మ రసంలో రెండు చెంచాల ఉసిరి రసాన్ని కలిపి తలకు బాగా రాసుకోవాలి. ఇలా 30 నిమిషాలు పట్టించాలి. ఆ తర్వాత గోరు వెచ్చటి నీటితో శుభ్రంగా కడిగితే సరిపోతుంది. ఇలా క్రమం తప్పకుండా చేస్తే నెత్తిమీద ఉండే మృత కణాలు పూర్తిగా తొలగిపోతాయి. ఫంగల్ ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకోవచ్చు.
- జుట్టు పెరుగుదలకు, చుండ్రు నివారణకు పెరుగు కీలకమైన పాత్ర పోషిస్తుంది. పెరుగు చుండ్రు నివారణకు సహజ సిద్ధమైన ఎంజైమ్‌లను విడుదల చేస్తుంది. రెండు చెంచాల పెరుగులో ఒక చెంచా నిమ్మరసం కలిపి నెత్తికి, వెంట్రుకలకు పెట్టుకోవాలి. ఇలా 30 నిమిషాల వరకు పట్టించాలి. ఆ తర్వాత షాంపూతో శుభ్రం చేసుకుంటే చుండ్రు సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.
- తేనె, నిమ్మరసం యాంటీ ఇన్‌ఫ్లమెంటరీ, యాంటీ బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది. అదే విధంగా వెంట్రుకలను హైడ్రేట్ చేయడంతో పాటు దురద, చుండ్రు నివారణకు తోడ్పడుతుంది. ఒక చెంచా నిమ్మరసంలో మూడు చెంచాల తేనె కలిపి తలకు రాసుకోవాలి. ఇలా 20 నిమిషాలు పట్టించాలి. ఆ తర్వాత షాంపూ పెట్టి స్నానం చేస్తే సరిపోతుంది. ఇలా క్రమం తప్పకుండా నాలుగు లేదా ఐదు రోజులు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- రెండు చెంచాల టీ పౌడర్ లో నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు 20 నిమిషాలు పట్టించాలి. ఆ తర్వాత గోరు వెచ్చటి నీటితో సాన్నం చేస్తే చుండ్రు పూర్తిగా తొలగిపోతుంది. టీ పౌడర్, నిమ్మరసం మంచి యాంటీ ఆక్సిడెంట్‌లా పని చేస్తుంది.



పొద్దుతిరుగుడు గింజలు...

పొద్దుతిరుగుడు గింజలు ఆరోగ్యానికి చాలా మంచిది. వీటి ద్వారా లభించే నూనె ఔషధగుణాలను కలిగి ఉంటుంది. కాబట్టి ఎముకలకు బలాన్ని చేకూర్చడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయని చెబుతున్నాయి కొన్ని పరిశోధనలు. అవేంటో తెలుసుకుందాం!

- పొద్దుతిరుగుడు గింజల్లో విటమిన్ 'సి', సెలీనియం, కాపర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి సహజ సిద్ధమైన యాంటీ ఆక్సిడెంట్స్. పొద్దుతిరుగుడు గింజల్లో ఉండే సెల్యులార్ క్యాన్సర్ ను నివారిస్తాయి. అదే విధంగా కొలన్ క్యాన్సరును నియంత్రణలో ఉంచుతుంది.
- మెగ్నీషియం పొద్దుతిరుగుడు గింజల్లో సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. క్యాల్షియం, మెగ్నీషియం ఎముకల పెరుగుదలకు, దృఢత్వానికి ఉపయోగపడతాయి.
- ముఖ్యంగా ఈ గింజల్లో ఉండే మెగ్నీషియం ఒత్తిడిని తగ్గిస్తుంది. నాడీవ్యవస్థను ప్రశాంతంగా ఉంచడంతో పాటు మైగ్రేన్ తల నొప్పిని అదుపులో ఉంచుతుంది.
- పొద్దుతిరుగుడు గింజలు కొలెస్ట్రాల్ లెవల్స్ పెరగకుండా కాపాడుతాయి. అంతే కాదు వీటిలో ఉండే హై ఫైబర్ కంటెంట్ బరువు తగ్గించడంలో బాగా సహాయపడతాయి. అలాగే దీంట్లో పాలీ అన్‌సాచ్యురేటెడ్ కొవ్వు ఆమ్లాలు, ఒమెగా 6 కొవ్వు ఆమ్లాలు సమద్ధిగా ఉంటాయి.
- పొద్దుతిరుగుడు గింజలు జీర్ణక్రియ శక్తిని మెరుగుపరుస్తాయి. అలాగే మలబద్ధకం నుంచి కాపాడుతాయి. కాబట్టి పొద్దుతిరుగుడు గింజలు తిన్నా, నూనె వంటాల్లో ఉపయోగించిన ఆరోగ్యానికి మంచిది.

ఆంధ్రప్రదేశ్

షెడ్యూల్ ప్రకారమే టెట్ : మంత్రి గంటా

అమరావతి : ప్రస్తుత షెడ్యూల్ ప్రకారమే ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) జరుగుతుందని విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ షెడ్యూల్‌లో ఏలాంటి మార్పు ఉండదని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5 నుంచి 15 వరకు టెట్ నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షల షెడ్యూల్ మారుతుందన్న వదంతుల్ని అభ్యర్థులు నమ్మొద్దని స్పష్టం చేశారు. కాగా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 4,36,311 మంది ఆన్‌లైన్ ద్వారా టెట్‌కు ఫీజు చెల్లించారు. 4,26,333 మంది అభ్యర్థులు దరఖాస్తుల్ని సమర్పించారు. పేపర్-1(ఎస్జీటి)కు 1,71,403 మంది ఫీజు చెల్లించగా, 1,68,754 మంది దరఖాస్తులు సమర్పించారు. పేపర్-2(ఎస్ఎ)కు 2,12,337 మంది ఫీజు చెల్లించగా, 2,07,567 మంది దరఖాస్తుల్ని సమర్పించారు. భాషా పండితులు(పేపర్-3)కు 40,288 మంది ఫీజు చెల్లించి, దరఖాస్తులు సమర్పించారు. పేపర్ -1, 2కు 11,003 మంది ఫీజు చెల్లించగా, 10,986 మంది దరఖాస్తుల్ని సమర్పించారు. పేపర్-1, 3కు 1,280 మంది ఫీజు చెల్లించి, దరఖాస్తుల్ని సమర్పించారు.

బాబు నల్లధనం దావోస్‌లో భద్రం : జగన్

శ్రీకాళహస్తి : ముఖ్యమంత్రి చంద్రబాబు దోచుకుంటున్న అవినీతి సొమ్మును దావోస్‌లో దాచుకుంటున్నాడని ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. బాబు స్వలాభాల కోసం చిత్తూరులోని విజయ పాల డెయిరీని, గాజులమండ్యం, చిత్తూరు చక్కెర కర్మాగారాలను మూసి వేయించారని ఉద్ఘాటించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఆదివారం శ్రీకాళహస్తికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పెండ్లి మండపం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. చంద్రబాబు నాలుగేండ్ల పాలనలో ప్రజలు నరకాన్ని చూస్తున్నారని వాపోయారు. ఏ ఒక్కరూ కూడా చంద్రబాబు పాలనపై సంతృప్తితో ఉన్నట్లు చెప్పడం లేదని, సొంత జిల్లా చిత్తూరుకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఆయన స్వలాభాలకు పాడిరైతుల పొట్టనింపుతున్న చిత్తూరు విజయ డెయిరీని మూసి వేయించారనీ, తద్వారా ఆయన సొంత డెయిరీ హెరిటేజ్‌ను లాభాల బాట పట్టించి కోట్లు కూడగట్టాడని ఆరోపించారు.

ఫ్రెండ్లీ పోటీ

టీఆర్ఎస్, టీడీపీల మధ్య ఒప్పందం?

- పాతబస్తీలోనూ ఎంఐఎంతో అదే పద్ధతి
- బీజేపీ కూడా చేరే అవకాశం..

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

సాధారణ ఎన్నికలకు గడువు మరో ఏడాది ఉండడంతో ఇప్పట్నుంచే 2019 ఎన్నికలపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఏయే పార్టీ ఏమేమి చేయబోతుంది. ఎటు ఉండబోతుంది అన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా అధికార టీఆర్ఎస్‌పార్టీపైనే అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడుకుంటున్నాయి. టీఆర్ఎస్‌పార్టీ స్వతంత్రగానే ఉంటుందని, ఎవరితోనూ పొత్తు కలవబోమని, కలుపుకోబోమని ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భంగా సెంటిమెంట్ ఆధారంగా 2014 ఎన్నికల్లో గట్టెక్కినా, ఆ సూత్రం 2019 ఎన్నికల్లో పనిచేయబోదని టీఆర్ఎస్‌పార్టీ నాయకత్వం ఒక అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది. సొంతంగా 63 స్థానాల్లో గెలిచినా, ఆ తర్వాత టీడీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, వైఎస్ఆర్‌సీపీ, సీపీఐ ఎమ్మెల్యేలను చేర్చుకున్న విషయం తెలిసిందే. అయినా ఎమ్మెల్యేల సంఖ్య పెరిగినా క్షేత్రస్థాయిలో టీఆర్ఎస్‌పార్టీకి నిర్మాణం లేదు. చాలామంది ఎమ్మెల్యేల పట్ల ప్రజల్లోనూ, సొంత పార్టీ కార్యకర్తల నుండి వ్యతిరేకత ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న నేతలు, ఆ తర్వాత రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్‌పార్టీలో చేరిన నేతల మధ్య సఖ్యత లేదు. ఇది ఎన్నికల్లో మరింత పెనుప్రమాదానికి దారితీసే అవకాశం ఉందనేది కొంతమంది గులాబీ నేతలు చెబుతున్న వాదన. ఇలాంటివి ఉంటే గట్టెక్కడం చాలా కష్టమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో తమది ఫ్రెండ్లీ ప్రభుత్వమని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులతోనూ, పోలీసులతోనూ అలాగే వ్యవహరించారు. వచ్చే ఎన్నికల్లో ఆ పద్ధతినే పాటించేందుకు సిద్ధమయ్యారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఎంఐఎం టీఆర్ఎస్‌పార్టీకి స్నేహహస్తం అందించింది. మిత్రపార్టీగానే టీఆర్ఎస్‌పార్టీ చెప్పుకుంటున్నది. ఎంఐఎం కూడా టీఆర్ఎస్‌ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నట్టుగా తెలిపింది. అయితే ఎన్నికల్లో మాత్రం ఎంఐఎం పోటీ చేసే స్థానాల్లో టీఆర్ఎస్‌పార్టీ నుండి డమ్మీ అభ్యర్థులే ఉండనున్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి వెల్లడించారు. ఎంఐఎం పోటీ చేసే స్థానాల్లో వారిని ఓడించాలని తాము కోరబోమని, ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరతామని అన్నారు. తమ ఓట్లు వేరేవారికి పడకుండా ఉండడం కోసమే టీఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి పోటీలో ఉంటారని చెప్పారు.



పోటీచేసిన వారికి ఏదో రకంగా నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పిస్తామని అంటున్నారు.

ఇదే సూత్రంతో మైత్రీ కొనసాగించేందుకు టీఆర్ఎస్, టీడీపీ ఒక అవగాహనకు వచ్చాయని తెలిసింది. 2014 ఎన్నికల్లో టీడీపీకి 19 శాతం ఓట్లు పడ్డాయి. టీడీపీ తరపున గెలిచిన ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు మినహా మిగతా వారు టీఆర్ఎస్‌పార్టీలో చేరారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అయినా టీడీపీ ఓటు బ్యాంకు ఇప్పటివరకు చెక్కు చెదరలేదని టీఆర్ఎస్‌పార్టీ నేతలు చెబుతున్నారు. పోటీచేయకుండా దూరంగా ఆ ఓట్లు ఇతర పార్టీలకు వెళతాయన్న భయం అధికారపార్టీకి పట్టుకుంది. అందుకే ఫ్రెండ్లీకాంటెస్ట్‌లో ఉండేందుకు అంగీకారం కుదిరినట్టు తెలిసింది. ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకోవడం అన్నమాట. కొన్నిచోట్ల టీడీపీ గెలిచే అవకాశం ఉంటే, అప్పటికప్పుడు ఆ పార్టీ అభ్యర్థికే మద్దతు ఇచ్చేలా రహస్య ఒప్పందం చేసుకుంటారని వినికిడి. తెలంగాణలో టీడీపీని నామరూపాల్లేకుండా చేయాలని టీఆర్ఎస్‌పార్టీ మొదట్లో గట్టిగానే అనుకొంది. ఇప్పుడు ఆ నిర్ణయాన్ని రద్దు చేసుకున్నట్టు కనిపిస్తున్నది. ఎన్నికల్లో అవసరమేరకు సహకారం తీసుకునేందుకు ఇరు పార్టీల నాయకత్వాలు ఒక అవగాహనకు వచ్చినట్టు తెలుస్తోంది. ఎన్డీఏలో టీడీపీ కూటమి ఉంటే బీజేపీ కూడా ఈ ఫ్రెండ్లీకాంటెస్ట్‌లో చేరే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఇటీవల నాగం జనార్దన్‌రెడ్డి చేసిన విమర్శలే ఉదాహరణగా నిలుస్తున్నాయి. బహిరంగంగా ప్రభుత్వంపై విమర్శలు చేసినా అంతర్గత రహస్య ఒప్పందాలు నడుస్తున్నాయని నాగం చేసిన విమర్శలను కొంతమంది గుర్తు చేస్తున్నారు.

మోత్కుపల్లితో మందకృష్ణకు చెక్?

- ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహం
- టీఆర్ఎస్‌లో ఆహ్వానించి పదవి కట్టబెడతారని ప్రచారం

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

టీడీపీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించినా, దాని వెనుక పెద్ద వ్యూహమే ఉందని రాజకీయంగా చర్చ నడుస్తున్నది. ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణ మాదిగ వ్యవహారంతో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం ఇబ్బందులు పడుతున్నది. దళితుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దీనిని ప్రతిపక్షాలు అనుకూలంగా మలుచుకోవడంతో గులాబీ నేతల్లో గుబులు మొదలైంది. మందకృష్ణకు ధీటుగా మాట్లాడగలిగే నేతలు టీఆర్ఎస్‌లో లేరు.

కడియం శ్రీహరి ఉన్నా ఆయన మాటలను సీరియస్‌గా తీసుకోవడం లేదన్నది అధికారపార్టీ నేతల వాదన. మోత్కుపల్లిని తీసుకుంటే అన్ని విధాల ఉపయోగం ఉంటుందన్న ఆలోచనతోనే, ఆయనతో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వంతో ముందుగానే మాట్లాడి ఉండొచ్చని ప్రచారం జరుగుతున్నది. ఈ విషయాన్ని టీఆర్ఎస్‌పార్టీ నేతలు ఖండించకపోయినా బహిరంగంగా చెప్పేందుకు ఇష్టపడడం లేదు. పైగా మంత్రులు స్వాగతించారు. ఇప్పటికే కేసీఆర్, మోత్కుపల్లి మధ్య ఒప్పందాలు జరిగి ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గవర్నర్ పదవి వస్తుందని ఎప్పట్నుంచో మోత్కుపల్లి ఎదురుచూశారు. ఆ తర్వాత రాజ్యసభపై ఆశ పెట్టుకున్నారు. ఆ రెండూ గ్యారంటీ లేకుండా పోయాయి. దీంతో దీంతో ఆయన మాట మార్చారన్న చర్చ జరుగుతున్నది అధికార పార్టీలో చేరితే మోత్కుపల్లికి రాజ్యసభ పదవి ఇస్తారని ప్రచారం జరుగుతున్నది. మోత్కుపల్లితో పాటు జిట్టా బాలకృష్ణారెడ్డి గులాబీ తీర్థం పుచ్చుకోనున్నారు.

కాళేశ్వరం కాదు.. సిరిసిల్ల ఆత్మహత్యలు చూడు!

- గవర్నర్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడవెంకట్‌రెడ్డి చురకలు



మహాసభలో మాట్లాడుతున్న చాడ

నవతెలంగాణ -కరీంనగర్ రూరల్

కాళేశ్వరం కాదు.. సిరిసిల్ల చేనేత కార్మికుల ఆత్మహత్యలను చూడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడవెంకట్‌రెడ్డి గవర్నర్ నరసింహన్‌కు చురకలంటించారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం నియంతపాలన కొనసాగుతోందన్నారు. కరీంనగర్ రూరల్ మండల మహాసభ బొమ్మకల్‌లో ఆదివారం నిర్వహించారు. అనంతరం చాడ విలేకర్లతో మాట్లాడుతూ... నేరేళ్ల ఘటనలో దళితులు, నిమ్నవర్గాలపై పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించి వారి బతుకులు నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల, ప్రజా సమస్యలపై అన్ని వామపక్ష పార్టీలను కలుపుకొని పోరాటం సాగిస్తామన్నారు. గవర్నర్ నరసింహన్ కాళేశ్వరాన్ని సందర్శించి ప్రాజెక్టుకు కాళేశ్వరం చంద్రశేఖర్ అని పేరుపెడదామని అనడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో ఇసుక, డ్రగ్‌మాఫియా, నయీం, జాన్సన్ మాఫియాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో పరోక్ష విధానం వల్ల ధనబలం, కండబలం ఉన్నవారే నాయకులవుతారని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ లక్షా12వేల ఉద్యోగాలు ఉన్నాయని ప్రకటించి, కేవలం 7వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశారని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి 8 నెలలు గడుస్తున్నా ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లేందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లలేదన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 24న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కాల్వ నర్సయ్య యాదవ్ పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో బూర్జువా పార్టీలు

ఎంసీపీఐ(యూ) చర్చాగోష్టిలో ఉపేందర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో యూపీఏ, ఎన్డీయే, టీడీపీ, టీఆర్ఎస్ వంటి బూర్జువా పార్టీల జెండాలు వేరైనా, వాటి ఎజెండాలు ఒక్కటేనని మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ (ఎంసీపీఐయూ) చర్చాగోష్టిలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి విమర్శించారు. సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో ఆ పార్టీలు పనిచేస్తున్నాయని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో 'వర్తమాన రాజకీయాలు-ప్రత్యామ్నాయ మార్గాలు-కమ్యూనిస్టుల కర్తవ్యం'అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామ్రాజ్యవాదులతో బూర్జువా పార్టీలు కలిసి దేశసంపదను దోచుకుంటున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద చర్యలకు పాల్పడుతోందని చెప్పారు. ఆహారం, దుస్తులు, ఆచారాలు, సాంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ ప్రయివేటు గూండాలను ఉసిగొల్పి ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయని అన్నారు. దళిత, గిరిజన, మైనార్టీ, అభ్యుదయవాదులు వ్యతిరేకంగా మాట్లాడితే హత్యలకూ వెనుకాడ్డం లేదన్నారు. అధ్యక్షత వహించిన ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రజలకు న్యాయం జరగాలంటే ప్రత్యామ్నాయ ఆర్థిక, సామాజిక, రాజకీయ దృక్పథం కలిగిన వామపక్ష కమ్యూనిస్టు పార్టీల ప్రభుత్వాలు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి కూతురు రాజేశ్వరీ, ఎంసీపీఐ(యూ) నాయకులు సింగతి సాంబయ్య, ఎల్ శ్రీనివాస్‌రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, బి బాబు, జి మల్లేష్, బాబురావు, మార్టిన్‌బాబు, కళావతి, న్యాయవాదులు సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌పై వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలి

కాంగ్రెస్ నాయకులపై మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

నవతెలంగాణ-మంథని/అంతర్గాం

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి పనులు బాగున్నాయని రాష్ట్ర ప్రభుత్వ పనితీరును మెచ్చుకున్న గవర్నర్ నరసింహన్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథనిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆదివారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గవర్నర్ ప్రాజెక్టులను పరిశీలించిన అనంతరమే దేశంలోనే ఎక్కడా లేని విధంగా పనులు జరుగుతున్నాయని అభినందించారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉన్న గవర్నర్ పట్ల ఈ విధంగా అనడం వారి అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో తెలంగాణలో ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నపుడు ప్రాణహిత ప్రాజెక్టుకు ఒక్క అనుమతి అయినా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. మంథనిలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ఎన్నేండ్లయినా ఎందుకు పూర్తికాలేదన్నారు. గొర్రెల పథకం ఎంతో బాగుందని సీఎం కేసీఆర్‌ను కర్ణాటక రాష్ట్ర మంత్రి పొగిడితే ఆయనపై వారి అధిష్టానానికి ఫిర్యాదు చేసే దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని తప్పుబట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 108 లాంటి పథకాలను తాము స్వాగతించామని, ఎన్నడైనా ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నం చేశామా అని ప్రశ్నించారు. వెంటనే గవర్నర్‌పై చేసిన వాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. సమావేశంలో మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, సర్పంచ్ పుట్ట శైలజ,



ఎంపీపీ ఏగోళపు కమల, ఏఎంసీ చైర్మన్ ఆకుల కిరణ్, కమాన్‌పూర్ జడ్పీటీసీ సంపత్‌యాదవ్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొండ శంకర్ పాల్గొన్నారు.

పంప్‌హౌస్ పనులపై ఆగ్రహం

అంతకుముందు అంతర్గాం మండలం గోలివాడలో వద్ద నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు పంప్‌హౌస్ పనులను మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. మిగతా ప్రాజెక్టుల పంప్‌హౌస్ వద్ద జరుగుతున్న పనులకంటే ఇక్కడ పనులు వేగంగా జరగట్లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే జూన్ మాసం వరకు కాంక్రీటు పనులు పూర్తి చేసి మోటార్ల ద్వారా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు, స్థితిగతులను నీటిపారుదల శాఖ ఎస్ఈ సుధాకర్ మంత్రికి వివరించారు. అనంతరం మంథని మండలంలోని సిరిపురం వద్ద సుందిళ్ల బ్యారేజీ, కాసిపేట పంప్‌హౌస్ నిర్మాణాలను మంత్రి పరిశీలించారు.

రాజ్‌భవన్‌ను టీఆర్ఎస్ భవన్‌గా మారుస్తారేమో?

గవర్నర్‌పై భట్టి ఆగ్రహం

- కేసీఆర్‌పై దిగజారి పొగడ్తలా?
- ప్రాజెక్టుల అవినీతిలో గవర్నర్‌కు భాగస్వామ్యం : వీహెచ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించినంతరం రాష్ట్ర గవర్నర్ ఈఎల్ఎస్ నరసింహన్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకమని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై గవర్నర్ స్థాయికి దిగజారి పొగడ్తల్లో ముంచేత్తారని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం ద్వారా వచ్చిన ఆ పదవిని గవర్నర్ అపహాస్యం పాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్‌భవన్‌ను టీఆర్ఎస్ భవన్‌గా మారుస్తారేమోనని సందేహం కలుగుతుందన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మాజీ ఎంపీ వి హనుమంతరావు, మాజీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు వల్ల పదవికే కలంకం తెచ్చే విధంగా వుందని, రాజ్యాంగాన్ని అవమాన పరిచేలా ఆయన చేష్టలు వున్నాయన్నారు. గవర్నర్ కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన తర్వాత దానికి సంబంధించిన నిజాలు తెలుసుకోకుండా అద్భుత కార్యక్రమంగా పేర్కొనడం సరైందికాదన్నారు. ప్రాజెక్టుల నుంచి వచ్చే కమీషన్ల కోసం పొగుడుతున్నారా? పదవి కొనసాగింపు కోసం పొగుడుతున్నారా? ప్రజలకు చెప్పాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుంటే దాని గురించి ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పనలోనే పెద్ద అవినీతి దాగుందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలోనే అప్పటి ప్రభుత్వం బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ళ పేరుతో ఈ ప్రాజెక్టును రూ 38వేల కోట్ల బడ్జెట్ కేటాయించి, ఈపీసీ పద్ధతిలో పనులను అప్పగించామన్నారు. రూ 10వేల కోట్ల పనులను కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు.

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాన తర్వాత దాని పేరును కాళేశ్వరంగా మార్చడంతోపాటు వ్యయం కూడా రూ.85వేల కోట్లకు పెంచిందని విమర్శించారు. ప్రాజెక్టు పేరు మారినంత మాత్రాన భారీ మొత్తంలో ఖర్చు ఎందుకు పెరుగుతుందని ప్రశ్నించారు. అదే సమయంలో ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టులకు సంబందించి దుమ్ముగూడ ఫేస్ -1 కింద రూ1681కోట్లతో పనులను ప్రారంభించి దీనికి అప్పటి ప్రభుత్వం రూ 882కోట్లు ఖర్చు చేసిందని, దుమ్ముగూడం ఫేస్ -2కు సంబందించి రూ1104కోట్లకు అప్పటి ప్రభుత్వం రూ.662కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు. మిగితా రూ 1421 కోట్లు ఖర్చు చేస్తే పనులు పూర్తి కావాల్సి వుండగా ఈ ప్రభుత్వం దాని పేరును సీతారామా ప్రాజెక్టుగా పేరు మార్చి వెంటనే రూ.10వేల కోట్లకు వ్యయం పెంచిందన్నారు. ఎల్లంపల్లి, మేడిగడ్డ ప్రాజెక్టుల వ్యయం కూడా పెంచారని విమర్శించారు. ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టుల విషయంలోనే సుమారు 80వేల కోట్ల భారీ అవినీతికి తెరతీసిందని ఆరోపించారు.

రాష్ట్ర విభజన చట్టంలోనే ప్రాణహితకు జాతీయ హోదా కల్పించాలని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కోరిందని, దాని గురించి టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించి వుంటే నేడు రాష్ట్రంపై ఒక రూపాయి భారం పడేదికాదన్నారు. టీఆర్ఎస్‌ప్రభుత్వం రీడిజైన్ల పేరుతో ప్రయివేట్ బ్యాంకుల నుండి కమర్షియల్ రేట్ ఆఫ్ ఇంట్రెస్ట్‌కు అప్పులు తీసుకు వచ్చి ప్రజలపై భారం మోపుతుందని విమర్శించారు. ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో కూడా వారికి అన్యాయం చేసిందని, 2013 చట్టానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ఇలాంటి వాటిపై గవర్నర్ దృష్టి సారించి వారికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్‌కు ప్రాజెక్టుల అవినీతిలో భాగస్వామ్యం ఉందని, అందుకే ఆయన కేసీఆర్, హరీశ్‌రావులను పొగుడుతున్నారని విమర్శించారు.

రైతు, నిరుద్యోగ ఆత్మహత్యలు పట్టవా?

మహిళా మంత్రులేరీ

- బీఎల్ఎఫ్ సన్నాహక సమావేశంలో నల్లా



మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాశ్

నవతెలంగాణ-మెట్టుగడ్డ/సిద్దిపేట

రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వానికి పట్టట్లేదని, కనీసం మంత్రులుగానీ, ఎమ్మెల్యేలుగానీ బాధిత కుటుంబాలకు ఓదార్పునివ్వట్లేదని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నల్లా సూర్యప్రకాశ్ విమర్శించారు. సమాజంలో సగభాగమైన మహిళలకు కేసీఆర్ మంత్రిమండలిలో చోటేలేదన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన బీఎల్ఎఫ్ జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని ఏండ్ల తరబడి పాలించిన కాంగ్రెస్, బీజేపీ, రాష్ట్రాన్ని పాలిస్తున్న టీఆర్ఎస్ వల్ల బహుజనులు నిత్యం దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ మేధావి జలజం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ వెంకట్‌దాస్, ఎంసీపీఐ రాష్ట్ర నాయకులు బాబు, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్, టీ.సాగర్, ఆర్.వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి ఎ.రాములు, ఆయా పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు జింకలకృష్ణ, వి.రాములుయాదవ్, రాయికంటి రాందాస్, స్వామి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, టీమాస్ కన్వీనర్ చంద్రకాంత్, ఎంసీపీఐ నాయకులు పి.చిన్న, కేవీపీఎస్ జిల్లా కార్య దర్శి కురుమయ్య, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ రమేష్,, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.అరుణ, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బీఎల్ఎఫ్ ఆవిర్భావ సభ వాల్‌పోస్టరును సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో దొరల, నియంతృత్వ పాలన సాగుతుందన్నారు. గిట్టుబాటు ధరలు అడిగిన రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం చరిత్రలో ఒక టీఆర్ఎస్ మాత్రమేనన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. బీఎల్ఎఫ్ ఆవిర్భావ సభ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా భారీ సభలు పెట్టి టీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతామన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు మన్నారపు నాగరాజు, టీమాస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు బి.ప్రసాద్, నాయకులు దాసరి కళావతి, గోపాలస్వామి, మాలమహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుట్టి సత్యనారాయణ, డీబీఎఫ్ ఏగొండస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి భవన్ కాదది.. పైరవీల భవన్

- మియాపూర్, వాహనాల కొనుగోలు కుంభకోణాలకు అక్కడి నుంచే అంకురార్పణం
- బంగారు కాదు.. రైతు ఆత్మహత్యల తెలంగాణ
- తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు ఎల్. రమణ



నవతెలంగాణ-వికారాబాద్‌రూరల్

పాలనా సౌలభ్యం కోసమంటూ సీఎం కేసీఆర్ నిర్మించిన ప్రగతిభవన్ పైరవీల భవన్‌గా మారిందని, మియాపూర్ భూ, వాహనాల కొనుగోలు కుంభకోణాలకు అక్కడ నుంచే అంకురార్పణ జరిగిందని తెలంగాణ టీడీపీ అధ్యక్షులు ఎల్.రమణ విమర్శించారు. దాదాపు 250 కోట్ల వాహనాల కుంభకోణంలో కేసీఆర్ కుటుంబానికి ప్రత్యేక సంబంధాలున్నాయని ఆరోపించారు. ఇది బంగారు తెలంగాణ కాదని, రైతు ఆత్మహత్యల తెలంగాణ అని అన్నారు. వికారాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి తన అవసరాల కోసం ప్రాజెక్టుల అంచనా వ్యయాలను మార్చి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ ప్రాజెక్టు అని గవర్నర్ వ్యాఖ్యానించడం విచారకరమన్నారు. ప్రగతిభవన్‌ను రాజుదర్బార్‌గా మార్చి అక్కడి నుంచే తెలంగాణలో నియంత పాలన సాగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ప్రజాసంక్షేమ కార్యక్రమాలను విస్మరించి కాంట్రాక్టర్లకు అధికంగా ఉపయోగపడే ప్రాజెక్టులు రోడ్లు, మిషన్‌భగీరథ వంటి కార్యక్రమాల్లో అమలు చేసి కమీషన్ల రూపంలో సొమ్ముచేసుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 20 ఏండ్లుగా ఉద్యమిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగపై కేసులు పెట్టి జైలుకు పంపడం సిగ్గుచేటన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకురాలు భారతి పోలీసు తొక్కిసలాటల్లో మృతి చెందితే ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం కట్టుబడి ఉందని, అఖిల పక్షంతో ఢిల్లీకి వెళ్లి వర్గీకరణకు మద్దతు ఇస్తామన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటి ఆచరణలో పెట్టలేదన్నారు. నేరెళ్లలో దళితులపై దాడులు చేసిన ఇసుక మాఫియాను అడ్డుకోకపోగా అన్యాయాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకుడు ప్రతాప్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని అన్నారు. ఇసుక మాఫియాతో కేసీఆర్ కుటుంబానికి పరోక్ష పాత్ర ఉన్న కారణంగానే నేరెళ్ల కేసులు నీరుగారిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపి అధ్యక్షుడు సుభాష్‌యాదవ్, జిల్లా నాయకులు దివాకర్, పద్మాకర్, రషీద్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, పవన్‌కల్యాణ్‌లది చీకటి ఒప్పందం

- మూడున్నరేండ్లు తెలంగాణ ప్రజలు గుర్తుకు రాలేదా : పొన్నం



నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

ముఖ్యమంత్రి కేసీఆర్, జనసేన పార్టీ నాయకుడు పవన్‌కళ్యాణ్‌ల మధ్య కుదుర్చుకున్న రహస్య ఒప్పందాన్ని బయటపెట్టాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ కొండగట్టు అంజన్న మొక్కు తీర్చుకునేందుకు వస్తే అభ్యంతరం లేదని, కానీ రాజకీయాలు మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 'తాట తీస్తా..వెయ్యి ముక్కలు చేస్తా...' ఇలా ఇక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతినేలా అనేక వ్యాఖ్యలు చేశారని, వాటికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం వెళ్లేందుకు సీఎం సమయమివ్వలేదని, ప్రగతిభవన్‌లో పవన్‌కళ్యాణ్‌కు మాత్రం చర్చించేందుకు అనుమతిచ్చారని గుర్తుచేశారు. రాజకీయ జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ పర్యటనకు అనుమతినివ్వకుండా బేడీలు.. పవన్‌కళ్యాణ్‌కు మాత్రం రెడ్‌కార్పెట్ పరుస్తారా అని ప్రశ్నించారు. నేరెళ్ల దళితులపై దాడి, మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలు, రైతు ఆత్మహత్యలు.. ఇలా తెలంగాణలో మూడున్నరేండ్లుగా ఎదుర్కొన్న సమస్యలపై పవన్‌కళ్యాణ్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఇక్కడి ప్రజలున్నారనే సర్వే నేపథ్యంలో సీఎం కేసీఆర్, పవన్ కల్యాణ్ రహస్య ఒప్పందం చేసుకున్నట్టు తెలుస్తోందన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు కర్ర రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాల అమలుకు కదలండి



జాన్‌వెస్లీ


టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి 4 సం॥లు కాబోతున్నా అణగారిన కులాలు, వర్గాలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు కాలేదు. గత ప్రభుత్వాలలాగే అగ్రకుల ధనిక వర్గాల అభివృద్ధికే నిధులు కేటాయిస్తున్నారు. రాష్ట్రంలో 93శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, సంచార జాతులు, ట్రాన్స్‌జెండర్స్, మహిళలకు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో కొనసాగుతున్న వివక్ష, అసమానతలను నిర్మూలించడంలో, సామాజిక న్యాయం కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. కార్మికులు, రైతులు, కూలీలు, అన్ని కులాల్లోని పేదల ఆర్థికాభివృద్ధికి నిధుల కేటాయింపుల్లో, చట్టాలను అమలు చేయడంలో, సమగ్రాభివృద్ధిని సాధించడంలో చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతున్నది. రిజర్వేషన్ల పెంపు, భూమి పంపిణీ, డబుల్ బెడ్‌రూంలు, ఉద్యోగాల భర్తీ, రైతు రుణమాఫీ, కేజీ టు పీజీ ఉచిత విద్య, జనాభా ప్రాతిపదికన సబ్‌ప్లాన్ నిధులు, కనీస వేతనం రూ.18వేలు తదితర వాగ్దానాలు అమలు చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలు కోసం జనవరి 2 నుండి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు, సర్వేలు జరిగాయి. జనవరి 16 నుంచి 19 వరకు సమస్యల పరిష్కారానికి వేలాది మంది తహశీల్దార్ కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు, ధర్నాలలో పాల్గొన్నారు. 22న ఛలో కలెక్టరేట్లకు ప్రజలు కదులుతున్నారు. అయినా పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే తమ హక్కుల సాధన కోసం పాలకులను శాషించే శక్తిగా సంఘటితం కావాలని, ఫూలే, అంబేద్కర్, మార్క్స్ మార్గదర్శకత్వంలో బడుగుల రాజ్యాధికారాన్ని సాధించేందుకు ప్రజలు ముందుకు సాగాలని తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక (టి-మాస్) ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది.

రాజ్యాంగం కల్పించిన హక్కులో భాగంగా ఎస్సీ, ఎస్టీల జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లను పెంచాలి. రాష్ట్ర జనాభాలో ఎస్సీలు 17శాతం ఉండగా 15 శాతం, ఎస్టీలు 10 శాతం ఉండగా 6 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు జరుగుతుండడం వల్ల విద్య, ఉద్యోగ, ప్రజాప్రాతినిధ్య అవకాశాలు కోల్పోతున్నారు. బీసీ జనాభా గణాంకాలు ప్రకటించి రిజర్వేషన్లను పెంచాల్సి ఉంది. 14.8 శాతం ఉన్న మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు పెంచేందుకు అవకాశం కల్పించాలని శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపి ప్రభుత్వం తన బాధ్యత తీరినట్టుగా వ్యవహరిస్తున్నది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చట్టబద్ధత కల్పించేందుకు నోరుమెదపడం లేదు. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధి చట్టం ప్రకారం ఎస్సీలకు రూ.14,375 కోట్లు సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి ఖర్చు చేయాల్సి ఉండగా ఇంత వరకు రూ.5,475 నిధులు మాత్రమే ఖర్చు చేసింది. అందులో కూడా సగానికి పైగా ఇతర రంగాలకు దారి మళ్లించింది. ఎస్టీలకు రూ.8,165 కోట్లు కేటాయించి రూ. 3,359 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధి చట్టంలోనే నిధులు దారి మళ్లింపుకు అవకాశాలున్నాయి. ఖర్చు చేయని నిధులను వచ్చే సంవత్సరంలో అదనంగా కేటాయించి ఖర్చు చేయాలనే నిబంధనలున్నా అమలు చేయడం లేదు. చట్టంలోని లోపాలు సవరించి అమలు చేయాల్సి ఉంది. 52 శాతం జనాభా ఉన్న బీసీల సంక్షేమానికి 5వేల కోట్లు మాత్రమే విసిరింది. మైనార్టీలకు రూ.1,120 కోట్లు మాత్రమే కేటాయించి రూ.530 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. బీసీ, మైనార్టీల జనాభా ప్రాతిపదికన సబ్‌ప్లాన్ నిధులు కేటాయించేందుకు చట్టం తీసుకురావాలి. ఎంబీసీలకు వెయ్యి కోట్లు కేటాయిస్తామని ప్రకటించి పైసా విడుదల చేయలేదు. ఎంబీసీ కులాల జాబితే ప్రకటించలేదు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లున్నా తక్కువ జనాభా కలిగిన కులాలకు సర్పంచులు, ఎంపీటీసీలయ్యే అవకాశం నామమాత్రంగానే ఉంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలి. ఎంబీసీ, సంచార జాతులలోని ఆశ్రిత కులాలకు కుల ధృవీకరణ పత్రం ఇవ్వడం లేదు. 10 శాతం జనాభా ఉన్న సంచార జాతులకు స్థిరనివాసాలు లేక ఊరిబయట గుడిసెల్లో ఉంటూ అడుక్కొని తినే వృత్తుల మీద ఆధారపడి బతుకుతుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం అభివృద్ధిలో దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రమని బుకాయిస్తున్నాడు.

రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీలో పేర్లు నమోదు చేసుకున్న 18 లక్షల మందికి పైగా నిరుద్యోగులు ఉండగా 1లక్షా7వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఈ మూడున్నర సంవత్సరాల కాలంలో 7వేలు మాత్రమే భర్తీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి. 1లక్ష ఉద్యోగాలు భర్తీ చేయడమే కాక మిగతా నిరుద్యోగులకు నెలకు రూ.25వేల ఆదాయం వచ్చే ఉపాధిని కల్పించాలి. అంతవరకు నెలకు రూ.5వేలు నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి. రాష్ట్రంలో ఇల్లు లేని కుటుంబాలు 27 లక్షలకు పైగా ఉండగా డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తామనీ, సంవత్సరానికి వెయ్యి కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు కేవలం 5వేల ఇండ్లు మాత్రమే పూర్తి చేశారు. గిట్లయితే కేసీఆర్ ఇంకా పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నా డబుల్ బెడ్‌రూంలు పూర్తికావు. హైదరాబాద్‌లోని మైసిగండి బస్తీలో 10 గజాల స్థలంలో ఒక గుడిసె చొప్పున 150 ఇండ్లుంటే 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వంటగది, పడక గది, బాత్‌రూమ్ అన్నీ ఒక్క గదిలోనే ఉంటాయి. ఇలాంటి గదులకు కూడా కిరాయి నెలకు రూ. 2500 నుండి 3500 వరకు ఉంది. ఇటువంటి దుర్భర స్థితిలో లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయి. వెంటనే ఇండ్లు నిర్మించి ఇవ్వాలి. లేదా అంతవరకూ ఇండ్ల కిరాయిలు ప్రభుత్వమే చెల్లించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పారిశ్రామికవేత్తలకు, రైతులకు, ఉచితంగా కరెంటు ఇస్తున్న ప్రభుత్వం పేద నివాస గృహాలకు 50 యూనిట్లలోపు వాడే వారికి ఉచితంగా ఇవ్వాలనే నిబంధనలు అమలు జరగడం లేదు. ఒక గది ఉన్న ఇల్లు అయినా 50 యూనిట్లపైనే కరెంటు బిల్లు వస్తుంది. 120 యూనిట్ల వరకు వాడే పేద కుటుంబాలకు ఉచిత కరెంటు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 3 ఎకరాల చొప్పున భూమి పంపిణీకి 25 లక్షల ఎకరాలు పంచాల్సి ఉండగా ఇప్పటికీ 12 వేల ఎకరాలు మాత్రమే పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ మిగులు భూములు 30 లక్షల ఎకరాలున్నాయి. ఒక్క పైసా ఖర్చు లేకుండా ముఖ్యమంత్రి సంతకం పెడితే నెల రోజుల్లో ఎస్సీ, ఎస్టీలతో పాటు ఇతర పేదలకు భూమి వస్తుంది. గీత కార్మికుల సొసైటీకి చెట్లు పెంచుకునేందుకు 5 ఎకరాల చొప్పున భూమి ఇస్తామని, చేనేతను పరిశ్రమగా అభివృద్ధి చేస్తానన్న హామీలు అమలు జరుగలేదు. మత్స్యకారులకు ఇచ్చిన చేప పిల్లలు అర కిలో కంటే ఎక్కువగా పెరగడం లేదని మొత్తుకుంటున్నారు. గొర్ల కాపరులకు ఇచ్చిన గొర్లు అధిక భాగం చనిపోతున్నాయి. రజక, నాయీ బ్రాహ్మణ, వడ్డెర, విశ్వకర్మ తదితర వృత్తిదారులకు ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు జరగలేదు. ఫెడరేషన్స్‌కు నిధులు కేటాయించడం లేదు. వృత్తిదారులకు సబ్సిడీతో ముడి సరుకును అందించి, మార్కెట్ కల్పించి ఆదాయం వచ్చే ఆధునిక కుటీర పరిశ్రమలుగా అభివృద్ధి చేయాలి. ఇండ్లలో పని చేస్తున్న, అడ్డమీద కూలీ పని చేస్తూ అతి తక్కువ ఆదాయం పొందుతున్న కుటుంబాలు సైతం తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించి ఇంగ్లీష్ మీడియంకు పంపాలని సంవత్సరానికి రూ.11వేల నుండి రూ.25వేల వరకు ఫీజులు చెల్లిస్తూ అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచి ఇంగ్లీష్ మీడియంతోపాటు ఉపాధ్యాయ, ఇతర ఖాళీ పోస్టులు భర్తీ చేసి ఉన్నతమైన విద్యను అందించకపోవడం వల్ల ప్రైవేటు రంగంలో విద్య వ్యాపారంగా మారింది. కేజీ టు పీజీ ఉచిత విద్య ప్రచారానికే పరిమితమైంది. విద్య ప్రభుత్వ రంగంలోనే కల్పించాలి. రూ.2వేల కోట్లు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదు. ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజులను నియంత్రించాలి. విద్యతోపాటు వైద్యం కూడా వ్యాపారంగా మారింది. ప్రతి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి. నియోజకవర్గానికి ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలి. రాష్ట్రంలో కోటి మందికిపైగా ఉన్న అసంఘటిత రంగ కార్మికులందరికీ కనీస వేతనం నెలకు రూ.18వేలు ఇవ్వాలని ఆందోళనలు జరుగుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. సామాజిక భద్రత చట్టం వర్తింప చేయడం లేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్స్‌ను రెగ్యూలరైజ్ చేయాలి. రాష్ట్రంలో 55 లక్షల కుటుంబాలు ఉపాధి హామీ పని కోసం జాబ్‌కార్డులు తీసుకున్నారు. వీరికి సంవత్సరానికి 100 రోజులు పని కల్పించాల్సి ఉండగా 50 రోజులు కూడా కల్పించడం లేదు. కూలీ రూ.195 ఇవ్వాల్సి ఉన్నా రోజూ రూ.50 కూడా సరిగా రావడం లేదు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పని సంవత్సరంలో 200 రోజులు కల్పించి రోజుకు రూ.300 తగ్గకుండా కూలి ఇవ్వాలి. రైతుల రుణమాఫీకి ఇంకా 37వేల కోట్లు బ్యాంకులకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. మరో 18 వేల కోట్లు ప్రైవేటు అప్పు ఉంటుంది. రైతులను ఆదుకోవాలంటే పంటలకు లాభసాటి ధర కల్పించి, సమగ్ర వ్యవసాయ అభివృద్ధి చట్టం తేవాలి. సబ్సిడీగా విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, పంటల అభివృద్ధికి ఇచ్చే రుణ సహాయం వర్తింపచేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్, ఫెడరేషన్స్ ద్వారా ఎంపికైన లబ్దిదారుల సబ్సిడీ నిధులు ఇవ్వక నెలల తరబడి ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారు. కుల, మతాంతర వివాహాలు చేసుకున్న జంటలను, ప్రేమించుకున్న వారిని కిరాతకంగా సొంత బంధువులే హత్యలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. కుల, మతాంతర వివాహితులకు రక్షణ చట్టం తేవాలి. జంటకు రూ.5లక్షలు ఆర్థిక సహాయం, ఇల్లు, ఒకరికి ఉద్యోగం, వారి పిల్లలకు రిజర్వేషన్స్ కల్పించాలి. శ్మశాన స్థలాలు లేని ఎస్సీ, ఎస్టీ తదితరులకు జి.ఒ.నెం.1235 ప్రకారం స్థలాలు కేటాయించాల్సి ఉన్నా అమలు కానందున చనిపోయిన వారిని సమాధి చేసుకోలేని దుస్థితి ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ భూమిలేని గ్రామాల్లో కొనుగోలు చేసి ఇవ్వాలి. మతంతో నిమిత్తం లేకుండా కుల సర్టిఫికేట్లు ఇవ్వాలి. ఇలాంటి సమస్యల పరిష్కారానికి జనవరి 22న కుల సంఘాలు, వర్గ సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే కలెక్టరేట్ల వద్ద ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున కదలిరావాలి. ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు పూనుకోవాలి. మాటల గారడీతో ప్రజలను మోసగిస్తే అణగారిన కులాలు, దోపిడీకి గురవుతున్న వర్గాలు ఏకమై ఈ ప్రభుత్వాన్ని శాషించే శక్తులుగా మారి బడుగుల రాజ్యాన్ని సాధించుకోవాలి.

సెల్ :9490098058

ప్రణామాలు కాదు, సమస్యలు పరిష్కారం కావాలి



ఎడమ శ్రీనివాస్‌రెడ్డి

పూర్వ విద్యార్థులు తమ టీచర్లను కలిసి 'మేము మీ విద్యార్థులం' అని చెప్పుకున్నప్పుడు ఆ టీచర్లు చాలా సంతోషపడతారు. ఆ విద్యార్థులు గొప్ప స్థానాల్లో ఉంటే విపరీతంగా పొంగిపోతారు. "మేము ఈ స్థాయికి రావడానికి మీరే కారణం, మీరు మా జీవితంలో తారసపడకపోతే మేము ఏమైపోయేవాళ్లమో" అని తమ టీచర్లను పొగిడే విద్యార్థులు కూడా ఉంటారు. "మీ విజయాలకు మీరే ప్రధాన కారణం, మీలోని అనురక్తిని గుర్తించి, దాని పెంపుదలకు ప్రోత్సాహం, అవసరమైన సహాయం అందించడం వరకే మా పాత్ర, మీ విజయంలో మీదే ప్రముఖ పాత్ర, మా పాత్ర స్వల్పమైనదే" అని చెప్పే టీచర్లు చాలా చాలా అరుదు. విద్యార్థుల జయాపజయాలను సంపూర్ణంగా టీచర్లకే ఆపాదించే నమ్మకాలే ఎక్కువగా సమాజంలో కనబడతాయి. వీటి ప్రభావంతో రాజకీయ నాయకులలో, విద్యా పరిపాలకులలో కూడా అవే అభిప్రాయాలు ఎక్కువగా ఉంటాయి, అందుకనే టీచర్ల పనితీరును బోర్డు, యూనివర్సిటీ, పోటీ పరీక్షల ఫలితాలకు ముడి పెడతారు. తాము బోధించిన విషయం లో ఫలితాలు బాగా సాధిస్తే ఉత్తమ టీచర్లు అవుతారు. అలా కాని వారు పని చేయని టీచర్లు అవుతారు. ఆరేండ్ల క్రితం ఇదే అవగాహనతో అప్పటి అధికారులు, తాము బోధించిన విషయాల్లో తక్కువ ఫలితాలు సాధించిన డిగ్రీ కళాశాలల అధ్యాపకులను క్రమశిక్షణా చర్యల్లో భాగంగా పనిచేస్తున్న స్థానాల నుండి వేరే స్థానాలకు బదిలీ చేసారు. ఇప్పటికీ గురుకుల విద్యాలయాల టీచర్లకు వార్షిక ఇంక్రిమెంట్లలో కోత విధిస్తున్నారు. విద్యార్థుల జయాలను సంపూర్ణంగా ఆపాదించుకోవడం ఎలాగైతే సరైనది కాదో, వారి అపజయాలను కూడా సంపూర్ణంగా టీచర్లకు ఆపాదించడం తప్పు అని తేల్చే అధ్యయనాలు చాలా ఉన్నాయి. కానీ టీచర్లు కూడా ఎక్కువమంది ఈ విషయాన్ని అవగాహన చేసుకున్నట్టు కనబడదు.

నిజానికి విద్యార్థుల సాధనలో వారి పాత్రే అధికం, ఒక విషయంలో అభినివేశం లేని విద్యార్థికి ఆ విషయాన్ని నేర్పే ప్రయత్నం ఎంత చేసినా అతడు లేదా ఆమె ఆ విషయంలో ప్రావీణ్యాన్ని కొంతమేరకే సాధిస్తారు కానీ పూర్తి స్థాయిని ప్రదర్శించలేరు. ఈ కొంతమేర సాధననే మనం అంతిమ లక్ష్యంగా చూస్తాం, కాబట్టి దాని ప్రాతిపదికనే విద్యార్థుల సాధనను సంపూర్ణంగా టీచర్‌కు ఆపాదిస్తుంటాం. విద్యార్థిలో అంతర్గతంగా ఉన్న ప్రత్యేక శక్తి లేదా యుక్తి బయల్పడాలంటే దానిలో విద్యార్థి పాత్రే అధికంగా ఉంటుంది. ఇంకా చెప్పాలంటే, కుటుంబ నేపథ్యం, ప్రయోజనాత్మక పరిసరాల ప్రభావమే స్కూలు, టీచర్ కంటే ఎక్కువ. దీన్ని నిరూపించిన పరిశోధనలు వందల సంఖ్యలో ఉన్నాయి. స్కూలు స్థాయిలో పిల్లలకు నేర్పే విషయాల్లో వారు కనీస స్థాయిని పొందేటట్టు చేయడంలో టీచర్ పాత్రను కాదనలేం. కానీ ప్రతీ విద్యార్థి తమలోని ప్రత్యేక సామర్థ్యాన్ని నిలుపుకోవడానికీ, దానిలో విశేష ప్రావీణ్యం సాధించడానికీ, ఆ విషయంలో అగ్రగణ్యుడు అవడంలో టీచర్ పాత్రకు పరిమితి ఉంటుంది. టీచర్ బాగా కష్టపడితే అందరి విద్యార్థులకూ కనీస స్థాయి గణితాన్ని నేర్పవచ్చు, కానీ ఎంత కష్టపడినా అందరినీ రామానుజంలను చేయలేరు, బాగా కష్టపడి ఏ విద్యార్థికైనా కనీసంగా పాడడం నేర్పించవచ్చు, కానీ ఎంత కష్టపడినా అందరినీ గొప్ప గాయకులుగా చేయలేరు. మన విద్యా వ్యవస్థలో లోపం ఏమిటంటే కనీసం నేర్ప వలసిన విషయాలను కఠినం చేశాం. చాలా సులువుగా నేర్వాల్సిన సరళ విషయాలను సంక్లిష్టం చేశాం. ఎక్కువ విష యాలను చెప్పే మోజులో ఏ విషయమూ సరిగ్గా తెలవకుం డా చేస్తున్నాం. ఆటపాటలను అటకెక్కించాం. సహకార భా వనను పెంపొందించే బదులు పోటీని విస్తృతం చేస్తున్నాం. హక్కుగా పొందే విద్యకు ఆర్థిక హద్దులను ఏర్పర్చాం. విద్య వ్యాపార సరుకైంది. కమర్షియల్ కాంప్లెక్స్‌లే కాలేజీలు, స్కూళ్లైనాయి. ఇప్పుడు టీచర్, సిలబస్ పెట్టెను అన్ ప్యాకింగ్, రీ ప్యాకింగ్ చేసే ఒక పరికరం. దీనితో టీచర్ల తయారీని గాలికి వదిలేశాం. వ్యవస్థాగత సమస్యలను చాలా సంక్లిష్టం చేశాం. ఈ స్థితిలో మార్కెట్‌కు అవసరమైన కనీస సామా న్య అభ్యా సనే అంతిమ లక్ష్యమైంది. వ్యక్తిగత సమగ్ర సంపూ ర్ణ అభివృ ద్ధి గురించి మరిచిపోయాం. కనీస సామాన్య అభ్యాసనే కఠినమైన విషయాన్ని, సులువుగా నేర్చుకోవాల్సిన అంశాలను ఎందుకు నేర్చుకోలేకపోతున్నారో, వాటిని నేర్చు కోవడంలో కుటుంబ నేపథ్యం, పరిసర ప్రభావాన్ని, వ్యవస్థాగత లోపాలను, మరిచిపోతున్నాం. పిల్లల్లో ఒక్కొక్కరిలో ఒక్కో రకంగా ఉండే, సులువుగా బయటకు తీయాల్సిన అంతర్గత శక్తియుక్తులను వదిలేస్తున్నాం, అందరినీ ఒకేలాగా తయారు చేసే కఠిన ప్రక్రియకు గురి చేస్తున్నాం. ఈ ప్రక్రియ తారుమారుగా గందరగోళమైంది. కాబట్టి టీచర్ పాత్రను కూడా తారుమారుగా, గందరగోళంగా అర్థం చేసుకుం టున్నాం.

ఈ తారుమారు అవగాహనలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి గారు తమ వ్యక్తిగత విద్వత్తుకు ప్రధాన కారణంగా తమ గురువును భావించారు. ప్రపంచ తెలుగు సభల్లో సాష్టంగపడి ప్రణమిల్లారు, టీచింగ్ లోకాన్నంతా ముఖ్యమంత్రి గా రు గౌరవిస్తున్నారనే తారుమారు అవగాహనను ఈ ప్రణామ ప్రతీక కలిపిస్తున్నది. ఈ తారుమారు అవగాహన లేక పోయినట్టయితే "ఆయన గురువు గారు, నీ విద్వత్తుకు ప్రధా న కారణం నీవే, నా పాత్ర కొంతమేరకే, కాబట్టి నేను నీ సాష్టాంగ ప్రమాణాన్ని స్వీకరించను" అని ఉండేవారు. సర్వ వ్యాప్తంగా ఉన్న ఈ అవగాహనా రాహిత్యాన్ని ఎవరికి వారు, వారి వారి పరిధిలో పెట్టుబడిగా చేసుకొని ప్రయోజనాలు పొందుతున్నారు. తాము చేయాల్సిన వ్యవస్థాగత పనులు చేయకుండానే టీచర్లు పనిచేయకపోవడం వల్లనే విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతున్నదని తమ తప్పిదాలను టీచర్లపైకి రాజకీయ నాయకులు బదలాయిస్తున్నారు, కష్టపడటమే అం తిమ సూత్రం, మిగతా అంశాలన్నీ ఎలా ఉన్నా కష్టపడితే ప్ర తీ వాడు ఏది కావాలనుకుంటే అది కావచ్చు, "నువ్వు టెం డూల్కర్ కాకపోవడానికి, సత్య నాదెళ్ల కాకపోవడానికి, రా మానుజం కాకపోవడానికి నువ్వు కష్ట పడకపోవడమే కారణం" అని పర్సనాలిటీ డెవలపర్స్ మోసగిస్తున్నారు. టీవీల్లో, సినిమాల్లో కాలక్షేపాన్ని వెతుక్కునే తల్లిదండ్రులు వీటిని నమ్మినట్టు నటిస్తుంటే, అక్షర జ్ఞానం లేని తల్లిదండ్రులు సంపూర్ణంగా ఈ నమ్మకంలో జీవిస్తున్నారు. పిల్లల చదువులకు అప్పులు చేస్తున్నారు, అది ఒత్తిడికీ, చివరకు ఆత్మహత్యకు పాల్పడడానికీ దారితీస్తున్నది.

ఒక్క టీచర్ కాళ్లు మొక్కినంత మాత్రాన టీచర్ పాత్రను అర్థం చేసుకున్నట్టు కాదు, టీచింగ్ లోకాన్ని మొత్తం గౌరవించినట్టూ కాదు. టీచర్‌కు అలౌకిక స్వభావాన్ని, అత్యున్నతమైన నైతిక ఆధిపత్యాన్ని ఆపాదించే సాంప్రదాయ ఆలోచనల ఫలితమది. టీచర్ పాత్రను సరిగ్గా అర్థం చేసుకుంటే టీచర్ తయారీ ప్రక్రియ పట్ల శ్రద్ధ వహించాలి. టీచర్ తయారీలో సమస్యలను పరిష్కరించాలి. టీచర్ హోదాను, సాధికారతను పెంచే చర్యలు చేపట్టాలి. కాంట్రాక్ట్ టీచర్స్, పార్ట్ టైం టీచర్స్, ప్రైవేట్ టీచర్స్ వ్యవస్థలను తొలగించాలి. అధికార ప్రదర్శనకూ, హాస్యానికి వస్తువుగా టీచర్ ఉన్న పరిస్థితులను తొలగించాలి. ఒక పక్కన దశాబ్దాలుగా టీచర్ ఎడ్యుకేషన్ సంస్థల్లో, యూనివర్సిటీల్లో నియామకాలే లేవు, టీచర్ ఎడ్యుకేషన్లో తొంభై శాతానికి పైగా నాణ్యతా ప్రమాణాలు లేని ప్రైవేటు కళాశాలలే. టీచర్ రిక్రూట్మెంట్‌పై శాస్త్రీయ అవగాహనే లేదు, టీచర్ తయారీలో, రిక్రూట్‌మెంట్‌లో వలసవాద, వికారపు వాసనలు ఇంకా కనబడతాయి. తరగతి గది బోధనా అనుభవం లేని వారు టీచర్లను పర్యవేక్షిస్తారు. టీచర్లను తయారు చేసే ప్రక్రియలో తలమునకలవుతారు. ప్రొఫెషనల్స్‌తో నిర్వహించబడాల్సిన విద్యాలయాల పరిపాలన సివిల్ సర్వెంట్ల గుప్పిట్లోకి పోతున్నది. విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన మానసిక, శారీరక నిర్మాణ దశను నిర్వహించే టీచర్‌ను ఇంకా కాలం చెల్లిన పదజాలం, 'స్కూల్ అసిస్టెంట్' అనే పిలుస్తాం, కనీసం మాటల్లోనయినా గౌరవాన్ని ఇనుమడింప చేయడానికి తగిన సంబోధనలే లేవు. అత్యంత సున్నితమూ, ప్రధానమైన పూర్వ ప్రాథమిక విద్యను అతి నిర్లక్ష్యంతో నిర్వహించే వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం, ఈ దశను నిర్వహించే వారిని టీచర్లుగా పరిగణించే పరిస్థితులే లేవు. టీచర్ తయారీలో క్షమించరాని నిర్లక్ష్యం వలన టీచర్ సామాజిక స్థాయి పట్ల విపరీతమైన చిన్న చూపు ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఒక్కరి ప్రణామానికి అర్థం ఎల్లరిని గౌరవించినట్టు కాదు, ఆ గౌరవం సమస్యల పరిష్కారంతో వస్తుంది, కానీ ప్రణామ ప్రతీకతో కాదు. పనిలో కాకుండా దాని తాలూకు ప్రతీకలో పరమానందాన్ని వెతుక్కునే సంస్కృతి వికాసానికి గొడ్డలిపెట్టు.

సెల్ : 9989262683

శ్రీరాంసాగర్ నీటిలో పక్షపాతానికి ప్రభుత్వానిదే బాధ్యత



సైనాల గోవర్ధన్

అవిభాజ్య ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యంగా కడెం ఆయకట్టు కింద ఖరీఫ్‌లో అనేక రకాల పంటలు వేశారు. వరికి దోమ పోటు రాగా, పత్తికి గులాబి తెగులు సోకింది. ప్రధానంగా వరి పంటకు దోమ తెగులు ఎన్నడూ లేనంత సోకి పంట దిగుబడి 70 శాతం తుడిచిపెట్టుకుపోయింది. సగటున 30 శాతం పంటే చేతికొచ్చింది. చాలామంది రైతులు వరి పంటలకు నిప్పుపెట్టి కాల్చివేశారు. దిగుబడి తగ్గిన వేలాది మంది రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. వివిధ పంటలకు సోకిన తెగుళ్లను నిర్మూలించడానికి ఎంతో ఖర్చుచేసి పురుగు మందులు పిచికారి చేశాడు. 2017 ఖరీఫ్‌లో గత రైతాంగ చరిత్రలోనే ఎన్నడూ లేనంత రసాయన పురుగు మందుల వినియోగం జరిగింది. ఎరువుల దుకాణాల్లో పురుగు మందులకు తీవ్ర కొరత ఏర్పడింది. ఈ స్థితిలో ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులను ఆదుకొని, యాసంగి పంటలకు నీళ్లందించడానికి కడెం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీళ్లు లేవు.

ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 47 టీఎంసీల (సుమారు 70 శాతం) నీళ్లున్నాయి. లోయర్ మానేరు డ్యాం వరకు 4 లక్షల ఎకరాలకు నీరందించబోతున్నారు. ఎల్ఎండీ నుండి దాని ఆయకట్టుకు 1.5 లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తున్నారు. మిగతా నీరు మిషన్ భగీరథకు వాడుతున్నారు. శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలో ఒక్క కాకతీయ కుడికాల్వ వైపు 41 టీఎంసీల నీళ్లు వ్యవసాయ సాగుకు అందిస్తున్నారు. ఈ యాసంగికి 8 తడులు(సార్లు) డిసెంబర్ 25 నుంచి ఏప్రిల్ 9 వరకు నీళ్లు అందిస్తున్నారు.

కాకతీయ కాల్వకు ప్రతిరోజు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీళ్లందించడానికి ప్రతి రోజు 5,000 క్యూసెక్కుల నీరు అందిస్తున్నారు. సరస్వతి కాల్వకు నీళ్లందించడానికి 500 క్యూసెక్కుల నీళ్లందిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోని లక్ష్మి కాల్వకు నీళ్లందించడానికి 250 క్యూసెక్కుల నీరు అందిస్తున్నారు. సరస్వతి కాల్వ కింద 16,300 ఎకరాలు, లక్ష్మి కాల్వ కింద 16,000 ఎకరాలకు నీళ్లు అందిస్తున్నారు. ఏప్రిల్ 9 వరకు ఈ రెండు కాల్వలకు నిరంతరాయంగా నీళ్లందిస్తున్నారు. నవాబ్‌పేట్ ట్యాంకుకు రోజు 150 క్యూసెక్కుల నీళ్లు ఎత్తిపోతల కోసం అందిస్తున్నారు. అలిసాగర్ ఎత్తిపోతలు, గుత్ప ఎత్తిపోతలకు ఒక్కొక్క టీఎంసీ చొప్పున్న 2 టీఎంసీలు అందిస్తున్నారు. మిగిలి వున్న నీరు మిషన్ భగీరథకు కేటాయించారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి, శ్రీరాంసాగర్ నుండి అనాదిగా జరుగుతున్న అన్యాయానికి ఇది కొనసాగింపు మాత్రమే. నేడు 47 టీఎంసీలున్న శ్రీరాంసాగర్ నుంచి అన్ని ప్రాంతాలకు నీళ్లు అందిస్తూ, ఒక్క కడెం, సదర్‌మాట్ ఆయకట్టు రైతులకు ఒక్క చుక్క నీళ్లు కూడా కేటాయించకపోవడం తెలంగాణ స్వరాష్ట్రంలో కూడా జరుగుతున్న తీవ్ర వివక్ష, పక్షపాత ధోరణికి నిదర్శనం కాదా? శ్రీరాంసాగర్ నుండి చుక్క నీరు కేటాయించకపోవడానికి, దోమపోటుతో సర్వం పంటలు కోల్పోయిన కడెం ఆయకట్టు, సదర్ మాటు ఆయకట్టు రైతులు చేసిన పాపమేమిటో తెలంగాణ ప్రభుత్వం చెప్పాలి. నిజామాబాద్ జిల్లాలోని అలిసాగర్, గుత్ప, నవాబ్ చెరువు పరిధిలోవుండే అనేక దశలతో కూడిన 3 ఎత్తిపోతలకు కూడా నీళ్లు కేటాయించారు. అనేక మెగావాట్ల కరెంటు, అనేక కోట్ల రూపాయలతో నడిచే ఎత్తిపోతలకు కూడా నీళ్లు కేటాయించారు. ఏ రైతులైనా బాగుండాలి. మరి పైసా ఖర్చులేకుండా శ్రీరాంసాగర్ నుండి కడెంకు గ్రావిటీ కాల్వ ద్వారా నీరు కేటాయించవచ్చు. నీరు కేటాయించకపోవడానికి కడెం సదర్‌మాట్ ఆయకట్టు ఆభాగ్య రైతులు చేసిన సామూహిక పాపమేమిటో చెప్పాలి.

చారిత్రకంగా శ్రీరాంసాగర్‌లో అవిభాజ్య ఆదిలాబాద్‌కు జరిగిన అన్యాయమేమిటి?

1983-2012 వరకు 30 సం॥ కాలంలో శ్రీరాంసాగర్ నుండి 2942 టీఎంసీల నీరు విడుదల చేశారు. కడెం ప్రాజెక్టుకు చేరింది 1.97 శాతం మాత్రమే. 98.3 శాతం నీరు 2850 టీఎంసీలు కాకతీయ కుడి కాల్వ ద్వారా ఇతర జిల్లాలకు తరలించారు. ఉమ్మడి జిల్లా మొత్తం నిర్మల్, సదర్‌మాట్, కడెం ఆయకట్టులన్నీ కలిసి 2, రెండున్నర శాతం కూడా దాటలేదు. 1995-96 నుండి 2011-12 వరకు 16 సం॥లలో శ్రీరాంసాగర్ నుండి కాకతీయ కాల్వకు విడుదల చేసిన నీరు 1853 టీఎంసీలు, అప్పుడు కడెంకు చేరిన నీరు 2.21 శాతం మాత్రమే. 97 శాతానికి పైగా ఇతర జిల్లాలకు వెళ్లింది. కాల్వలకు విడుదలైన 2942 టీఎంసీల నీటిలో కడెంకు చేరింది 0.98 శాతం మాత్రమే. 2000-01 నుండి 2011-12 వరకు 10 సం॥లో శ్రీరాంసాగర్ నుండి సరస్వతి (ఎడమ)కాల్వకు విడుదల చేసిన నీరు 77 టీఎంసీలు. కడెంకు చేరింది కేవలం 29 టీఎంసీలు మాత్రమే. 1995-2011 వరకు (15 సం॥లలో) శ్రీరాంసాగర్ నుండి కడెంకు చేరిన నీరు 41 టీఎంసీలు మాత్రమే.

శ్రీరాంసాగర్ కాకతీయ కుడి కాల్వ 2850 టీఎంసీల నీటితో 205 కోట్ల 20 లక్షల మందికి పని కల్పిస్తే, కడెం ప్రాజెక్టుకు చేరిన 29 టీఎంసీలతో 2,08,80,000 మందికి పని కల్పించింది. శ్రీరాంసాగర్ నుండి విడుదలైన నీటికి కాకతీయ కాల్వ రైతులకు రూ.22,800 కోట్ల ఆదాయం వచ్చింది. కడెం రైతులకు శ్రీరాంసాగర్ నీటితో వచ్చిన ఆదాయం కేవలం రూ.232 కోట్లు మాత్రమే. దాంట్లోంచి తీసివేస్తే ఇంకా 22,568 కోట్ల భారీ సంపదను ఇంకా కడెం కంటే అదనంగా కాకతీయ కాల్వ పరిధి రైలతులకు సృష్టించబడింది. శ్రీరాంసాగర్ వరద గేట్ల నుంచి నీరు పొంగి పొర్లే సమయంలో మాత్రమే వరద కాల్వకు నీరు తరలించాలి. తెలంగాణ ఉద్యమ గుండెకాయ నినాదానికి విరుద్ధంగా మండు వేసవిలో కూడా స్థానిక రైతులకు నీళ్లందించకుండా, వరద కాల్వ ద్వారా భారీ ఎత్తున నీరు సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

శ్రీరాంసాగర్‌లో నేడున్న 47 టీఎంసీలను 147 కి.మీ. దూరంలోని మానేరు వరకు ఆపైన 180 కి.మీ తరలిస్తున్నారు. మరి 58 గ్రామాలు వేలాది ఎకరాలు మునిగిన ఆదివాసి గిరిజన వెనుకబడ్డ జిల్లాకు నీరివ్వకపోవడం అన్యాయం కాదా? వెంటనే కడెం ఆయకట్టుకు 2 టీఎంసీల నీళ్లు తక్షణమే శ్రీరాంసాగర్ నుండి వివక్ష, పక్షపాతం లేకుండా అందించి రైతులను ఆదుకోవాలి. తెగుళ్లతో భారీగా నష్టపోయిన కడెం ఆయకట్టు రైతులకు, యాసంగి పంటలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి 2 టీఎంసీల నీళ్లిచ్చి ఆదుకోవాలి. శ్రీరాంసాగర్‌లో అనాదిగా జరుగుతున్న సాగు నీటి అన్యాయాన్ని అరికట్టాలి.

సెల్ : 9701381799

పరమపూజ్యనీయ సీఎం కేసీఆర్ గారికి...



జగన్

అయ్యా!

మీరు తెలంగాణ ముఖ్యమంత్రి అయిన తర్వాత చదువుకు విద్యాసంస్థలకు ఇస్తున్న నిధులకు, విధులకు మీకు శతకోటి శణార్థులు. మెన్ననే తెలుగు మహాసభలకు 100కోట్ల రుపాలు ధారబోసి తెలుగు తెగులు వట్టకుండా మహాసభల ద్వారా తెలుగు పంటను పండిచ్చిన్రు. సార్ అవతలమెన్న హైదరాబాద్ వంకర పోతున్నది. బాధపడి గా ఇవాంకను తోలుకచ్చి దునియా పైసల మీటింగ్ వెట్టి కోట్ల రూపాలు వెట్టి వంకరపోతున్న హైదరాబాద్‌లో ఆమె పోతున్న బాటంత సక్కగా జేత్తివి. అవ్వతోడు నీ అసుంటి ముఖ్యమంత్రి అంజనం (పాతాళ గరిగే) ఏసి ఎతికినా దొరకడు సారూ! మేం తప్పు జేసినం సారూ. మా ఉస్మానియా పోరగాండ్లు అనగానే ఒంటికాలు మీద లేస్తుండ్రు మీరు.. గా కొండా సురేఖ మిమ్మల్ని తిట్టింది. గసొంటిది గామనే పెద్ద మనసు చేసుకుని మనం పాలోల్లం పాసిపోతమా అని కడుపుల దాసుకున్నరు. గసొంటిది ఏమైంది సారు మీకూ.. ఉస్మానియా వంద సంవత్సరాల పండుగ నాడు ఒక్క మాట మాట్లడకపోయినా మా సారే కదా అని కడుపుల కేంచి వచ్చే కోపాన్ని ఆపుకుని చిరునవ్వు తోటి ఎల్కమ్ జెప్పినమ్ గదా! మొన్న ఉస్మానియా బిడ్డా మురళి చనిపోయనప్పుడు లాఠీలతోటి లాగులు పలుగ కొట్టింద్రు. మన పోలీసులే, మన సారే గదా. తెలంగాణ ఉద్యమంల బాగ కొట్లాడి అలసిపాయనం గదా. లాఠీల తోటి సన్మానం జెసిండు అని మా పోరగాండ్లకు సర్దిజెప్పుకున్నాం.. కానీ నువ్వు మా లెక్క సదువుకున్నవు గదా.. గీ సైన్స్ కాంగ్రెస్‌ను ఎందుకు వాయిదా వేయించిన్రు. మేం తెలంగాణ ఉద్యమాన్ని చూసి ఏగ్గుల పెట్టిన ఆంధ్రోల్లకన్నా అధ్వానం కనబడుతున్నమా సారూ! నీ గుండె మీద చేయ్యివేసుకుని చెప్పుర్రి... ఒక్కసారి మాతోని మాట్లడున్రి సారు. తెలంగాణ కోసం మీరు జుపిన తోవ్వల్నె నడిసినం గదా సార్. మా ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ విశ్వవిద్యాలయాల పోరగాండ్లు అంటే బగ్గున మండుతుండ్రు. మా తోటి మాట్లాడుండ్రి సారు! గీ సైన్స్ కాంగ్రెస్ గీడ జరిగితే ఎడ్ల కొట్టాలు, బర్లు పండే బంజరు దొడ్ల లెక్కన మా హాస్టళ్లు మీ గడిలంత కాకపోయినా మీరిచ్చే డబుల్ బెడ్ రూం ఇండ్ల లెక్కన అయితయి అని ఆశపడ్డాం సారూ! కానీ మా మీద మీకు మహాభారతంలో శకుని మామ లెక్క చాడీలు జెప్పుతున్రు. గవ్వేం నమ్మకు సార్. మీరు చదువుకున్న చింతమడక బడిని మీరుండే గడీ లెక్కచేస్తే ...అబ్బ గీ ఊస్మానియా యూనివర్సిటీని కట్టి వందేండ్లు అయ్యింది. మన ముఖ్యమంత్రి కేసీఆర్ సార్, చిన్న ముఖ్యమంత్రి రామరావుసార్ (నిజాం కాలేజ్) గీడనే చదవుకున్నరు. మా యూనివర్శిటీ గోడలన్నీ మేడలు అవుతాయని ముర్శినమ్ సారూ. గీ సైన్స్ కాంగ్రెస్ వస్తున్న మా ల్యాబులల్ల నైజాం కాలం నాటి తుప్పుపట్టిన పిప్పెట్లు, బ్యూరెట్లు, కంపుకొడుతున్న ప్రయోగశాలలు, రంగు తేలిపోయిన రసాయనాలతోనే ప్రపంచం తోటి పోటిపడి పరుగులు పెట్టిత్తరు అనుకున్నా ....మల్లా గిట్ల సవాల్ చేస్తరనుకోలేదు మీరు. ఎన్నటికైన గీ చదువుల తల్లి ఉస్మానియా గడ్డ మీదకు వచ్చి దునియాల నెంబర్ ఏక్ చేస్తరని ఆశతో ....

ఒక్కమాట మర్శిపోయన గిట్ల పక్క తెలంగాణ యాసలో ఎందుకు జెపుతున్ననంటే మీరు గా ఆంధ్రోల్ల సోపతి వట్టి ఆగం ఆగం అవుతున్నరు. అందుకని గిట్ల చెపుతున్న. గీ యాసలో చెపితే జల్దీ సమజ్ అయితదనీ. ఇగ వుంటా సారూ!

సెల్ : 8099897180

మద్యానికి ప్రభుత్వం తలాక్ ఇవ్వాలి



ముహ్మద్ ముజాహిద్

ప్రభుత్వం ముస్లిం మహిళలపైనే ఎందుకు ప్రేమను ఒలకబోస్తోంది. గత మూడున్నరేండ్ల పాలనలో బీజేపీ తీసుకున్న నిర్ణయాలన్నీ ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగానే ఉన్నాయి. ఉన్నట్టుండి ముస్లిం మహిళల మీద అంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చింది. సరే ముస్లిం మహిళల వివాహ పరిరక్షణ చట్టం పేరుతో తలాక్‌ను రద్దు చేస్తూ బిల్లును లోక్‌సభలో నెగ్గించుకుంది. ముస్లిం మహిళలు ముమ్మారు తలాక్‌తో నష్టపోతున్నారనీ, ఒంటరిగా మిగిలిపోతున్నారనీ మొసలి కన్నీరు కార్చే మోడీ ప్రభుత్వానికి దేశ వ్యాప్తంగా ఉన్న మహిళల దుస్థితి పట్టదా? "ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం" అంటూ ప్రగల్భాలు పలికే పాలకులకు మహిళల రక్షణ, భద్రత, వారి మాన మర్యాదాలు, శీల రక్షణ గురించి ఆలోచించదా? మద్యం అమ్మకాలతో ఖజానా నింపుకునే ప్రభుత్వాలకు ఈ మహమ్మారి స్త్రీలను వితంతువులుగా మారుస్తోంది. మద్యం మత్తులో స్త్రీలపై జరిగే అఘాయిత్యాలు జగద్విదితమే. కాపురాల్లో చిచ్చు పెట్టేది మద్యమే. మద్యం మత్తులో జరిగే ప్రమాదాలతో, మద్యానికి బానిసై ప్రాణాలు కోల్పోతున్న వారు తమ భార్యలను దిక్కులేని వారిగా చేస్తున్నారు. పన్ను రాబడి కోసం ప్రభుత్వాలు మందుబాబులను మత్తులో ముంచెత్తుతోంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. మొన్నటికి మొన్న ఆంగ్ల కొత్త సంవత్సర సంబరాల పేరిట తెలంగాణ రాష్ట్రంలో రూ.400 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. మద్యంపై దేశవ్యాప్త నిషేధం అవసరమనీ, మత్తు విపత్తు నుంచి ప్రజల్ని కాపాడేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలనీ ఎన్ని ప్రయోజన వ్యాజ్యాలు వేసినా లాభం లేకుండా పోతోంది. జనం బలహీనతనే పెట్టుబడిగా భావించి, వీధి వీధినా మద్యం దుకాణాల్ని ప్రోత్సహించి, దానిపై పన్నుల ద్వారా సొమ్ముచేసుకోవడంలో ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యం గురించి లేదు. మద్యం మహమ్మారి సమాజాన్ని నిర్వీర్యం చేస్తోంది. దేశవ్యాప్తంగా మద్యాన్ని నిషేధించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలు నీరుగారిపోతున్నాయి. అన్ని రుగ్మతలకు పుట్టినిల్లైన ఈ మద్యం ప్రజల ఆరోగ్యానికే చేటు కాక నేరాలకూ, అత్యాచారాలకూ, ప్రమాదాలకూ కారణమవుతోంది. ప్రజల మాన ప్రాణాలతో చెలగాటమాడే ఈ మద్యం ద్వారానే ప్రభుత్వ ఖజానా రాబడికి ప్రధాన వనరుగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలే నూతన సంవత్సర వేడుకల్లో ప్రభుత్వ ఖజానా పెంచుకునేందుకు మద్యం రేట్లను మరింతగా పెంచేశారు. ఈ మద్యం మహమ్మారి తెచ్చే అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. దేశంలో జరిగే హత్యలు, అరాచకాలు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలకు ఈ మద్యం మహమ్మారే ప్రధాన కారణమని ఎన్నో సర్వేలు తేల్చి చెప్పాయి. మద్యం అలవాటు ముదిరి డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు. మద్యం వల్ల తమ ఇంటివారిని, పిల్లలను అనాథలుగా చేసి మరణిస్తున్నారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. నాలుగు పదులు తీరకుండానే యువతులు వితంతువులుగా మారిపోతున్నారు. సంపూర్ణ మద్యనిషేధం విధిస్తేనే దేశాన్ని ఆరోగ్య భారతంగా మార్చవచ్చు. నేరాలు, ఘోరాలకు చెక్ పెట్టవచ్చు. రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు. "మీరు దేశంలో ఉన్న మద్యం దుకాణాలను మూసివేయండి, నేను జైళ్లను మూయిస్తాను" అనే ఫ్రెంచ్ సామెతను నిజం చేసి చూపవచ్చు. ఎందుకంటే జైళ్లల్లో శిక్ష అనుభవిస్తున్న సగం మంది ఈ మద్యం మత్తులో నేరాలకు పాల్పడిన వారే. మరోపక్క ఈ మద్యానికి బానిసైన వారు డబ్బు కోసం భార్యలను కడతేర్చిన సంఘటనలు కోకొల్లలున్నాయి. ఈ మద్యం కాపురాల మధ్య చిచ్చుపెడుతుంది. భర్త సంపాదన తాగడానికే వెచ్చించే కుటుంబాల పిల్లలు ఇటు చదువులకూ దూరమవుతున్నారు. ప్రమాదకరమైన కార్ఖానాల్లో వెట్టి చాకిరి చేస్తున్నారు. ముస్లిం మహిళలకు న్యాయం చేస్తానని నడుం బిగించిన మోడీగారు ఇక్కడ వేళ్లమీద లెక్కించగల స్థాయిలో ఉన్న ట్రిపుల్ తలాక్ సమస్యను భూతద్దంలో చూపించి దాని వెనుక సమయాన్ని వృథా చేస్తున్నారు. ట్రిపుల్ తలాక్ అసలు సమస్యే కాదని ముస్లిం ఉలేమాలు, పర్సనల్ లా బోర్డు, ముస్లిం మహిళా సంఘాలు గొంతుచించుకుంటున్నా రాజకీయ లబ్దికోసం ఈ బిల్లు వెనుక మీ సమయాన్ని వథా చేసుకుంటున్నారు. పైగా ఈ బిల్లు ముస్లిం మహిళలకు ఎలాంటి మేలూ చేయకపోగా నష్టమే ఉంది. ముస్లిం పర్సనల్ లా బోర్డు ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ కూడా రాసింది.

సెల్ : 9640622076

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228



'తొలి ప్రేమ' చిత్రం ఆడియో ఆవిష్కరణోత్సవ దృశ్యం

తొలి ప్రేమ పాటలొచ్చాయ్..

"తొలిప్రేమ' చిత్రంతో పవన్ కళ్యాణ్‌కు ఎంత పేరు వచ్చిందో ఇప్పుడదే 'తొలిప్రేమ' టైటిల్‌తో వస్తున్న వరుణ్ తేజ్‌కు అంత పేరు వస్తుంది' అని అల్లు అరవింద్ అన్నారు. వరుణ్ తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్.ఎల్.పి పతాకంపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'తొలిప్రేమ'. ఎస్.ఎస్.థమన్ సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియో విడుదల వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఆడియో సీడీలను అల్లు అరవింద్ ఆవిష్కరించి దిల్‌రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'వరుణ్ తేజ్ రెండో సినిమా నుంచి తనకు నచ్చిన సినిమాలు చేస్తున్నాడు.. ఈ 'తొలిప్రేమ' కచ్చితంగా పెద్ద హిట్ అవుతుంది' అని అన్నారు. 'తమన్ చేసిన బెస్ట్ ఆల్బమ్ ఇది. బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ఇది. వరుణ్, రాశీఖన్నా మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది' అని దిల్‌రాజు తెలిపారు. వరుణ్ తేజ్ చెబుతూ, 'తొలిప్రేమ' పెట్టడానికి నాకు ఇష్టమైనప్పటికీ కాస్త భయపడ్డాను. ఎందుకంటే అది బాబాయ్ ఐ కాంటాక్ట్ ఫిల్మ్. ఆ సినిమా టైటిల్ పెట్టినందుకు దానికి న్యాయం చేశామని నమ్ముతున్నా. ప్రేక్షకులు, అభిమానులు ఎవ్వరూ నిరాశ చెందరు. తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. జార్జ్‌విజువల్స్ సూపర్. మా పెదనాన్న(చిరంజీవి), బాబాయ్ వేసిన ఈ ఫౌండేషన్‌ను పాడు చేయకుండా మంచి సినిమాలు చేస్తా' అని చెప్పారు. 'నేను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో నన్ను నమ్మిన వ్యక్తి దిల్‌రాజు. నేను కాన్ఫిడెంట్ కోల్పోతున్న టైమ్‌లో వరుణ్ తేజ్ ధైర్యాన్నిచ్చాడు. ఇక నా నమ్మకానికి ఊపిరి పోసిన వ్యక్తి బాపినీడు. మంచి పాటల కోసం థమన్, శ్రీమణిని బాగా ఇబ్బంది పెట్టాను' అని దర్శకుడు తెలిపారు.
థమన్ చెబుతూ, 'ఇంత మంచి మెలోడీ ఆల్బమ్ చేసే అవకాశం కల్పించిన దర్శక,నిర్మాతలకు థ్యాంక్స్. వెంకీ అద్భుతమైన స్క్రిప్ట్‌తో సినిమా చేశాడు. ఈ సినిమా కచ్చితంగా అలరిస్తుంది' అని చెప్పారు.

ఎన్నో అద్భుతాల దివ్యమణి



వైశాలి

సురేష్ కమల్, వైశాలి, కిమయా హీరో, హీరోయిన్లుగా గిరిధర్ గోపాల్ స్వీయ దర్శకత్వంలో మోహమాయా ఎంటర్‌టైన్‌మెంట్స్, రెడ్ నొడ్ మీడియా పతాకాలపై నిర్మిస్తూ సంగీతం సమకూరుస్తున్న చిత్రం 'దివ్య మణి'. ఈ చిత్ర ఆడియో విడుదల కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. డా॥యామిని కృష్ణమూర్తి పాటల సీడీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శక,నిర్మాత గిరిధర్ గోపాల్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలోని పాటలు ఆకట్టుకుంటాయి. సినిమా కూడా అందరినీ అలరిస్తుందని నమ్ముతున్నాం. యామిని కృష్ణమూర్తి బయోపిక్‌ను ఈ చిత్ర అనంతరం భారీగా తీయబోతున్నాం' అని అన్నారు. 'నటుడిగా నాకిది తొలి చిత్రం. గిరిధర్ ఆల్‌రౌండర్. మంచి కథ చెప్పారు. ఈ సినిమాకు నేనే సొంతంగా యాక్షన్ కంపోజ్ చేశా. ఈ సినిమా ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంది' అని సురేష్ కమల్ తెలిపారు. సాయికుమార్ చెబుతూ, 'గిరిధర్ ఈ సినిమాలో ఎన్నో అద్భుతాలు చూపించారు. స్టంట్స్ చూసి ఎంతో ఎగ్జైట్ అయ్యాం' అని అన్నారు.

నవచిత్రం

అరుదైన ఆస్కార్ గౌరవం..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రాకు ఓ అరుదైన గౌరవం దక్కింది. 90వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించేందుకు ప్రియాంకను ఆస్కార్ కమిటీ ఎంపిక చేయటం విశేషం. 'బిహైండ్ ద సీన్స్ విత్ ప్రియాంక చోప్రా. మంగళవారం ఉదయం 5.22 నిమిషాలకు ఆస్కార్ అభ్యర్థుల ఎనౌన్స్‌మెంట్..' అంటూ ఆస్కార్ కమిటీ సభ్యులు రెబెల్ విల్సన్, మిచెల్లె రాడ్రిగ్, రోసారియో డాసన్ తమ అధికార ఇన్‌స్టామ్‌గ్రామ్‌లో పోస్ట్ చేశారు. 'క్వాంటికో' టెలివిజన్ సిరీస్‌తో హాలీవుడ్ బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితురాలైన ప్రియాంకకు మరోసారి ఆస్కార్ వేదికపై మెరిసే అవకాశం రావడం విశేషం. 2016లో ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా అద్భుతమైన కాస్ట్యూమ్స్‌తో ప్రియాంక రెడ్‌కార్పెట్‌పై హల్‌చల్ చేసిన విషయం విదితమే.



ప్రియాంక చోప్రా

ఆ రెండూ నాకు సమానమే..



విక్రమ్

'వరుసగా ప్రయోగాత్మక చిత్రాలు చేస్తున్న నేను చాలా రోజుల తర్వాత నటిస్తున్న మాస్ కమర్షియల్ చిత్రమిది. ఓ రకంగా ఇది కూడా నాకు ప్రయోగాత్మక చిత్రమే' అని అంటున్నారు విక్రమ్. తాజాగా ఆయన 'స్కెచ్' చిత్రంలో నటించారు. తమన్నా కథానాయిక. తమిళంలో విడుదలైన ఈ సినిమా త్వరలో తెలుగులోనూ విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా విక్రమ్ శనివారం మీడియాతో ముచ్చటించారు. 'వాస్తవానికి దగ్గరగా ఉండే చిత్రమిది. అదే సమయంలో ఫాంటసీ కూడా ఉంటుంది. దర్శకుడు విజయ్ తను చూసిన సంఘటనలను ఆధారంగా చేసుకుని ఈ కథ తయారు చేశారు. కథ విని ఎగ్జైట్ అయ్యాను. అందుకే ఇది కమర్షియల్ సినిమా అయినా చేసేందుకు ఒప్పుకున్నా. కాకపోతే నా సినిమాలో ఏదైనా డిఫరెంట్‌గా ఉండాలనుకుంటాను. అది ఇందులోనూ ఉంటుంది. అదేంటనేది సస్పెన్స్. చాలా రోజుల తర్వాత చేస్తున్న మాస్ కమర్షియల్ చిత్రమిది. నిజం చెప్పాలంటే నాకు ఇదొక ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఇందులో నేను మెకానిక్ పాత్రలో కనిపిస్తాను. తమన్నా బ్రహ్మణ అమ్మాయిగా నటించారు. ఆమెతో నటించడం చాలా హ్యాపీగా ఉంది. మా మధ్య వచ్చే లవ్,రొమాన్స్ ఆకట్టుకుంటుంది. తమిళంలో సంక్రాంతి సందర్భంగా విడుదలై మంచి విజయం సాధించింది. తెలుగులోనూ అదే స్థాయిలో విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం. 'శివపుత్రుడు', 'అపరిచితుడు', 'నాన్న' చిత్రాల్లో నటనకు స్కోప్ ఉన్న పాత్రలు చేశా. అలాగే 'జెమినీ', 'సామి', 'మల్లన్న' వంటి కమర్షియల్ చిత్రాల్లోనూ నటించాను. ఇవి కూడా నాకు మంచి పేరు తీసుకొచ్చాయి. ప్రయోగాత్మక చిత్రాలు, కమర్షియల్ మాస్ చిత్రాలు నాకు రెండు కళ్లతో సమానం. నటులకు వయసుతో సంబంధం లేదు. యాక్టర్‌గా నాకు అమితాబ్ స్ఫూర్తి. ఆయన ఈ వయసులోనూ యంగ్ రోల్స్ చేస్తున్నారు. అలాగే నేను కూడా ఇప్పుడు కాలేజ్ కుర్రాడిగా నటించడానికి సిద్ధమే. మా అబ్బాయి ధృవ్ తమిళంలో 'అర్జున్ రెడ్డి' రీమేక్‌లో నటించకపోతే ఆ సినిమాను నేనే చేసేవాడిని (నవ్వుతూ). ప్రస్తుతం ధృవ్ అమెరికాలో మెథడ్ యాక్టింగ్ నేర్చుకుంటున్నాడు. అది పూర్తయిన తర్వాత పూర్తిస్థాయి హీరోగా సినిమాలు చేస్తాడు. ప్రస్తుతం గౌతమ్ మీనన్‌తో 'ధృవనక్షత్రం', హరితో 'సామి స్వైర్' చిత్రంలో నటిస్తున్నా. 'ధృవ్ నక్షత్రం' ఫ్రాంచైజీగా చేయాలనే ఆలోచన ఉంది. కమల్‌హాసన్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేయబోతున్నాను. థ్రిల్లర్ నేపథ్యంలో సాగే చిత్రమది. ఆ తర్వాత 'మహావీరకర్ణ' సినిమా చేస్తాం. ఇందులోని పాత్రలకు ఇండియాలోని ది బెస్ట్ యాక్టర్స్‌ను తీసుకుంటున్నాం. భీష్మ, అర్జునుడు, కుంతి, ద్రౌపది వంటి పాత్రల్లో నటించే నటులు ఎవరన్నది తెలిశాక అందరూ షాక్ అవుతారు. అంతర్జాతీయ స్థాయిలో సినిమా ఉంటుంది. నాకు సినిమాలే జీవితం. రాజకీయాల్లోకి వెళ్లే ఆలోచన లేదు. ఎందుకంటే నాకు పంచె కట్టడం రాదు (నవ్వుతూ)' అని విక్రమ్ చెప్పారు.

ప్రభాస్ సరసన..!



అర్షి ఖాన్

ప్రభాస్ నటించబోయే బాలీవుడ్ చిత్రంలో ప్రభాస్ సరసన దీపికా పదుకొనె లేదా కత్రినా కైఫ్ నటించే అవకాశాలున్నట్టు ఇప్పటికే సోషల్ మీడియా హల్‌చల్ చేస్తోంది. ఇదిలా ఉంటే, ప్రభాస్ సరసన నటించే లక్కీ ఛాన్స్ వచ్చినందుకు హ్యాపీగా ఉందంటూ హిందీ బిగ్‌బాస్ షోతో బాగా పాపులరైన వివాదాస్పద నటి అర్షిఖాన్ ట్వీట్ చేయటం హాట్ టాపిక్‌గా మారింది.

ఫ్రెష్ కథ, కథనాలతో..

సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి నాయకానాయికలుగా ఘట్టమనేని మంజుల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మనసుకు నచ్చింది'. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ,' విడుదలైన పోస్టర్స్, ట్రైలర్, టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫ్రెష్ అండ్ రొమాంటిక్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఒక మంచి సినిమా చూశామనే భావన ప్రేక్షకులకు కలిగించే చిత్రమిది. రాధన్ మ్యూజిక్ ఈ చిత్రానికి బిగ్గెస్ట్ ఎస్సెట్‌గా నిలుస్తుంది. ఎన్నో ప్రత్యేకతలతో మరెన్నో ఆసక్తికర అంశాలతో రూపొందిన ఈ చిత్రం ద్వారా మంజుల దర్శకురాలిగా పరిచయం కావడం ఆనందంగా ఉంది. ఫిబ్రవరి 16వ తేదీన ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.



సందీప్ కిషన్, అమైరా దస్తూర్

ఆసక్తికర భిన్న నేపథ్య స్పానిష్ చిత్రాలు



















షో

భిన్న నేపథ్యాలు, ప్రయోగాత్మక పాత్రలకు కేరాఫ్‌గా స్పానిష్ చిత్రాలు నిలుస్తాయనడంలో అతిశయోక్తి లేదు. ఎన్నో స్పానిష్ చిత్రాలు విశేష ప్రేక్షకాదరణతోపాటు విమర్శకుల ప్రశంసలను సొంతం చేసుకుని వరల్డ్ బాక్సాఫీస్ దగ్గర సత్తా చాటాయి. ప్రేక్షకుల్ని ఫిదా చేసిన కొన్నిఆసక్తికర స్పానిష్ చిత్రాల గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ షో..

ది ఫ్యూరీ ఆఫ్ ఏ పేషెంట్ మ్యాన్

ఓ ఖైదీకి, మహిళకు మధ్య అనుబంధాన్ని తెలిపే చిత్రమిది. బంగారు ఆభరణాల షాపులో దొంగతనం చేయడంతో కుర్రో అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేస్తారు. ఎనిమిదేండ్ల జైలు శిక్ష అనంతరం విడుదలయ్యాక కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకుంటాడు. ఈ క్రమంలో కొన్ని అనుకోని సంఘటనలు జరగటంతో శత్రువులు వేటాడుతుంటారు. ఈ నేపథ్యంలో జరిగే ఆసక్తికర పరిణామాల సమాహారమే ఈ చిత్రం. ఈ స్పానిష్ థ్రిల్లర్‌కు రౌల్ అరెవాలో దర్శకత్వం వహించారు. 2016లో రిలీజైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలతోపాటు పలు అవార్డులను కూడా దక్కించుకుంది. కుర్రో పాత్రలో లూయిస్ కాల్లెజో అద్భుతంగా నటించారు.

ది ఇన్విజిబుల్ గార్డియన్

మహిళా ఇన్‌స్పెక్టర్ అమియాకు ఓ మర్డర్ మిస్టరీని ఛేదించే కేసును అప్పగిస్తారు. ఇన్వెస్టిగేట్ చేస్తున్న క్రమంలో ఓ టీనేజ్ అమ్మాయి శవం అడవిలోని నది తీరంలో కనుగొంటుంది. ఆ ప్రాంతమంతా ప్రాచీన మూఢనమ్మకాలకు సంబంధించిన వాతావరణం ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని అదృశ్య శక్తులు ఇన్‌స్పెక్టర్‌ను ఇబ్బంది పెడుతుంటాయి. వాటిని ఆమె ఎలా ఎదుర్కొంది?, ఇన్వెస్టిగేట్ చేస్తున్న టైమ్‌లో ఆమె తెలుసుకున్న కొత్త విషయాలు, చోటు చేసుకున్న భయానక, ఆసక్తికర పరిణామాల క్రమమే ఈ సినిమా కథ. ఓ నవల ఆధారంగా దర్శకుడు ఫెర్నాండో గొంజాలెజ్ మోలినా ఈ సినిమాను రూపొందించారు. 2017లో విడుదలై ఆకట్టుకుంది. ఇన్‌స్పెక్టర్ అమియా పాత్రలో మార్తా ఎటూరా నటించి మెప్పించారు.

ది మోటివ్

స్పెయిన్‌కి వలస వచ్చిన అల్వారో నోటరి ఆఫీసులో అకౌంటెంట్‌గా పనిచేస్తుంటాడు. కొన్ని రోజుల తర్వాత అమాండా అనే అమ్మాయిని వివాహం చేసుకుంటాడు. ఆమె తన మొదటి నవలతోనే బాగా పాపులర్ అవుతుంది. భార్యలా తాను కూడా రచయిత కావాలనుకుంటాడు. దానికి సంబంధించి ఒక ఊహ, స్ఫూర్తి లేకుండానే ఓ మంచి లిటరేచర్ కావాలనుంటాడు. దీని కోసమై అనేక ప్రయత్నాలు చేస్తాడు. మరి అతనిలో స్ఫూర్తిని నింపిన అంశమేంటి?, అల్వారో రైటర్ అయ్యాడా..లేడా అనేది ఈ చిత్ర కథాంశం. మాన్యువెల్ మార్టిన్ కునెస్కా దర్శకత్వం వహించిన ఈ సినిమా 2017లో విడుదలై ప్రశంసలందుకుంది. అల్వారో పాత్రలో జేవియర్ గుతిర్రేజ్, అమాండా పాత్రలో మరియా లియోన్ నటన మెస్మరైజ్ చేస్తుంది.

మార్ష్‌ల్యాండ్

స్పానిష్‌లోని దక్షిణాది డివిజన్‌లో వరుసగా టీనేజ్ యువతుల హత్యలు జరుగుతుంటాయి. ఈ కేసును ఇద్దరు డిటెక్టివ్స్ ఇన్వెస్టిగేట్ చేస్తుంటారు. ఈ ఇద్దరివి విభిన్న నేపథ్యాలు, భిన్న మనస్థత్వాలు. ఈ నేపథ్యంలో ఈ కేసును ఎలా ఛేదించారు?, ఈ క్రమంలో వీరి మధ్య చోటు చేసుకున్న పరిణామాలు ఏమిటి అనేది సినిమా. ఈ థ్రిలర్ చిత్రానికి ఆల్బెర్టో రోడ్రిగెజ్ దర్శకత్వం వహించారు. 2014లో రూపొందిన ఈ సినిమా ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతూ విమర్శకుల ప్రశంసలందుకోవడంతోపాటు పలు అంతర్జాతీయ అవార్డులను కైవసం చేసుకుంది. రౌల్ అరెవాల్లో, జేవియర్ గుతిఎర్రెజ్, ఆంటోనియో డె లా టోర్రె నటించారు.

జూలియెట్

జూలియెట్ మధ్య వయస్కురాలు. మాడ్రిడ్ నగరంలో తన ప్రియుడితో కలిసి నివసిస్తుంటుంది. వీరిద్దరు పోర్చుగల్‌కి వెళ్తుంటారు. ఈ క్రమంతో తన కూతురికి సంబంధించిన కొన్ని వాస్తవాలను జూలియెట్ తెలుసుకుంటుంది. దీంతో ఆమె లైఫ్‌లో చోటు చేసుకున్న భిన్న పరిణామాల సమాహారమే ఈ చిత్రం. పెడ్రో ఆల్మోడ్రోవర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2016లో విడుదలైంది. అకాడమీ అవార్డుకు నామినేట్ అయ్యింది. కేన్స్‌లోనూ ప్రదర్శితమై పలు అవార్డులను అందుకుంది. జూలియెట్ పాత్రలో ఎమ్మా సువారెజ్ అద్భుతంగా నటించింది.

స్టాక్ హోమ్

ఓ కుర్రాడు గర్ల్ ఫ్రెండ్ కోసం ట్రై చేస్తుంటాడు. ఓ రోజు పార్టీకి వెళ్తాడు. అక్కడ ఓ అమ్మాయికి తన లవ్‌ను ప్రపోజ్ చేస్తాడు. కానీ ఆమె తిరస్కరిస్తుంది. అంతటితో వదిలేయకుండా మాటల్లోకి దించుతూ ఒక అటెన్షన్ క్రియేట్ చేస్తాడు. ఎలాగైనా తన ప్రేమలోకి దించేందుకు ప్రయత్నిస్తుంటాడు. మరి అతని ప్రయత్నం ఫలించిందా.. లేదా? అనేదే సినిమా. రోడ్రిగో సోరోగోయ్న్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2013లో విడుదలైంది.

ది విష్‌ఫుల్ థింకర్స్

ఇద్దరు ఔత్సాహిక ఫిల్ మేకర్స్ జీవితాలను ప్రతిబింబించే చిత్రమిది. ఆ మేకర్స్‌కు ప్రేమ, జీవితం, సినిమాపై ఉన్న అభిరుచిని తెలియ జేస్తుంది. తాము అనుకున్న లక్ష్యాలను చేరే క్రమంలో ఎలాంటి పరిణామాలను చవిచూశారనేది సినిమా. బ్లాక్ అండ్ వైట్‌లో తీసిన ఈ డ్రామా చిత్రానికి జోనాస్ ట్రూయిబ దర్శకత్వం వహించారు. ఫ్రాన్సిస్కో కార్రిల్, ఔరా గార్రిడో ప్రధాన పాత్రల్లో నటించి మెప్పించారు. 2013లో విడుదలై విశేషంగా ఆకట్టుకుంది.


10,000 కిలోమీటర్స్

సెగ్రీ, అలెగ్జాండ్రా భార్యభర్తలు. ఒకరంటే ఒకరికి అమితమైన ప్రేమ. అలెగ్జాండ్రా ఫొటోగ్రాఫర్. వృత్తి రీత్యా ఆమె లాస్ ఏంజెల్స్‌కు వెళ్ళాల్సి వస్తుంది. సెగ్రీ స్పెయిన్‌లో ఉంటాడు. దూరంగా ఉన్నప్పటికీ తమ అనుబంధాన్ని టెక్నాలజీ సహాయంతో కొనసాగించాలనుకుంటారు. కానీ శారీరకంగా కలవడమనేది పెద్ద సమస్యగా మారుతుంది. ఈ నేపథ్యంలో తమ వైవాహిక జీవితాన్ని, వృత్తి జీవితాన్ని ఎలా బ్యాలెన్స్ చేశారనేది సినిమా. రొమాంటిక్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రానికి కార్లోస్ మార్క్యూస్-మార్సెట్ దర్శకత్వం వహించారు. 2014లో విడుదలైన ఈసినిమా మంచి ఆదరణ పొందడంతో పాటు పలు అవార్డులను దక్కించుకుంది.

ది నైట్ మై మదర్ కిల్డ్ మై ఫాదర్

ఇసబెల్ పాపులర్ నటి. 40ఏండ్ల వయసులోనూ అగ్రనటిగా కొనసాగుతుంది. అయితే వయసు మీద పడుతుండటంతో ఫిల్మ్ మేకర్స్ ఆమె స్థానంలో యువ కథానాయికలకు అవకాశాలిస్తుంటారు. ఛాన్స్‌లు తగ్గిపోవడంతోపాటు పాపులారిటి, ఇమేజ్ పడిపోతుంది. దీంతో నటిగా తన పూర్వ వైభవం పొందడానికి ఇసబెల్ ఏం చేసిందనేది సినిమా. ఇన్స్ పారిస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2016లో విడుదలై ఆకట్టుకుంది. ఇసబెల్ పాత్రలో బెలెన్ రుయాట తనదైన నటనతో అలరించింది.




















20 మందిపై వేటు

(మొదటిపేజీ తరువాయి)



క్రీడలను ప్రారంభించడానికి టాస్ వేస్తున్న కేజ్రీవాల్

దేశ ప్రజల దృష్టి మళ్లించేందుకు తన ఏజెంట్ల ద్వారా ఎన్నికల కమిషన్ ప్రతిష్టకు భంగం కలిగిస్తోందని ఆప్ అధికార ప్రతినిధి సౌరభ్‌భరద్వాజ్ అన్నారు. ఈ అంశంపై హైకోర్టు, అవసరమైతే సుప్రీంకోర్టు తలుపు తట్టనున్నట్టు ఆప్ సీనియర్ నేత గోపాల్‌రాయ్ అన్నారు. ఈసీ సిఫారసుపై ఇప్పటికే(ఈ నెల 19న) ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా విచారణను ఈ నెల 22కు (సోమవారానికి) వాయిదా వేసింది.


వివక్షాపూరితం: ఢిల్లీ సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ: ఆమాద్మీ పార్టీకి చెందిన 20 మంది శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాలన్న ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దురదృష్టకరమైన ఈ నిర్ణయం అత్యంత వివక్షాపూరితమైనదని, భారత ఎన్నికల చరిత్రలో కనీ, వినీ ఎరుగనిదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో విమర్శించింది. హర్యానా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలలో ఇటువంటి అనేక కేసులు పెండింగ్‌లో వున్నప్పటికీ ఎన్నికల కమిషన్ వాటిపై దృష్టి పెట్టకుండా తాత్సారం చేయటంలో ఉద్దేశమేమిటని ప్రశ్నించింది. ఇవన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలు కావటమే ఇందుకు కారణమని అభిప్రాయపడింది. ఎన్నికల కమిషన్ హడావుడిగా తీసుకున్న ఈ నిర్ణయం కేంద్రంలోని రాజకీయ బాస్‌లను మెప్పించే రాజకీయ జిమ్మిక్ తప్ప మరేమీ కాదని దుయ్య బట్టింది. ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసిన ఈసీ నిర్ణయంపై అనేక అనుమానాలున్నా యని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ వెల్లడించింది. ప్రధాన ఎన్నికల కమిష నర్ రిటైరవటానికి ముందు రోజు ఈ నిర్ణయం తీసుకోవటం వెనుక అధికార పార్టీ వత్తిడి వుందని భావిస్తున్నట్లు తెలిపింది.

వాస్తవానికి ఎన్నికల కమి షన్ పనితీరు దీర్ఘకాలంగా పలు అనుమానాలకు తావిస్తోందని, గుజరాత్ ఎన్నికల ప్రకటన తీరు కానీ, ఢిల్లీ ఎమ్మెల్యేల లాభదాయక పదవుల వివాదం కానీ ఏదైనా ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తున్నదన్న అభిప్రాయం బలపడుతోందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు ఎటువంటి నేరం చేయక పోయినా వారిని అనర్హులుగా ప్రకటించడం ప్రజా స్వామ్యంపై దాడి చేయటమేనని, భారత ఎన్నికల చరిత్రలో (ప్రజాస్వామ్యాన్ని) హత్య చేసినరోజుగా దీనిని భావించాల్సి వుంటుందని సీపీఐ(ఎం) వ్యాఖ్యానించింది. లాభదాయక పదవుల అంశాన్ని పునర్నిర్వచించాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపింది. రాజ్యాంగ వ్యవస్థలను రాజకీయజోక్యం నుండి రక్షించటానికి 'అందరికీ ఒకే చట్టం, ఒకే న్యాయం' అన్న సూత్రాన్ని అమలుచేయటానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంస్థలు ఉద్యమించాలని సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. అదే విధంగా ఎన్నికల కమిషన్ తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ప్రజలెన్నుకున్న శాసన సభ్యులు ఎటువంటి భయం లేకుండా తమ విధులను నిర్వర్తించుకునే వీలుకల్పించాలని డిమాండ్ చేసింది.

రాష్ట్రపతిది నిర్హేతుకమైన చర్య

- ఆప్ ఎమ్మెల్యేల అనర్హతపై యశ్వంత్ సిన్హా



న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల కమిషన్ చేసిన సిఫారసును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నిర్హేతుకంగా ఆమోదించారని సీనియర్ బీజేపీ నేత యశ్వంత్ సిన్హా ఆరోపించారు. ఆప్ ఎమ్మెల్యేలు 20 మందిని అనర్హులుగా ప్రకటిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయడం సహజ న్యాయాన్ని పూర్తిగా తప్పుదోవ పట్టించడమేనన్నారు. విచారణ లేదు. హై కోర్టు ఉత్తర్వుల కోసం ఆగింది లేదు, రాష్ట్రపతివి నిర్హేతుకమైన ఉత్తర్వులు అని యశ్వంత్ ట్వీట్ చేశారు. ఎన్నికల కమిషన్ సిఫార్సులకు రాష్ట్రపతి కోవింద్ ఆమోదం తెలిపిన తరువాత కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ కాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (జీఎన్‌సీటీడీ) చట్టంలోని 15(1)(ఎ) కింద ఢిల్లీ లెజిస్లేటివ్ అసెంబ్లీకి చెందిన 20 మంది సభ్యులను అనర్హులుగా రాష్ట్రపతి పేర్కొన్నారని నోటిఫికేషన్ వెల్లడించింది. ఆప్‌కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు పార్లమెంటరీ సెక్రెటరీలుగా లాభదాయక పదవులలో కొనసాగుతున్నారని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల కమిషన్ శుక్రవారం రాష్ట్రపతికి సిఫారసు చేసింది.

బీజేపీ, కాంగ్రెస్‌కు తేడా లేదు

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలో కొనసాగుతున్న బీజేపీకీ, ఇంతకుముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు తేడా లేదని తీర్మానంలో స్పష్టం చేసినట్టు ఏచూరి తెలిపారు. ముసాయిదా తీర్మానంపై పార్టీ 22వ మహాసభ తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు. తాను పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగటంపై మీడియా నుంచి వచ్చిన ప్రశ్నలకు ఏచూరి సమాధానమిచ్చారు. పొలిట్‌బ్యూరో తోపాటు కేంద్ర కమిటీ తనను ప్రధాన కార్యదర్శిగా కొనసాగాలని కోరినట్టు ఏచూరి తెలిపారు. సీపీఐ(ఎం) అనుసరించేది దేశ అవసరాలకు తగిన ప్రత్యామ్నాయ విధానాల కోసమని, నాయకుల కోసం కాదని ఏచూరి అన్నారు.

నెపోలియన్‌కు వాటర్లూ యుద్ధంలో ఎదురైన అనుభవమే త్రిపురలో బీజేపీకి తప్పదని ఏచూరి అన్నారు. 1815లో జరిగిన వాటర్లూ యుద్ధంలో నెపోలియన్ నేతృత్వంలోని ఫ్రెంచి సైన్యం ఇంగ్లిష్ సేన(బ్రిటిష్ సైన్యం) చేతిలో ఓడిపోవడం గమనార్హం. త్రిపురలో అధికారంలోకి రావడానికి బీజేపీ డబ్బు, దౌర్జన్యాన్ని ఆధారంగా చేసుకుంటోందని ఏచూరి అన్నారు. దేశభక్తి గురించి మాట్లాడే బీజేపీ త్రిపురలో వేర్పాటువాద ఐపీఎఫ్‌టీ, ఎన్‌ఎల్‌ఎఫ్‌టీతో చేతులు కలపడం విడ్డూరమని ఆయన అన్నారు. ఈ ఉగ్రవాద సంస్థలు త్రిపురను దేశం నుంచి విడగొట్టి టిప్రాల్యాండ్ పేరుతో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాలని ప్రణాళిక వేశాయని ఏచూరి తెలిపారు. జాతీయవాదం పేరుతో ప్రజల్ని మభ్యపెడుతున్న బీజేపీ దేశాన్ని ప్రమాదకర పరిస్థితుల్లోకి తీసుకెళ్తుందని ఏచూరి విమర్శించారు.

కోయంబత్తూరులో మొదటిసారి జల్లికట్టు



చెన్నై: తమిళనాడు ప్రజలు జరుపుకునే సంచలనాత్మక వేడుకైన జల్లికట్టును మొట్ట మొదటిసారిగా కోయం బత్తూరు జిల్లాలో ఈ నెల 28న జరగ నున్నది. కోయంబత్తూరు జిల్లా యంత్రాంగం, ఓంకార్ ఫౌండేషన్ సం యుక్తంగా చెట్టి పలయమ్ శివార్లలో సంచలనాత్మక వేడుక జల్లికట్టును నిర్వహించ నున్నారు. ఈ వేడుకలో దాదాపు 750 ఎద్దులు పాల్గొంటాయని అంచనా వేశామని అయితే 550 బుల్ టామర్స్ మాత్రమే నమోదుచేసుకున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఈ వేడుకను సందర్శకులు తిలకించేందుకు వీలుగా తాత్కాలిక గ్యాలరీని 25 ఎకరాల్లో ఏర్పాటు చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఇందులో దాదాపు 5వేల మందికి వసతి కల్పించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.

పటాన్‌చెరులో కరాటే గిన్నీస్ రికార్డు ప్రదర్శన

పాల్గొన్న 295మంది కరాటే క్రీడాకారులు

- 'హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆర్థికసాయంతో ఈ యూనివర్సల్ షోటోకన్ మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం మైత్రి మైదానంలో కరాటే గిన్నీస్ వరల్డ్ రికార్డు ప్రదర్శన నిర్వహించారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి మాస్టర్ జయంత్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రదర్శనలో రాష్ట్రానికి చెందిన 295మంది కరాటే క్రీడాకారులు పాలుపంచుకున్నారు. 30 నిమిషాల్లో 2.65లక్షల ఫుల్ కాంటాక్ట్ కిక్స్‌ను క్రీడాకారులు అటెమ్ట్ చేశారు. ఇలాంటి ప్రదర్శనల్లో ఇప్పటివరకు కేవలం 50 నుంచి 100 మంది మాత్రమే పాల్గొనగా.. తాజాగా 295మందితో 30 నిమిషాల పాటు 2.65లక్షల ఫుల్ కాంటాక్ట్ కిక్స్‌లో ప్రదర్శించడం గమనార్హం. ఇంత పెద్ద కరాటే ప్రదర్శన ఎక్కడా జరగలేదని గిన్నీస్ వరల్డ్ రికార్డు ప్రతినిధి మాస్టర్ జయంత్‌రెడ్డి తెలిపారు. ఈ కరాటే ప్రదర్శనను గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ పరిశీలన కోసం పంపుతామని ప్రతినిధి జయంత్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రదర్శనను పరిశీలించి, ప్రదర్శన ఫలితాలను తెలియజేసేందుకు 15రోజులు పడుతుందన్నారు. ప్రదర్శనలో హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థ సైతం పాల్గొంది. ఈ ప్రదర్శన 'హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' సాధించింది. గతంలో గంటలో 1.1లక్షల ఫుల్ కాంటాక్ట్ కిక్స్ ప్రదర్శించారని.. నేడు 295 మందితో కేవలం 30 నిమిషాల్లో 2.65లక్షల ఫుల్ కాంటాక్ట్ కిక్స్ ప్రదర్శించారని 'హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' సీఈఓ సుమన్, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. రికార్డు సాధించినందుకు మాస్టర్ వేముల రమేశ్‌కు, వారికి సహకారం అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిలకు సర్టిఫికెట్లు, మెడళ్లు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్‌గౌడ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ బి.పుష్పనాగేశ్, వైస్‌చైర్మెన్ బసవేశ్వర్, ఆత్మ కమిటీ చైర్మెన్ గడీల కుమార్‌గౌడ్, సర్పంచ్ భిక్షపతి, ఎంపీపీలు ఎస్.యాదగిరియాదవ్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుతున్న మీటర్లు

(మొదటిపేజీ తరువాయి)

అమర్చాల్సిన బాధ్యత విద్యుత్ పంపిణీ సంస్థలదేనని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఓల్టేజ్ హెచ్చుతగ్గులతో కూడా మీటర్లు తిరగకుండా నిలిచిపోవడం, కాలిపోవడం జరుగుతాయని ఆయన వివరించారు. ఈ సమస్య అన్ని కేటగిరీల విద్యుత్ సరఫరాకు లేకుండా, కేవలం డొమెస్టిక్ కేటగిరికే పరిమితం కావడంపై అనేక సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఓవైపు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్‌ను 24గంటల పాటు సరఫరా చేస్తున్నామని చెప్తున్న విషయం తెలిసిందే. అలాంటప్పుడు డొమెస్టిక్ కేటగిరి మీటర్లు ఎందుకు కాలిపోతున్నాయనేది అంతుపట్టని ప్రశ్నగా మిగిలింది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) 2015-16 టారిఫ్ ఆర్డర్‌లో పేర్కొన్న విధంగా కరెంటు మీటర్లు పనిచేయకుండా పోతే సదరు వినియోగదారుడి నుంచి కేవలం రూ.100 మాత్రమే వసూలు చేయాలని, మిగిలిన ఆర్థిక భారాన్ని డిస్కంలు భరించాలని స్పష్టంగా పేర్కొంది. మీటర్ల మార్పిడిని ప్రభుత్వం ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించింది. ఒక్కో మీటర్ మార్పిడికి గ్రామాలు, పట్టణాల్లో వేర్వేరుగా రూ.100 నుంచి రూ.150 వరకు డిస్కంలు ఈ ఏజెన్సీలకు చెల్లిస్తాయి. మీటర్ల కొనుగోళ్లు మాత్రం డిస్కంలే చేస్తాయి. అయితే వినియోగదారుల నుంచి ఏజెన్సీలు రూ.500 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. డిస్కంలు టెండర్ల ప్రక్రియ ద్వారా కరెంటు మీటర్లను కొనుగోలు చేస్తాయి. వాటి గడువు ముగియడంతో కొద్ది కాలంగా నామినేషన్ పద్ధతిలోనే మీటర్లను కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంలో భారీగా అవినీతి చోటుచేసుకుంటుం దనే అనుమానాల్ని విద్యుత్ సంస్థల్లోని కిందిస్థాయి ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. మీటర్లు మార్పిడి చేసే ప్రయివేటు ఏజెన్సీలు కూడా విద్యుత్ శాఖలోని కొందరు ఉన్నతాధికారులు, అధికారపార్టీ ప్రజాప్రతినిధుల బినామీలే ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కరెంటు మీటర్ల అవినీతి వ్యవహారం చడీచప్పుడు లేకుండా జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఏటా 10 శాతానికి పైగా గృహ వినియోగ కేటగిరి కరెంటు మీటర్ల రీప్లేస్‌మెంట్ వెనుక భారీ అవినీతి కుంభకోణమే ఉన్నదని ఓ రాజకీయపార్టీ ప్రముఖుడు వ్యాఖ్యానించారు. డొమెస్టిక్ కేటగిరి మీటర్లతో పోల్చితే త్రీఫేజ్ మీటర్ల రీప్లేస్‌మెంట్ తక్కువగా ఉంది. టీఎస్ఎస్పీడీసీఎల్ పరిధిలో సింగిల్‌ఫేజ్ మీటర్ల రీప్లేస్‌మెంట్ 2,94,622 కాగా త్రీఫేజ్ మీటర్లు 21,310 రీప్లేస్‌మెంట్ జరిగాయి. 2015 సెప్టెంబర్ 30వ తేదీ నుంచి 2017 సెప్టెంబర్ 30వ తేదీ వరకు లభించిన గణాంకాల్లో ఈ మీటర్ల రీప్లేస్‌మెంట్ వ్యవహారం బయటపడింది. విద్యుత్ సంస్థలు తమ అంతర్గత సామర్థ్యాన్ని పెంచుకోవాలని, నష్టాలను నివారించుకోవాలని టీఎస్ఈఆర్సీ ప్రతిసారీ హెచ్చరిస్తూనే ఉంది. అయితే దీన్ని డిస్కంలు పెద్దగా పట్టించుకుంటున్నట్టు కనిపించట్లేదు. ఎప్పుడైనప్పుడు గత ఏడాదితో పోల్చితే...అంటూ ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి అర్ధభాగం వివరాలను మాత్రమే టీఎస్ఈఆర్సీకి నివేదిస్తున్నాయి. దీనివల్ల గణాంకాల లెక్కింపులో తీవ్ర గందరగోళం నెలకొంటోంది.

నిజాం రికార్డులేవి..?

హోం శాఖను కోరిన కేంద్ర సమాచార శాఖ



ఫైల్

న్యూఢిల్లీ: నైజాం చివరి పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ వారసుడికి సంబంధించిన కీలక దస్త్రాలను అందజేయాల్సిందిగా కేంద్ర హోం శాఖను కేంద్ర సమాచార శాఖ కోరింది. ఉస్మాన్ అలీఖాన్ వారసుడు మీర్ బర్కత్ అలీఖాన్‌ను యువరాజుగా గుర్తిస్తూ భారత ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపునకు సంబంధించిన ఆధారాలను తెలపాల్సిందిగా సయీద్ ఖాలిక్ అనే వ్యక్తి ఆర్‌టీఐలో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ సమాచారాన్ని నేషనల్ అర్చీవ్స్ ఆఫ్ ఇండియా(ఎన్ఐఏ)కు అప్పగించాలని సమాచార శాఖ కమిషనర్ యశోవర్దన్ ఆజాద్ హోంశాఖను కోరారు. ఈ ఆధారాలను వెతకడానికి ఒక సబ్ కమిటీని నియమించాలని ఆయన కేంద్రానికి సూచించారు. బర్కత్ అలీఖాన్ చరిత్రను తెలుసుకోవడానికి ఇటీవల పరిశోధక విద్యార్థులు, ఇతరులు ఎన్ఐఏలో వెతుకుతున్న నేపథ్యంలో ఆ రికార్డులన్నింటిని సమాచార శాఖకు అప్పగించాలన్నారు. హైదరాబాద్ ఆఖరి నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ మనవడు నవాబ్ మీర్ బర్కత్ అలీ ఖాన్ తనకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ నిజాం వారసుడిగా ప్రకటించాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. అయితే ఉస్మాన్ అలీఖాన్ మృతి (1967, ఫిబ్రవరి 24న) చెందాక, ప్రభుత్వం బర్కత్ అలీఖాన్‌కు 'రూలర్ ఆఫ్ హైదరాబాద్'గా గుర్తింపునిచ్చింది. వారసుల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య వచ్చిన వివాదాలతో గుర్తింపు పత్రం భారత ప్రభుత్వం ఎవ్వరికీ ఇవ్వలేదు. ఇప్పుడు ఖాలిక్, ఆ తేదీ నాటి వివరాలు కావాలని ఆర్‌టీఐలో పిటిషన్ వేశాడు. తమకు కేంద్ర ప్రభుత్వం అందించిన సమాచారన్నంతా ఇప్పటికే డిజిటలైజ్ చేశామని, సంబంధిత వివరాలు తమ వద్ద లేవని ఎన్ఐఏ తెలిపింది. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఇలాంటి సమాచారాన్ని హోంశాఖ సరైన విధంగా జాగ్రత్తపరచకపోవడం వల్ల కీలక సమాచారం కోల్పోవలసి వస్తుందని ఎన్ఐఏ అధికారి తెలిపారు.

కాబూల్ దాడిలో 43 మంది మృతి?

- 11మంది ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు బలి..
- 17 గంటల పాటు ఎదురు కాల్పులు..
- ముష్కరులంతా హతం : ప్రభుత్వ ప్రకటన



కాబూల్: ఆఫ్ఘన్‌లోని కాబూల్ నగరంలో కాంటినెంటల్ హోటల్‌పై దాడి చేసిన ముష్కరులను రాత్రంతా కొనసాగిన పోరులో సైన్యం మట్టుపెట్టింది. హోటల్‌లోకి ప్రవేశించిన ముగ్గురు మిలిటెంట్లు అక్కడి అతిథులను తమ బందీలుగా తీసుకున్నారు. సమాచారం తెలుసుకుని అక్కడికి చేరుకున్న సైన్యం, ఇతర భద్రతా దళాలు వారిపై ప్రారంభించిన పోరు రాత్రంతా కొనసాగింది. కొన్ని గంటల సేపు సాగిన ఈ పోరులో ఆదివారం ఉదయానికి చివరి మిలిటెంట్‌ను కూడా సైన్యం మట్టుపెట్టినట్టు ఆఫ్ఘన్ ప్రభుత్వం ప్రకటించింది. ముగ్గురు సాయుధులు శనివారం రాత్రి సైన్యం దాడిలోనే మరణించారని అధికారులు చెప్పారు. ఈ దాడిలో 43మంది మరణించారని, అందులో 11మంది ఎయిర్‌లైన్స్ ఉద్యోగులుగా మృతి చెందినట్టు గుర్తించారు. సుమారు 17 గంటల పాటు జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు తాలిబను ఉగ్రవాదులు చనిపోయారని హోం మంత్రిత్వశాఖ ప్రతినిధి నజీబ్ డానిష్ చెప్పారు. దాడి సమాచారం అందిన వెంటనే హోటల్ యాజమాన్యం అందులో వున్న 41 మంది విదేశీయులతో సహా మొత్తం 153 మందిని ఖాళీ చేయించినట్టు తెలుస్తోంది. దాడి చేసిన 24 గంటల తరువాత సైతం ఆదివారం నాడు ఈ హోటల్ భవనం నుండి నల్లటి దట్టమైన పొగ వెలువడుతు ఒడటం ప్రజలకు కన్పించింది. అమెరికా సైన్యానికి చెందిన అనేక సాయుధ శకటాలు, హెవీ మిషన్ గన్‌లతో ఆఫ్ఘన్ పోలీసులతో కలిసి ఈ భవనాన్ని ముట్టడించాయి. కాబూల్‌లో పర్యాటకులు బసచేసే హోటళ్లపై దాడి జరగవచ్చని అమెరికన్ రాయబార కార్యాలయం హెచ్చరిక జారీ చేసిన కొద్దిరోజులకే ఈ దాడి జరగటం గమనార్హం.

పాలస్తీనా పోరుపై ఫేస్‌బుక్, యూట్యూబ్ సెన్సార్

రమల్లా: పాలస్తీనీయుల వాణిని ప్రపంచానికి వినిపించే విషయంలో సోషల్ మీడియా అప్రకటిత సెన్సారింగ్‌ను పాటిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలలో పాలస్తీనా పోరుకు సంబంధించిన వార్తలను సెన్సార్ చేస్తూ పోరాట వాణిని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నా రంటూ ఆన్‌లైన్‌లో ఉద్యమిస్తున్నారు ముగ్గురు పాలస్తీనా జర్నలిస్టులు. సదా సోషల్ పేరిట గత సెప్టెంబర్‌లో వీరు ప్రారంభించిన ఈ ఉద్యమంలో 'పాలస్తీనాకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ఉల్లంఘనల' పేరిట ఆన్‌లైన్‌లో విడుదల చేసిన పత్రంలో ఫేస్‌బుక్, యూట్యూబ్‌లు అనుసరిస్తున్న అప్రకటిత సెన్సారింగ్‌ను ఎండగట్టారు. ఈ రెండు సంస్థలూ తొలగించిన పేజీలను, ఖాతాలను తక్షణమే పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. సాధారణంగా సోషల్ మీడియా వేదికలేవీ రాజకీయ విమర్శలు, విద్వేష ప్రసంగాలు, హింసను రెచ్చగొట్టే అంశాల వంటి వాటిని స్వీకరించబోవని పరిశీలకులు చెబుతున్నారు. సదా ఉద్యమ సంస్థకు చెందిన పాలస్తీనా జర్నలిస్టులు, కార్యకర్తలు మాత్రం సామాజిక మాధ్యమ సంస్థలు తమ పోరాటం పట్ల ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయని విమర్శిస్తున్నారు.

బిగ్‌బజార్ బంపర్ ఆఫర్

- రూ.5,000 కొనుగోలుపై రూ.1000, రూ.2500 కొనుగోలుపై రూ.500 క్యాష్‌బ్యాక్
- ఈనెల 24 నుంచి 28వరకు మాత్రమే




హైదరాబాద్ : వినియోగదారులకు బంపర్ ఆఫర్ అందించనున్నట్టు బిగ్‌బజార్ ప్రకటించింది. రూ.5వేల కొనుగోలుపై రూ.1000, రూ.2500 కొనుగోలుపై రూ.500 క్యాష్‌బ్యాక్ ఆఫర్ ఇస్తున్నట్టు తెలిపింది. బిగ్‌బజార్ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 24నుంచి 28వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని, వినియోగదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఈవో సదాశివ నాయక్ కోరారు. త్వరలో డబుల్ ధమాకా ఆఫర్ కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. తమ వ్యాపారాభివృద్ధి కోసం 12ఏండ్ల నుంచి సహకరిస్తున్న వినియోగదారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బిగ్‌బజార్‌లో గృహోపకరణాలకు సంబంధించిన ఐటెమ్స్, ఆటవస్తువులు, షూస్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, కిచన్‌వేర్ తదితర వస్తువులు సరసమైన ధరల్లో లభిస్తున్నాయని అన్నారు. 'సబ్‌సే సస్తా 5దిన్' పేరిట నిర్వహించనున్న బంపర్ ఆఫర్‌ని కస్టమర్లంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పురుషుల కోసం డెనిమ్ ఉత్పత్తులు ఒకటి కొంటే రెండు ఉచితంగా ఇవ్వనున్నట్టు ప్రకటించారు. రూ.1350 విలువ చేసే ఐదు కిలోల దిల్‌కుష్ రైస్, ఒక లీటర్ పతంజలి నెయ్యి, ఐదు కిలోల మధుర్ క్రిస్టల్ చక్కెర కేవలం రూ.979కే అందించనున్నట్టు తెలిపారు. కోర్యో 3స్టార్ స్ప్లిట్ ఎయిర్‌కండీషన్‌పై, పిజియన్ బర్నర్ గ్యాస్ స్టవ్, బ్రాండెడ్ బెడ్‌షీట్స్‌పై బంపర్ ఆఫర్ అందిస్తున్నామని అన్నారు.

ద్వితీయ శ్రేణి పౌరులుగా

వలస కార్మికులు

కేంద్రంపై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ : వలస కార్మికులను కేంద్రం ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. పాస్‌పోర్టును చిరునామా ధృవీకరణగా పరిగణించకూడదని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని 'వివక్షపూరితమైంది'గా రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయం ఆమోదయోగ్యం కాదని, ఇది వలస కార్మికులను ద్వితీయ శ్రేణి పౌరులగా పరిగణించడమేనని ఆయన అన్నారు. పాస్‌పోర్టు చివరిపేజీలో చిరునామా ముద్రించకూడదని, పాస్‌పోర్టును నివాస ధృవీకరణ పత్రంగా ఉపయోగించకూడదని, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. విదేశాంగ శాఖ, మహిళ శిశుసంక్షేమ శాఖలకు చెందిన ముగ్గురు సభ్యుల ప్యానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి రెండు రంగులతో పాస్‌పోర్టును జారీ చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎమిగ్రేషన్ చెక్ అవసరమైన వారికి ఆరంజ్ రంగు పాస్‌పోర్టు, ఎమిగ్రేషన్ చెక్ అవసరం లేని వారికి బ్లూ కలర్ పాస్‌పోర్టు జారీ చేస్తారు. ప్రస్తుత ఉన్న పాస్‌పోర్టులు వాటి గడువు తేదీ ముగిసే వరకూ కొనసాగించబడతాయి.

వీధికుక్కల ముందు తలవంచం

బళ్లారి : కేంద్రమంత్రి అనంతకుమార్ హెగ్డే మళ్లీ దళితులపై వివాదస్పద వ్యాఖ్యలు చేశారు.గతంలో మొరుగుతున్న కుక్కలకు భయపడబోం..రాజ్యాంగాన్ని మార్చేస్తామంటూ వ్యాఖ్యలు చేసి పార్లమెంటు సాక్షిగా క్షమాపణ చెప్పిన హెగ్డే నోటి దూల తీరలేదన్నట్టుగా వ్యవహరించారు. మళ్లీ అదే వివాదంలో చిక్కారు. ఓ జాబ్ ఫెయిర్‌ను ప్రారంభించేందుకు బెంగళూరు నుంచి బళ్లారికి కారులో వచ్చారు. ఈ సందర్భంగా కొంతమంది దళితులు ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. రాజ్యాంగంపై పరుష వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. జాబ్ ఫెయిర్ ప్రారంభించాక..ఆయన మాట్లాడుతూ 'మేం మీకు సాయం చేయాలనే కృత నిశ్చయంతో ఉన్నాం. ఏదేమైనా మేం మీతో ఉంటాం. మా ప్రజలను బతికించుకునేందుకు మేం ఏమైనా చేస్తాం. వీధి కుక్కల అరుపులకు, ఆందోళనలు, నిరసనలకు మేం తలవం చబోం' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై నటుడు ప్రకాశ్ రాజ్ వెంటనే గట్టి కౌంటర్ ఇచ్చారు. హెగ్డే ఎన్ని తప్పులు చేస్తారని, ఇక ఆయన ఆపాలని, దళితులను వీధికుక్కలంటూ అవమానిస్తారా? అని ట్విటర్‌లో ప్రశ్నించారు. బీజేపీ సీనియర్ నాయకత్వం జోక్యం చేసుకుని హెగ్డేను దిగిపోవాలని ఆదేశించాలని, క్షమాపణలు కోరాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఈసీగా రావత్

(మొదటిపేజీ తరువాయి)

కమిషనర్‌గా ఉన్న ఆచల్‌కుమార్ జ్యోతి సోమవారంతో ముగియనున్నది.తదుపరి సీఈసీగా రావత్‌ను నియమించారు. 64 ఏండ్ల రావత్ 1977 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి.కేంద్రంలో పలు పదవులను నిర్వర్తించారు.పుట్టింది ఉత్తరప్రదేశ్‌లో అయినా..మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.ఎన్నికల కమిషనర్‌గా మాజీ ఆర్థిక శాఖ కార్యదర్శి అశోక్ లావాసా ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు.

అనుమతి లేకుండా 'ఆమె'ను తాకరాదు

(మొదటిపేజీ తరువాయి)

మహిళలు, బాలికలను విపరీత లైంగిక పోకడలున్న కొంతమంది పురుషులు తాకటం, తడమటం చేస్తున్నారని, ఇది కూడా లైంగిక నేరమేనని న్యాయమూర్తి తీర్పు చెప్పారు. 9 ఏండ్ల బాలికపై ఒక వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడన్న కేసులో తీర్పు చెబుతూ న్యాయమూర్తి సీమా మైనీ పై వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన చావి రామ్‌ను దోషిగా తేల్చుతూ, ఐదేండ్ల కఠిన జైలు శిక్ష విధించారు. విపరీత లైంగికపోకడలున్న పురుషుల చేతుల్లో అనేకమంది మహిళలు, బాలికలు ఇంకా బలవుతున్నారని న్యాయమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో ఉత్తరఢిల్లీలోని ఒక మార్కెట్‌లో ఒంటరిగా కనిపించిన 9 ఏండ్ల బాలికను చావి రామ్ అడ్డగించి, లైంగికదాడికి పాల్పడ్డాడని ఆరోపణలు నమోదయ్యాయి. అయితే ఆ బాలికను తాను తాకటం, తడమటం చేయలేదని, జనం విపరీతంగా ఉండటం మూలానా మరొకరు చేసిన పనికి తనను బాధ్యుడ్ని చేస్తున్నారని చావి రామ్ కోర్టు ముందు వాదన వినిపించాడు. అయితే రామ్ చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఈ కేసు విషయమై విచారణ అనంతరం న్యాయమూర్తి సీమా మైనీ తీర్పు వెలువరిస్తూ.."ఓ మహిళ, ఓ బాలిక శరీరాన్ని అనుమతి లేకుండా, ఏ ఉద్దేశంతోనూ ఎవరూ తాకరాదు. ఇది ఆమె వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన విషయం. ముఖ్యంగా అసహాయ స్థితిలో ఉన్న బాలికలను, మహిళల్ని కొంతమంది పురుషులు తాకటం, తడమటం..లైంగికనేరం కిందకే వస్తుంది. బస్సుల్లో, మెట్రో రైళ్లలో, సినిమా హాళ్లలో కిక్కిరిసిన జనం మధ్య మహిళలు, బాలికలు బాధితులవుతున్నారు. విపరీత లైంగిక పోకడలున్న పురుషులు ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. సాంకేతికంగా ముందడుగు వేసిన ఈ కాలంలో ఇవి కొనసాగడానికి వీల్లేదు" అన్నారు.

పోటెత్తిన మేడారం

(మొదటిపేజీ తరువాయి)

సందర్శకులు ప్రయివేట్ వాహనాల్లో మేడారానికి భారీగా పోటెత్తారు. దీంతో నార్లాపూర్ నుంచి సమ్మక్క-సారలమ్మల గద్దెల వరకు రోడ్డు కిరువైపులా వాహనాలు ఎక్కడిక్కడే రెండు గంటల పాటు నిలిచిపోయాయి. ఎస్పీ భాస్కరన్, అడిషనల్ ఎస్పీ బానోతు రాజమహేంద్ర నాయక్, ములుగు డీఎస్పీ రాఘవేందర్‌రెడ్డి రంగంలోకి దిగి రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలను కన్నెపల్లి, ఊరట్టం వైపు వాహనాలను మళ్లించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బీహార్‌లో భారీ మానవహారం

- బాల్య వివాహలు, వరకట్నానికి వ్యతిరేకంగా

పాట్నా : సామాజిక దురాచారాలు బాల్య వివాహలు, వరకట్నానికి వ్యతిరేకంగా బీహార్‌లో వేలాది మంది ప్రజలు భారీ మానవహారాన్ని ఏర్పాటు చేశారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత గిరిజా సింగ్, మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ మంజీ, అధికార కూటమి నేషనల్ డెమోక్రటిక్ అలియన్స్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు ఈ మానవహారంలో పాల్గొన్నారు. బీహార్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మానవహారం ప్రపంచంలోనే భారీ మానవహారమని అధికారులు చెబుతున్నారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు చెందిన బృందం ఈ మానవహారాన్ని నమోదు చేసింది. 'మధ్యాహ్నం 12:30 గంటల నుంచి ప్రారంభమైన ఈ మానవహారంలో చిన్నారులు, పెద్దలు, గృహిణులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, ఇతరులతో సహా వేలాది మంది పాల్గొన్నారు' అని రాష్ట్ర ముఖ్యకార్యదర్శి అంజని కుమార్ సింగ్ మీడియాకు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయరహదారులు, గ్రామీణ రోడ్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఈ మానవహారాల్లో 4.3 కోట్లమంది (బీహార్ జనాభా 11 కోట్లు) పాల్గొని వుంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. 40 డ్రోన్ కెమెరాలతో ఈ మానవహారాన్ని చిత్రీకరించారు. బాల్య వివాహలు, వరకట్నానికి వ్యతిరేకంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం దేశంలో ఇదే మొదటిసారని అధికారులు అంటున్నారు.

ఫిబ్రవరి 19 నుంచి గురుకుల డిగ్రీ, జూనియర్ లెక్చరర్ పోస్టులకు మెయిన్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులకు నిర్వహించిన ప్రిలిమినరీ రాతపరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. వివిధ పోస్టులకు 1:15 నిష్పత్తి చొప్పున అభ్యర్థులను ఎంపిక చేశామని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రరియన్, జూనియర్ కాలేజీల్లో లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రరియన్, ప్రిన్సిపాల్, విద్యాలయాల్లో ప్రిన్సిపాల్ పోస్టులకు 2017, సెప్టెంబర్ 10న రాతపరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు. ఈ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 25,774 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, వారిలో రాతపరీక్షకు 13,903 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో వివిధ సబ్జెక్టులకు మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ నెంబర్లను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. గురుకుల డిగ్రీ, జూనియర్ లెక్చరర్‌తోపాటు ఇతర పోస్టులకు మెయిన్స్ రాతపరీక్షలు వచ్చేనెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

టీఎస్‌కేసీ కాంట్రాక్టు ఫుల్‌టైం మెంటర్ల వేతనాలు పెం ఇడి

మండలి చీఫ్‌విప్ పాతూరికి అధ్యాపకుల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో తెలంగాణ స్టేట్ నాలెడ్జ్ సెంటర్స్ (టీఎస్‌కేసీ)లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఫుల్‌టైం మెంటర్ల వేతనాలు పెంచాలని శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డికి పలువురు అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్ ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీల కాంట్రాక్టు ఫుల్‌టైం మెంటర్ల సంఘం జాయింట్ సెక్రెటరీ సీహెచ్ కిషోర్‌కుమార్, నాయకులు జి రాజశేఖర్, టి శ్రవణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అయినా చాలీచాలని వేతనాలు ఇవ్వడం వల్ల కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. తమకు జీతాలు పెంచి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని పాతూరి సుధాకర్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు.

సెన్సెక్స్ ▲ 251	నిఫ్టీ ▲ 77	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
35,511	10,894	63.84	రూ. 30,844	రూ. 40,200





శుక్రవారం మార్కెట్లు ముగింపు సమయానికి

కోడిగుడ్లు

హైదరాబాద్	402	విజయవాడ	412
ఒక్కగుడ్డుకు	4.60	చెన్నై	410
వరంగల్	404	ముంబయి	447



ఐవోబీ అధ్వర్యంలో 'నేమ్ అండ్ షేమ్' క్యాంపెన్

రుణాల రికవరీ కోసం ప్లకార్డుల ప్రదర్శన

నవతెలంగాణ, బిజినెస్ డెస్క్: రుణాల రికవరీ కోసం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐవోబీ) 'నేమ్ అండ్ షేమ్ క్యాంపెన్‌ను ప్రారంభించింది. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను నిర్ణీత సమయంలోగా చెల్లించని రుణ గ్రహీతల నుంచి బకాయిలను వసూల్ చేసేందుకు ఐవోబీ ఈ సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్యాంపెన్‌కు ఐవోబీ ఏఆర్ఎం బ్రాంచీ ఏజీఎం అజయ్ టెంబేకర్ నేతృత్వం వహించారు. ఇందులో భాగంగా ఆయన పలువురు అధికారులు, ఉద్యోగులతో కలిసి సికింద్రాబాద్‌లోని సైనిక్‌పురి 3వ ఎవెన్యూలో నివాసముంటున్న బ్యాంకు రుణ బాకాయిదారులైన ఎస్.రజిని, ఎం.రామ్‌ప్రసాద్ ఇండ్ల ఎదుట ప్లకార్డులను ప్రదర్శించి.. రూ.1.20 కోట్ల బకాయిలను చెల్లించాలని నినాదాలు చేశారు.

మారుతీ సుజుకీ నుంచి నాలుగు కొత్త కార్లు..

పూణే: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ఏడాదిన్నరలో నాలుగు కొత్త ప్రొడక్టులను ప్రవేశపెట్టే యోచనలో ఉంది. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని రెండంకెల అమ్మకాల వద్ధితో ముగించాలని భావిస్తోంది. ఈ కొత్త ప్రొడక్టులతో తమ విక్రయాలను మరింతగా పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరి 9-14 తేదీల్లో జరిగే ఆటో ఎక్స్‌పోలో మారుతి తన స్విఫ్ట్ ఆల్ న్యూ వెర్షన్‌ను ఆవిష్కరించనుంది. న్యూ స్విఫ్ట్‌తో పాటు సెడాన్, సియాజ్, ఎర్టిగాల న్యూ రిఫ్రెష్డ్ వెర్షన్స్‌ను రానున్న కొద్ది నెలల్లోనే మార్కెట్‌లో ప్రవేశపెట్టాలని మారుతి ప్రణాళికలు రచిస్తోంది. ఇక వాగన్-ఆర్ ఆల్ న్యూ వెర్షన్‌ను కూడా తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకు కొంత సమయం పడుతుందని మారుతీ వర్గాలు పేర్కొన్నాయి.

నేటి నుంచి డబ్ల్యూఈఎఫ్ షురూ..

23 నుంచి చర్చలు

- ఐదురోజులపాటు సమావేశాలకు దావోస్ ముస్తాబు
- 130 దేశాలు..మూడువేల మంది ప్రతినిధులు రాక



న్యూఢిల్లీ : స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా సోమవారం నుంచి ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్)ప్రారంభం కానున్నది. భారత ప్రధాని నరేంద్రమోడీ,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రప్‌తో సహ ప్రపంచ వ్యాప్తంగా 130 దేశాలనుంచి మూడువేల మంది ప్రతినిధులు భాగస్వామ్యం కానున్నారు.

ఐదురోజులపాటు సమ్మిట్

డబ్ల్యూఈఎఫ్ సమ్మిట్ ఐదురోజులపాటు జరగ నున్నది.స్విట్జర్లాండ్‌లోని స్కిఈంగ్ రిసార్ట్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అధికారిక కార్యక్రమాలు మాత్రం మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయని నిర్వాహకులు తెలిపారు. డబ్ల్యూఈఎఫ్ చైర్మెన్ క్లాస్ స్వాబ్ మాట్లాడుతూ.. సోమవారం సాయంత్రం సమ్మిట్ ప్రారంభ మవుతుందని తెలిపారు.మొదటగా భారత్ స్వాగత ఆతిథ్యం ఇవ్వనున్నది.ఇందులో బారతీయ వంటలు వడ్డించనున్నారు. ప్రాచీన యోగా, న్యూఇండియాగా రాణిస్తున్న తీరును ప్రదర్శనరూపంలో వివరించనున్నారు. భారత ప్రధాని మోడీ తొలిసారి ప్రారంభ ఉపన్యాసమిస్తారని చైర్మెన్ వెల్లడించారు.

సదస్సులో పాల్గొనటానికి మోడీతో పాటు కేంద్రమంత్రుల బృందం ఆదివారం దావోస్‌కు పయనమైంది.1997లో అప్పటి ప్రధాని హెచ్.డి దేవేగౌడ దావోస్‌లో జరిగిన సమ్మిట్‌లో పాల్గొన్నారు. 20ఏండ్ల వ్యవధిలో భారత్ తరఫున ప్రధాని హెూదాలో మోడీ హాజరవుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.ప్రపంచ వ్యాప్తంగా పేరున్న సీఈఓలతో మోడీ భేటీ అవుతారని ఆయన చెప్పారు. ఈ ఫోరంలో షారుక్ ఖాన్,ఆస్ట్రేలియా నటి కేట్‌బ్లేచెట్, లెజెండ్రీ బ్రిటిష్ సింగర్ ఎల్టన్ జాన్‌లను సన్మానించనున్నారు.

కాగా డబ్ల్యూఈఎఫ్ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరవుతున్నారు. సమ్మిట్ ముగింపురోజున తన ఉపన్యాసాన్ని ఇవ్వనున్నారు. కాగా ప్రపంచదేశాలు అనుసరిస్తున్న సంస్కరణలకు వ్యతిరేకంగా నిరసన సెగలు తాకే సూచనలున్నాయని ప్రజాసంఘాలు అంటున్నాయి.

ఎఫ్అండ్‌వో ముగింపు, ఫలితాలు కీలకమే..

నవతెలంగాణ, బిజినెస్ డెస్క్: దిగ్గజ కంపెనీల తృతీయ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, జనవరి డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వీటితో పాటు స్వదేశీ, విదేశీ పెట్టుబడుల సరళి, ప్రపంచ మార్కెట్ల పోకడ, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల గమనం, డాలరుతో రూపాయి మారకం వంటి తదితర అంశాలు సైతం స్టాక్ సూచీలను ప్రభావితం చేస్తాయని వారంటున్నారు. గత వారం స్టాక్ మార్కెట్లు సరికొత్త రికార్డులను నమోదు చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐటీసీ కంపెనీలతో పాటు తదితర కంపెనీల త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండడం, ప్రభుత్వం 29 వస్తువులు, 54 సేవలపై జీఎస్టీ రేట్లను కుదించడంతో కొనుగోళ్ల జోరు పెరిగింది. దీనికితోడు అంతర్జాతీయ సానుకూల పరిస్థితుల ప్రభావం కూడా వారాంతంలో మార్కెట్లను పరుగులు పెట్టించాయి. దీంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 35,542 వద్ద గరిష్టాన్ని తాకగా..నిఫ్టీ మార్కెట్ చరిత్రలో తొలిసారి 10,900 మార్క్‌ను అధిగమించింది. ట్రేడింగ్ ముగిసేసరికి



సెన్సెక్స్ 251 పాయింట్లు లాభపడి 35,511కు చేరింది. నిఫ్టీ 78 పాయింట్లు ఎగసి 10,895 వద్ద స్థిరపడింది. ఇక వారం పరంగా చూస్తే వరుసగా ఏడో వారమూ దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో నమోదయ్యాయి. సెన్సెక్స్ 919 పాయింట్లు, నిఫ్టీ 213 పాయింట్లు చొప్పున పెరిగాయి. దీంతో ఈ వారం స్టాక్ మార్కెట్ పయనం ఏలా సాగుతుందో వేచి చూడాలి..

కార్పొరేట్ ఫలితాలు..

ఈ వారంలో మరికొన్ని దేశీయ కార్పొరేట్ కంపెనీలకు చెందిన డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసిక ఫలితాలు రానున్నాయి. వీటిలో ఏషియన్ పేయింట్స్, యాక్సిస్ బ్యాంకు సోమవారం (22న) తమ పనితీరును వెల్లడించనున్నాయి. అదేవిధంగా మంగళవారం (23న) ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ ఫలితాలను విడుదల చేయనుంది. ఇదే వరుసలో గురువారం(25న) దిగ్గజ కంపెనీలైన డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, మారుతీ సుజుకీ ఇండియా తమ త్రైమాసిక ఫలితాలు వెలువరించనున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఇటువైపు దృష్టిసారిస్తారని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

బడ్జెట్ కౌంట్‌డౌన్..

కేంద్ర బడ్జెట్‌కు సమయం దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ బడ్జెట్ సమావేశాలపై ఇన్వెస్టర్లు దృష్టిసారించనున్నారు. కాగా ఈసారి బడ్జెట్‌పై పరిశ్రమ వర్గాలతో పాటు ఇతర వర్గాలు కూడా భారీ ఆశలే పెట్టుకున్నాయి. ఈ నెల 29న పార్లమెంటు బడ్జెట్ సెషన్ ప్రారంభం కానుంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. దీనికిముందు అంటే ఈనెల 29న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అలాగే ఇదే రోజు ఆర్థిక సర్వే వివరాలు పరిశీలనలోకి రానున్నాయి.

డెరివేటివ్స్ కీలకమే

జనవరి నెల ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్ల (ఎఫ్అండ్‌వో) గడువు గురువారం (25న)తో ముగియనుంది. దీంతో ఈ వారం మార్కెట్లలో అనిశ్చిత పరిస్థితులు నెలకొంటాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎఫ్అండ్‌వో ముగింపు సందర్భంగా ట్రేడర్లు తమ పొజిషన్లను జనవరి నుంచి ఫిబ్రవరి సిరీస్‌కు రోల్‌వర్ చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశమున్నట్టుగా మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

లిస్టింగ్‌కు అంబర్..న్యూజెన్ సాఫ్ట్‌వేర్..

ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ అంబర్ ఎంటర్‌ప్రైజెస్, ఢిల్లీ కేంద్రంగా ఐటీ సేవలందించే న్యూజెన్ స్టాఫ్‌వేర్ టెక్నాలజీస్ ఈ వారం స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్ట్ కానున్నాయి అంబర్ ఎంటర్‌ప్రైజెస్ పబ్లిక్ ఇష్యూ(ఐపీవో) ఈ నెల బుధవారం (17న) ప్రారంభమై, శుక్రవారం (19న) ముగిసింది. ఈ ఐపీవోకి మార్కెట్ వర్గాల నుంచి అనుహ్య స్పందన లభించగా.. 165.42 రెట్ల స్పందన వచ్చింది. ఈ ఇష్యూకి ధరల శ్రేణి రూ.855-859గా కంపెనీ నిర్ణయించగా..తద్వారా రూ.600 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. మరోవైపు న్యూజెన్ ఐపీవో ఈ నెల గురువారం (18న) ముగిసింది. ఈ ఐపీవోకి 8.25 రెట్ల స్పందన లభించింది. ఈ ఐపీవోకు ధరల శ్రేణి రూ.240-245కాగా..తద్వారా రూ.424 కోట్లను సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

హెచ్‌పీసీఎల్‌లో వాటా ఓఎన్‌జీసీ చేతికి..

హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్)లో ప్రభుత్వానికి సంబంధించిన మొత్తం 51.11శాతం వాటాను ఓన్ఎన్‌జీసీ రూ.37,000 కోట్లకు కొనుగోలు చేయనుంది.

ఈ షేర్లను పూర్తి నగదు రూపంలో కొనుగోలు చేయడంతో పాటు ఈ డీల్‌ను నెలాఖరుకు పూర్తి చేయనున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. ఈ నేపథ్యంలో సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఈ షేర్ల కౌంటర్లు వెలుగులోకి రానున్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

భారీగా విదేశీ పెట్టుబడులు!

భారత క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) ఈ నెలలో ఇప్పటి వరకు రూ.8700 కోట్ల పెట్టుబడులు పెట్టారు. కంపెనీల మెరుగైన ఆర్థిక ఫలితాలు, ఈల్డ్స్ ఆకర్షణీయంగా ఉండడమే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. డిపాజిటరీల గణాంకాల ప్రకారం ఈ నెల 1-19 మధ్యన విదేశీ ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లో రూ.5,769 కోట్లు, డెట్ మార్కెట్లో రూ.2,940 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశారు. మున్ముందు విదేశీ పెట్టుబడులు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

పవన్‌ను కలిసిన పోలెండ్ అంబాసిడర్

- పోలెండ్‌లో సినిమా షూటింగ్‌లకు సహకరించాలని విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ చాలా బ్రిలియంట్ అని పోలెండ్ అంబాసిడర్ ఆడమ్ బురాకోవస్కీ ప్రశంసించారు. భారతీయ జీవన శైలి, విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి వచ్చిన పోలెండ్ విద్యార్థులు, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో కలిసి ఆయన పవన్‌ను కలిశారు. ఆదివారం జనసేన రాష్ట్ర కార్యాలయంలో పోలెండ్, హైదరాబాద్ విద్యార్థులతో పవన్, ఆడమ్‌లు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పోలెండ్‌లో భారతీయ సినిమా చిత్రీకరణకు సహకరించాలని కోరారు. పోలెండ్‌లో ఎన్నో అందమైన ప్రదేశాలు ఉన్నాయని, అవి భారతీయ సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా ఉంటాయని బురాకోవస్కీ తెలిపారు. భారతదేశ సంస్కృతి, విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి వచ్చి విద్యార్థులను పవన్ అభినందించారు. ప్రతి ఒక్కరు ఇతర దేశాల చెందిన సంస్కృతి, సాంప్రదాయాలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఆయా దేశాల మధ్య దేశాల మధ్య అనుమానాలు తొలగిపోయి స్నేహ సంబంధాలు ఏర్పడతాయని ఆకాంక్షించారు. పోలెండ్‌తో భారతదేశానికి చాలా అనుబంధం ఉందన్నారు. పోలెండ్‌లో తెలుగు చిత్రాల చిత్రీకరణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

నేడు కొండగట్టుకు పవన్

జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ సోమవారం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని అక్కడి నుంచే తన తొలి కార్యాచరణ ప్రణాళికను ప్రకటించనున్నారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం మూడు గంటలకు కొండగట్టు చేరుకుంటారు. అక్కడ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజల అనంతరం ఆయన యాత్ర షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. సాయంత్రం కరీంనగర్‌లో జనసేన పార్టీ ముఖ్య నేతలతో భేటీ అవుతారు. 23న జగిత్యాల రోడ్‌లోని శుభం గార్డెన్స్‌లో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల కార్యకర్తలు, నాయకులతో సమావేశం అవుతారు. అక్కడి నుంచి కొత్తగూడెం బయలుదేరి వెళతారు. రాత్రి కొత్తగూడెంలోనే బస చేసి, 24న కొత్తగూడెం నుంచి రోడ్‌షో నిర్వహిస్తారు. మధ్యాహ్నం1.30 గంటలకు ఖమ్మం చేరుకుని, ఎంబి గార్డెన్‌లో జరిగే ఉమ్మడి, వరంగల్, నల్గొండ జిల్లాల కార్యకర్తలతో సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్‌కు చేరుకుంటారు.

ప్రజా సమస్యల అధ్యయనం కోసమే యాత్ర : పవన్



ప్రజా సమస్యల అధ్యనం కోసమే యాత్ర చేపడుతున్నట్లు జనసేన అధినేత పవన్ కల్యాన్ తెలిపారు. ఆదివారం ఉదయం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో సతిమణి అన్నాతో కలిసి ఆయన ప్రార్ధనలు చేశారు. తదనంతరం పవన్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శనం చేసుకుని యాత్రను ప్రారంభించనున్నట్లు చెప్పారు. 2009 ఎన్నికల ప్రచారం సందర్భంగా కొండగట్టు వద్ద జరిగిన పెను ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డానని...పైగా తమ కుటుంబ ఇలవేల్పు ఆంజనేయస్వామి కావడంతో యాత్రను కొండగట్టు నుంచి ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్టు ఆయన తెలిపారు.

ఫిబ్రవరి 4 నుంచి

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు

- రెడ్‌షర్ట్ వాలంటీర్లతో కవాత్
- మహాసభల పోస్టరావిష్కరణలో జూలకంటి

నవతెలంగాణ-క్లాక్‌టవర్

ఫిబ్రవరి 4న సీపీఐ(ఎం) ద్వితీయ రాష్ట్ర మహాసభలు ప్రారంభం కానున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఫిబ్రవరి 4న నల్లగొండలోని సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయం నుంచి రెడ్‌షర్ట్ వాలంటీర్లతో లక్ష్మిగార్డెన్ వరకు కవాత్ నిర్వహిస్తామన్నారు. మహాసభకు 31 జిల్లాల నుంచి ప్రతినిధులతో పాటు అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మల్లు స్వరాజ్యం తదితర నాయకులు హాజరవుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర దశ, దిశ నిర్దేశించే ప్రత్యేక రాజకీయ పరిస్థితుల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహాసభల్లో రాష్ట్ర ప్రజలు, రైతులు, కూలీలు, విద్యార్థులు ఎదుర్కుంటున్న సమస్యలపై




పోస్టర్ ఆవిష్కరిస్తున్న జూలకంటి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బీకార్ మల్లేషం, పెన్నా అనంతరామశర్మ, సయ్యద్ హాషం, ఎమ్‌డీ సలీమ్, సత్తయ్య, తదితరులు

చర్చించనున్నట్టు తెలిపారు. మూడున్నరేండ్లలో 4వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ముఖ్యమైన వాగ్దానాలైన నీళ్లు, నిధులు, నియామకం, డబుల్ బెడ్రూం ఇండ్లు, మూడెకరాల భూమి తదితర వాటిని విస్మరించిందన్నారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా ఇప్పటికే కార్యకర్తలు, నాయకులు వాల్‌రైటింగ్స్, గ్రామగ్రామాన కళాబృందాలు ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 4న జరిగే ప్రారంభసభకు కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల విజయవంతం కోసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు అనంతరామశర్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డబ్బీకార్ మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య, సయ్యద్‌హాషం, పట్టణ కార్యదర్శి ఎమ్‌డీ.సలీం పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా...

గవర్నర్ పదవి వద్దు : కేంద్రమాజీ మంత్రి బండారు దత్తాత్రేయ



నవతెలంగాణ - హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని మాజీ కేంద్రమంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ సభ్యుడు బండారు దత్తాత్రేయ స్పష్టం చేశారు. తాను ప్రజలతోనే ఉంటానని, గవర్నర్ పదవి అవసరం లేదని చెప్పారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గవర్నర్‌గా వెళ్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని విలేకరులు ప్రస్తావించగా..ఆయన పై విధంగా స్పందించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ-టీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని చెప్పారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తోందని, కొన్ని అంశాల్లో ఆ సహాయాన్ని అందిపుచ్చుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించట్లేదని అన్నారు. విలేకరుల సమావేశం ముగియక ముందే బీజేపీలో దత్తాత్రేయ తిరిగి పోటీ చేస్తాననే అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంపై బీజేపీ శాసనసభాపక్షనేత జి కిషన్‌రెడ్డి, రాష్ట్రఅధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్‌తో పాటు పలువురు నేతలు ఆశలు పెట్టుకున్నారు. 2014 ఎన్నికల్లోనే ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు అప్పటి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రస్తుత శాసనసభాపక్షనేత జి కిషన్‌రెడ్డి ఆసక్తి చూపారు. దీంతో దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి మధ్య మనస్పర్ధలు బాహటంగా వెలుగులోకి వచ్చాయి. చివరకు ఆర్ఎస్ఎస్ నేతలు జోక్యం చేసుకొని కిషన్‌రెడ్డి పోటీనుంచి పక్కకు తప్పుకునేలా చేశారు. కిషన్‌రెడ్డి పార్టీ అధ్యక్షుడిగా ఉన్నా.. ఎన్నికల ప్రచారంలో ఆయన ఫొటోను కూడా ఉపయోగించుకోవలేదు. అయితే ఆ ఎన్నికల సమయంలోనే దత్తాత్రేయకు ఇవే చివరి ఎన్నికలని పార్టీలో ప్రచారం జరిగింది. అందుకే సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంపై ముఖ్య నాయకులు దృష్టి సారించారు. కానీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానంటూ దత్తాత్రేయ ప్రకటించడంతో వారి ఆశలకు గండిపడింది. అయితే.. ఆయన చెప్పినంత మాత్రాన.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి జాతీయ నాయకత్వం టికెట్ ఇస్తుందా... అని పార్టీ ముఖ్యనేత ఒకరు అనుమానం వ్యక్తం చేశారు.

మేడారంలో విద్యుత్ వెలుగులు

- రూ.1.2 కోట్లతో కొత్తగా సబ్‌స్టేషన్
- రూ.3.5 కోట్లతో పనులు
- విద్యుత్తు అంతరాయాలకు ఇక ఫుల్‌స్టాప్
- 4,200 స్పెన్సర్ల ఏర్పాటు

నవతెలంగాణ-వరంగల్

మేడారం జాతరలో భక్తుల సౌకర్యార్థం గద్దెల పక్కనే కోటీ రెండు లక్షల రూపాయల అంచనా వ్యయంతో 132/33 కెవి సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేశారు. ఈ జాతర సందర్భంగా మొత్తం 3కోట్ల 5లక్షల రూపాయలతో విద్యుత్ పనులను చేపట్టారు. ఇప్పటికే కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయ్యింది. జాతరలో విద్యుత్తు అంతరాయాలు లేకుండా ఇటు ములుగు వైపు నుంచి అటు కమలాపూర్ తాడ్వాయి వైపు నుంచి రెండు లైన్లను ఏర్పాటు చేశారు. ములుగు 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి గతంలో విద్యుత్‌ను సరఫరా చేసేది. ఇప్పుడు ఇటువైపు నుంచి గాక కమలాపూర్ నుంచి తాడ్వాయి మీదుగా మేడారంకు మరో లైన్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను 17.5 కిలోమీటర్ల 33 కేవీ లైన్ పనులను కూడా పూర్తి చేశారు. లైన్‌ను కొత్తగా వేశారు. రెండు, మూడ్రోజుల్లో ఈ పనులు పూర్తి చేసి విద్యుత్తును అందించనున్నారు.

గద్దెల వద్ద నిరంతరాయంగా విద్యుత్తు

పాత సబ్‌స్టేషన్, కొత్త సబ్‌స్టేషన్‌లకు కూడా లింకును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు మూడు కిలోమీటర్ల మేరకు లైనింగ్ చేస్తున్నారు. ఒకవైపు విద్యుత్తు అంతరాయం జరిగితే మరోవైపు నుండి విద్యుత్తును గద్దెల



వద్దకు ఇచ్చేలా ఈ ఏర్పాటును చేస్తున్నారు. గతంలో జాతర పరిసరాల్లో 3 వేల పాత స్తంభాలుండగా, ఈ జాతరకు అదనంగా మరో 2 వేల స్తంభాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా జాతర పరిసర ప్రాంతాల్లో 5 వేల స్తంభాలకు విద్యుత్తు వైరింగ్‌ను పూర్తి చేశారు. స్తంభాలపై విద్యుత్తు వైర్లు ఒకదానికొకటి తగులకుండా నిరోధించడానికి 4,200 స్పెన్సర్లను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్తు వైర్లు ఒకదానికొకటి తగిలితే విద్యుత్తు అంతరాయం జరుగుతుంది. వీటిని అరికట్టడానికి ట్రాన్స్‌కో అధికారులు ఈ ఏర్పాటు చేస్తున్నారు.

అదనంగా 154 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు

గతంలో జాతరలో 120 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు వినియోగించగా, ఈ జాతరలో వాటికి అదనంగా 154 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఆర్టీసీ అలైటింగ్ స్పాట్‌లో లోఓల్టేజీతో సమస్యలు ఎదుర్కొన్నట్టు ఆర్టీసీ అధికారులు ట్రాన్స్‌కో అధికారులకు తెలియచేయడంతో అదనంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ, దేవాదాయ శాఖ, ట్రాన్స్‌కో సమన్వయంతో పనిచేస్తున్నాయి. పోలీసు శాఖ సూచించిన ఐదు పార్కింగ్ ప్రాంతాల్లోనూ విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. జాతరలో ట్రాన్స్‌కోకు సంబంధించి 350 మంది అధికారులు, సిబ్బంది విధులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 120 మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు.

దుకాణదారులకు రూ.2,750తో విద్యుత్తు

జాతరలోని వ్యాపారులకు కరెంటు వినియోగాన్ని బట్టి 20 రోజులకుగాను విద్యుత్ బిల్లును ముందే వసూలు చేసి రశీదు ఇస్తున్నారు. సగటున రూ.2,750 వసూలు చేసి రశీదులు అందచేస్తున్నారు. గతంలో విద్యుత్ బిల్లులకు సంబంధించి దేవాదాయ శాఖ, ట్రాన్స్‌కో మధ్య అనేక ఏండ్లపాటు వివాదాలు నెలకొన్న నేపథ్యంలో ఈసారి జాతరలో వ్యాపారుల నుంచి ముందే విద్యుత్ బిల్లులను అంచనా వేసి వసూలు చేస్తున్నారు. ఇందుకుగానూ 15 రోజులుగా ట్రాన్స్‌కో సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేస్తున్నారు.



స్వేచ్ఛ కోసమే పూనా దళితుల పిడికిళ్లు

సిహెచ్.మధు

తరతరాల అగ్రకుల ఆధిపత్య సమాజం 200 ఏండ్ల క్రితపు దళిత సైన్యం విజయాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. విజయ్‌ఘాట్ నిర్మాణాన్ని ప్రశ్నిస్తున్నది. ఎంత అన్యాయం. దేవాలయాలకు రానివ్వలేదు. అగ్ర కులాల బావులలో నీళ్లు తోడనివ్వలేదు. వాళ్లను అంటరానివారిగా చూశారు. ఊరికి దూరంగా ఉంచారు. శతవిధాలుగా వారిని దూరంగా ఉంచారు. ఎన్నో అవమానాలపాలు చేశారు. తరతరాల అవమానాలకు ప్రతిగా వీరత్వం నేర్చుకుంటున్న వారు సహజంగా ప్రతీకార జ్వాలలో రగిలిపోతున్నారు. పైగా శ్రామిక సంస్కృతి కలిగిన వారు 200 ఏండ్ల క్రితం పేష్వాలపై ప్రతీకారంలో విజయం సాధించారు. చరిత్రను కాదనటమేమిటీ? ఆంగ్లేయుల విజయానికి దళిత సైనికులు యుద్ధం చేశారని మనువాదుల వాదన. 200 ఏండ్ల క్రితం స్వాతంత్ర్య పోరాటం ప్రారంభం కాలేదు. స్వాతంత్ర్య కాంక్ష రగలలేదు. దళితులు తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్న రోజులవి. ఇప్పటికీ మారలేదు. అప్పుడు దళితులకు తమను అంటరానివారుగా చూస్తున్న వారిని ఓడించేందుకు ఒక అవకాశంగా భావించారు. అయినా చరిత్రను ఎందుకు వక్రీకరిస్తారు?

పూనా, మహారాష్ట్రలో ఆకాశమెత్తు లేచిన పిడికిళ్లు ఒక్క కోరేగావ్ సంఘటనకు సంబంధించి మాత్రమే కాదు. దేశంలో పెరిగిపోతున్న నియంతృత్వ భావజాలానికి వ్యతిరేకంగా పిడికిళ్లు లేచాయి. స్వేచ్ఛ కోసం లేచిన మహారాష్ట్ర పిడికిళ్లు అవి. భారతదేశంలోని సామాన్యజనం పిడికిళ్లు. స్వేచ్ఛ కోసం ఆకాశమెత్తు లేచిన పిడికిళ్లు. రాజ్యాంగం ప్రజాస్వామ్య హక్కుల కోసం లేచిన పిడికిళ్లు అవి. భారతదేశ విముక్తి కోసం లేచిన పిడికిళ్లు అవి. ప్రధాని నరేంద్రమోడీ పాలనకు వ్యతిరేకంగా లేచిన పిడికిళ్లు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా లేచిన పిడికిళ్లు. మనుధర్మానికి, హిందూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా లేచిన పిడికిళ్లు. తరతరాల అంటరానితనానికి, అణగారిన వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా లేచిన పిడికిళ్లు అవి. అయినా ఒక ప్రశ్న లేవదీస్తాను. విజయ్ దివస్ 200 సంవత్సరాల సందర్భంగా కోరేగావ్ విజయ్‌ఘాట్‌ను సందర్శించే హక్కు, స్వేచ్ఛ ప్రజలకు లేదా? అంబేద్కర్ విరచిత రాజ్యాంగం ప్రసాదించిన స్వాతంత్ర్యం ఇది. ఈ స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని అడ్డుకునే హక్కు సరైనదేనా? ఎవరి అభిప్రాయాలు వారివి. ఆ స్వేచ్ఛను అడ్డుకునే హక్కు మనువాదులకెక్కడిది? కోరేగావ్, మహారాష్ట్రలో ధిక్కరణ స్వరాలు వినిపించిన గొంతులు ఇప్పుడు చల్లారినా, నిశ్శబ్దం వహించినా నిప్పురవ్వలు ఆరినట్టు కాదు. రాబోయే పోరాటానికి రిహార్సల్‌గా భావించాల్సిందే. ప్రధానిగా మోడీ వచ్చిన తర్వాత తమపై హింస పెరిగిందనీ, తమ బతుకులు బలయ్యే ప్రమాదం కనిపిస్తున్నదనీ వాళ్లలో భయం పెరిగింది. వాళ్ల భయానికి కారణాలున్నాయి. దళితుల మీద దాడులు, గౌరీ లంకేశ్, దబోల్కర్, కల్బుర్గీల హత్యలు, దేశంలో జరుగుతున్న దాడులు వాళ్లను భయపెట్టిస్తున్నాయి. మనువాదులే కారణమని వారికి తెలుసు. నిజానికి కోరేగావ్ సంఘటన జరిగి 200 ఏండ్లు కావచ్చు. విజయ స్తూపం సందర్శన ద్విశత సంవత్సరాల సందర్భంగా వేల సంఖ్యలో ప్రజలు రావచ్చు. విజయ స్తూపం సందర్శనకు వేలాది జనం రావడానికి ద్విశత విజయోత్సవాలు కారణమైనా వాళ్ల మనసులలో మనువాదులు జరుపుతున్న దాడులపై వ్యతిరేకత కూడా ఉంది. శత్రువు తమను వెంటాడుతున్నాడని భావిస్తున్నప్పుడు ధైర్యం కోసం, పోరాటం కోసం, ధిక్కరణ కోసం, గత కాలపు పోరాటాలను, యుద్ధాలను, ధిక్కరణ గొంతులను, అందుకు సంబంధించిన కలాలను, గళాలను చారిత్రక ప్రదేశాలను స్ఫూర్తిగా తీసుకుంటారు. ఇది సహజం. మనం విప్లవ దారిలో గోర్కి 'అమ్మ' నవలను తీసుకుంటాం. అమ్మ లాగా తామూ ఉండాలని కొందరు తల్లులు భావించినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ఉక్కుపాదం నుంచి ఏడు తరాల నుంచి స్ఫూర్తి పొందుతాం. మనకు ప్రజల చైతన్యం మీద, వ్యవస్థ మార్పు మీద అవిశ్వాసం కలిగినప్పుడు మార్క్సిజం చదువుతాం. దళితుల మీద దాడులు జరిగి మనో నిబ్బరం చెదురుతున్నప్పుడు అంబేద్కర్ రచనలు చదువుతాం. సమీకరించు, పోరాడు నేర్చుకుంటాం. మనకు ఈ దోపిడీ విశృంఖలత్వం కండ్ల ముందు నిలిచి సమసమాజ ఆశయం పురికొల్పి ఏకాకిగా మనకు మనం కనిపించినప్పుడు శ్రీశ్రీ మహా ప్రస్థానం చదువుతాం. ఇవి సామాజిక స్ఫూర్తి విషయాలు. ఇవి కొందరికి ఒకే కోణంగా కనిపించవచ్చు. చీకటిగా అనిపించినప్పుడు దీపం వెలుగుగా భగత్‌సింగ్‌నో, అల్లూరినో మనసులో నింపుకుంటాం. విజయ్‌ఘాట్‌ను 200 సంవత్సరాల సందర్భంగా వేలాదిమంది సందర్శనకు ఇప్పుడున్న భయంకర పరిస్థితులూ కారణమే. దళితులపై దాడులు జరుగుతున్నాయి. ఆవును అడ్డం పెట్టుకొని హిందూ రాజ్యం కోసం హింసోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నారు. ప్రశ్నిస్తున్నవారిని చంపేస్తున్న సాంప్రదాయం హింసా సంస్కృతి మోడీ కాలంలో బాగా పెరిగింది. మోడీ రాజ్యం ప్రజాస్వామ్యం కాదు.



భారతదేశాన్ని హిందూ రాజ్యం చేయటానికి వచ్చిన అవకాశంగా వారు భావిస్తున్నారు. ప్రజలు విశ్వాసంతో వేసిన ఓటును పక్కదారి పట్టించి రాజ్యాంగ విలువల ధ్వంసానికి వాడుకోవటం ఎంత వరకు దేశానికి హితం కల్గిస్తుందో వారే అంచనా వేసుకోవాలి. గౌరీ లంకేశ్‌ను ఎందుకు చంపారు? కల్బుర్గి, దబోల్కర్ ఏమన్నారు? గోవులు తింటున్నారనీ, అమ్ముతున్నారనీ దాడి చేసే హక్కు వారికెక్కడిది? ఎవరి విశ్వాసాలు వారివి. ఎవరి సంస్కృతి వారిది. ఎన్నో కులాలు, ఎన్నో మతాలు కలిగి కలగలిసి ఉన్న భారతదేశంలో అన్ని సంస్కృతులు కలిసిమెలిసి సోదరభావంతో ఉండాల్సిన అవసరముంది. కుల, మతాల మధ్య దూరం నశించాలి. వైరుధ్యాలుండకూడదు. ఆ అవసరం ఈ మాతృ సంస్కృతికుంది. ఈ నేలకుంది. ఈ నేల అహింస నేల, అహింస నేలలో హింసా దారిని రెచ్చగొట్టడం ఎంత వరకు సమంజసం? ఈ ప్రశ్న ఎవరి గురించి గౌరీ లంకేశ్‌ను హత్య చేసిన వారి గురించి. దళితులపై దాడులు చేస్తున్న వారి గురించి. నాకొక విషయం అర్థం కాలేదు. 200 సంవత్సరాల క్రితం జరిగిన యుద్ధంలో దళితులు తమ విజయంగా భావించి విజయ్‌ఘాట్ నిర్మించుకున్నారు. 200 ఏండ్లుగా విజయ్‌ఘాట్‌ను ప్రతి సంవత్సరం సందర్శించుకోవటం దళితుల సాంప్రదాయం. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కూడా విజయ్‌ఘాట్‌ను సందర్శించారు. ఆ విజయ్‌గాట్‌ను సందర్శించకూడదని, ఆంగ్లేయుల విజయానికి దళిత సైనికులు సహకరించారని మనువాదులు అడ్డం పడటం ఎంత వరకు న్యాయం? దళితుల స్వేచ్ఛమీద దాడి చేయటానికి అడ్డం పడటానికి వీరికున్న హక్కు ఏమిటి?

తరతరాల అగ్రకుల ఆధిపత్య సమాజం 200 ఏండ్ల క్రితపు దళిత సైన్యం విజయాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. విజయ్‌ఘాట్ నిర్మాణాన్ని ప్రశ్నిస్తున్నది. ఎంత అన్యాయం. దేవాలయాలకు రానివ్వలేదు. అగ్ర కులాల బావులలో నీళ్లు తోడనివ్వలేదు. వాళ్లను అంటరానివారిగా చూశారు. ఊరికి దూరంగా ఉంచారు. శతవిధాలుగా వారిని దూరంగా ఉంచారు. ఎన్నో అవమానాలపాలు చేశారు. తరతరాల అవమానాలకు ప్రతిగా వీరత్వం నేర్చుకుంటున్న వారు సహజంగా ప్రతీకార జ్వాలలో రగిలిపోతున్నారు. పైగా శ్రామిక సంస్కృతి కలిగిన వారు 200 ఏండ్ల క్రితం పేష్వాలపై ప్రతీకారంలో విజయం సాధించారు. చరిత్రను కాదనటమేమిటీ? ఆంగ్లేయుల విజయానికి దళిత సైనికులు యుద్ధం చేశారని మనువాదుల వాదన. 200 ఏండ్ల క్రితం స్వాతంత్ర్య పోరాటం ప్రారంభం కాలేదు. స్వాతంత్ర్య కాంక్ష రగలలేదు. దళితులు తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్న రోజులవి. ఇప్పటికీ మారలేదు. అప్పుడు దళితులకు తమను అంటరానివారుగా చూస్తున్న వారిని ఓడించేందుకు ఒక అవకాశంగా భావించారు. అయినా చరిత్రను ఎందుకు వక్రీకరిస్తారు? చరిత్ర మారుతుందా? దళిత సైన్యం గురించి మనువాదులు మాట్లాడుతున్నారు. అప్పటి దేశంలోని జమీందారులు, దొరలు, భూస్వాములు, రాజులు అందరూ ఆంగ్లేయుల ముందు జీ హుజూర్ అన్నారు. వాళ్లను ప్రసన్నం చేసుకోవటానికి తమ దేశ ప్రజలను పీడించుకుతిన్నారు. వాళ్లకంటే ఈ దళిత సైన్యం నయం. తమ పరాభవానికి యుద్ధం ద్వారా ప్రతీకారం తీర్చుకున్నారు. 200 ఏండ్ల సందర్భంగా వచ్చిన వేలాది మంది విజయ్‌ఘాట్‌ను సందర్శించుకొని ఒక స్ఫూర్తితో వెళ్లిపోయేవారు. అంతా శాంతిగా జరిగేది. రెచ్చగొట్టింది ఎవరు? చనిపోయిన యువకుడెవరు? చంపింది ఎవరు? మహారాష్ట్ర పిడికిళ్లు భవిష్యత్తును చూపిస్తున్నాయి. భారతదేశంలో అగ్రకుల అహంకారాన్ని, మనువాదాన్ని సహించే స్థితిలో ప్రజలు లేరు. ప్రజల పిడికిళ్లు లేస్తున్నాయి. దేశం చల్లగా, శాంతిగా ఉండాలంటే స్వేచ్ఛ వర్ధిల్లాలి. ప్రజాస్వామ్య భావజాలం, లౌకికత్వం వర్ధిల్లాల్లి.

సెల్ : 9949486122

తొలి దళిత కవి కుసుమ ధర్మన్న

బోడ మహేశ్వరి



కుసుమ ధర్మన్న (క్రీ.శ.1900–1946) తొలి తెలుగు దళిత కవి, వ్యాసకర్త, వక్త. జయభేరి పత్రిక సంపాదకుడు. ఉద్యమకారుడు. వత్తి రీత్యా ఆయుర్వేద వైద్యుడు. సాహితీ కోవిదుడు. ఆంగ్ల–ఆంధ్ర భాషల్లో పండితుడు. "మాకొద్దీ నల్లదొరతనం" గేయ రచయితగా ప్రసిద్ధుడు.

కుసుమ ధర్మన్న 1900లో రాజమండ్రిలోని లక్ష్మివారపుపేటలో వ్యవసాయ కూలీలైన కుసుమ వీరాస్వామి, నాగమ్మ దంపతులకు జన్మించాడు. ఇతడు ఆది ఆంధ్ర జూనియర్ ఎలిమెంట్ స్కూలులో 5వ తరగతి వరకు చదివాడు. తరువాత థర్డ్ ఫారం చదివి ఆయుర్వేదంలో వైద్య విద్వాన్ పట్టా పొందాడు. ఇతడికి తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం ఉంది. చదువుకునే రోజుల్లోనే సంఘసంస్కరణ అభిలాష కలిగి కందుకూరి వీరేశలింగంచేత ప్రభావితుడయ్యాడు. ఇతడు తన జాతి హీనత్వంతో, అవమానంతో అమానుషంగా, అంటరాని తనం, సామాజిక వివక్షలతో, బాధపడుతున్న దళితులను (మాల, మాదిగ, ఇతర అణచబడ్డ కులాలను) ఇతర అణగారిన వర్గాలను సంఘ- సంస్కరించాలనే దక్పథంతో "హరిజన" శతకాన్ని రచించాడు. ఇతను హైదరాబాద్‌లో ఉన్న దళిత ఉద్యమకారులైన భాగ్యరెడ్డి వర్మ, బిఎస్.వెంకట్‌రావు, అరిగే రామస్వామి లాంటి నాయకులతో అనునిత్యం సంబంధాలు ఏర్పరుచుకుంటూ ఒక బలమైన రచయితగా ఎదిగాడు. ఈయన అంబేద్కర్ ద్వారా స్ఫూర్తి పొంది అంటరానితనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో తపించిన తొలి తరం కవి. ఇతడు గుడివాడ సేవాశ్రమం వ్యవస్థాపకుడు గూడూరి రామచంద్రరావు వద్ద, సీతానగరం ఆశ్రమం, చాగల్లు ఆనందాశ్రమాలలో కొంతకాలం ఉండి తన ఉద్యమస్ఫూర్తిని మెరుగుపర చుకున్నాడు.



"దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న కవీంద్రుడు" అనే పుస్తకంలో సి.వి. గారు కూడా ఈయన గురించిన సమాచారం తన వద్ద లేదని రాశాడు. 1921లో కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనం రాశారు. దళిత వర్గం నుంచి అతి కష్టం మీద చదువుకుని పైకొచ్చి, తిరిగి ఆ చదువును తన జాతి మేలు కోసం వెచ్చించిన అతికొద్ది మంది దళిత విద్యావంతుల్లో 'కుసుమ ధర్మన్న కవి' ఒకరు. దళితులు, బ్రిటిషు పాలనలో కంటే, స్థానిక అగ్రవర్ణాల పాలనలో మరింత నలిగిపోతారని మొట్టమొదటగా చాటింది కుసుమ ధర్మన్నే. కాంగ్రెస్‌లో ఉంటూనే 'మాకొద్దీ నల్లదొరతనం' అంటూ గళం విప్పిన ధైర్యశాలి.

ధర్మన్న అంబేద్కర్ ఆలోచనలతో ప్రభావితుడై అంబేద్కర్ గురించి ఆంధ్రదేశంలో విస్తతంగా ప్రచారం చేశాడు. ఆంధ్రదేశానికి అంబేద్కరును తొలిగా పరిచయం చేసింది ఈయనే. అణగారిన జాతులకు గొంతుకనిస్తూ, అంబేద్కర్ భావాలను ప్రచారం చేయటానికి జయభేరి అనే పక్ష పత్రికను స్థాపించాడు. 1930వ దశకంలో కాంగ్రెసు పార్టీ చొరవ తీసుకొని హరిజన సేవా సంఘం ఆంధ్ర విభాగాన్ని ప్రారంభించింది. మహాత్మాగాంధీ అంటరాని కులాల ప్రజలకు హరిజనులు అని పేరుపెట్టడంతో అది ప్రాచుర్యం పొందింది. క్రమేణా ఆది ఆంధ్ర నాయకులంతా కాంగ్రెసు స్థాపించిన హరిజన సేవా సంఘంలో భాగమైనా కుసుమ ధర్మన్న వంటి కట్టుబడిన నాయకులు మాత్రం దాన్ని వ్యతిరేకించారు. నిమ్నజాతుల అభివద్ధి విషయంలో మహాత్మాగాంధీ ఆశయాలను నమ్మి గౌరవించినా, ఆచరణలో లోపాలను ధర్మన్న సహించలేదు. ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా గాంధీజీ రాజమండ్రి వచ్చి హరిజన నాయకులతో సమావేశం నిర్వహించిన సందర్భంలో, ధర్మన్న ఆ సమావేశాన్ని బహిష్కరించాడు. 'హరిజన నాయకులైతే మా పేటలకు వచ్చి ఇక్కడ మాట్లాడాలని' కబురు పెట్టి గాంధీని, ఇతర కాంగ్రెస్ నాయకులను తమ పేటకు రప్పించి, ఆతిథ్యమిచ్చి దళితుల గౌరవాన్ని చాటాడు. దళిత చైతన్యం కోసం ధర్మన్న పడిన తపనను 1933లో రాసిన హరిజన శతకంలో చూడవచ్చు. "ఆత్మ గౌరవంబు నలరంగ చాటరా" అని ఉద్బోధించిన ధర్మన్న కవి వర్ణధర్మం పేరిట భారతీయ సమాజంలో నెలకొన్న హెచ్చు తగ్గులను నిరసించిన జాతీయ వాది. సమకాలికులు ఆయనను 'ఆది ఆంధ్ర కవి సార్వభౌమ'గా పేర్కొన్నారు. 1936లో విజయనగరంలో జరిగిన ఆది ఆంధ్ర మహాసభ సమావేశానికి కుసుమ ధర్మన్న అధ్యక్షత వహించాడు. ఈ సమావేశంలో అధ్యక్ష ప్రసంగం చేస్తూ "సామ్యవాదాన్ని సహించని హిందూమతం" అనే శీర్షికన ప్రసంగం వెలువరించాడు. ఈయన నిమ్నజాతి విముక్తి తరంగిణి, వాళ్ల అంటరానివాళ్లు, హరిజన చరిత్ర మొదలైన రచనలు చేశాడు.

సెల్ : 8639518341

ప్రొఫెసర్లపై 'కాషాయ'దాడి

ఓగోటి కిరణ్‌కుమార్

యూనివర్సిటీల్లోనూ ప్రొఫెసర్లపై దాడులు తీవ్రమవుతున్నాయి. వీటిని నివారించాల్సిన యూనివర్సిటీ పాలక మండలిలు నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నాయి. దీంతో మొన్న శాతవాహన యూనివర్సిటీలో ప్రొఫెసర్ సూరెపల్లి సుజాతపై, నేడు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ లక్ష్మినారాయణపై ఏబీవీపీకి చెందిన కొందరు విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో అసభ్యపదజాలంతో దూషించారు. ఈఘటనలపై యూనివర్సిటీ పాలకమండలికి ఫిర్యాదు చేసినా నేటికీ సరైన న్యాయం చేయలేదు. దీంతో సమస్య ఇంకా కొనసాగుతూనే ఉంది.

హెచ్‌సీయూలో దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ లక్ష్మినారాయణ అర్థశాస్త్రం విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. గత సంవత్సరం నవంబర్ 25న నిర్వహించిన ఎకనామిక్స్ పరీక్షలో విద్య కాషాయీకరణపై ఓ ప్రశ్న అడిగారు. విద్యా వ్యాపారీకరణ, కాషాయీకరణతో వస్తున్న మార్పులకు సంబంధించిన ఒక ప్రశ్న ఉంది. ఈ పరీక్షాపత్రంలో కాషాయీకరణ పేరును పేర్కొనడాన్ని సహించలేని ఏబీవీపీకి చెందిన, ఎకనామిక్స్‌తో ఎలాంటి సంబంధం లేని విద్యార్థి ప్రొఫెసర్‌ను నిందిస్తూ అసభ్యపదజాలంతో ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు. దీనిపై ప్రొఫెసర్ లక్ష్మినారాయణ అదే నెల 30వ తేదీన యూనివర్సిటీ పాలకమండలికి ఫిర్యాదు చేశారు. అంతకుముందే మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. అలాగే యూనివర్సిటీ ప్రొక్టోరల్ బోర్డుకు కూడా ఫిర్యాదు చేశారు. కానీ 15 రోజులు గడిచినా ఎలాంటి సమాధానం రాలేదు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 25న మళ్లీ యూనివర్సిటీ డీన్‌కు స్వయంగా వెళ్లి కలిశారు. యూనివర్సిటీ వీసీకి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. " ఈ అంశంపై ఈ నెల 18వ తేదీనే ప్రొక్టోరల్ బోర్డుకు పంపినట్టు" అదేరోజు మెయిల్ ద్వారా రిప్లై వచ్చింది. తిరిగి జనవరి 5న ప్రొక్టోరల్ బోర్డుకు లేఖ రాశారు. జనవరి 8న ప్రొక్టోరల్ బోర్డులో చర్చిస్తామని వారు కూడా మెయిల్ ద్వారా రిప్లై ఇచ్చారు. సదరు విద్యార్థికి షోకాజు నోటీసు పంపించామని కూడా తెలియజేశారు. మరోవైపు యూనివర్సిటీ ఆఫ్ టీచర్స్ అసోసియేషన్‌కు కూడా ప్రొఫెసర్ లక్ష్మినారాయణ ఫిర్యాదు చేశారు. జనవరి 8న జరిగిన సమావేశంలో ఈ నెల 17న మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించారు. ఆ మీటింగ్‌కు ప్రొఫెసర్ లక్ష్మినారాయణను కూడా హాజరు కావాలని తెలియజేశారు. 17న జరిగిన సమావేశంలో ఆ ఘటనపై ప్రొఫెసర్ లక్ష్మినారాయణ రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. అంతకుముందు షోకాజు నోటీసు అందుకున్న ఏబీవీపీ విద్యార్థి తమ సంఘం తరపున ప్రొక్టోరల్ బోర్డుకు ఓ లేఖ రాశారు. ఆ ప్రశ్నపత్రంలో అడిగిన ప్రశ్న సబ్జెక్టులో లేదని వారి వాదన. కానీ విద్య సరుకుగా మారినప్పుడు విద్యార్థుల్లో ఉండవలసిన విలువలు తగ్గిపోయి స్వలాభం పెరుగుతుంది. దీనిని నివారించాలి. ఇందులో భాగమే తాను అడిగిన ప్రశ్న అని ప్రొఫెసర్ వివరణ ఇచ్చారు. సుబ్రమణ్యం కమిటీలోనూ ఇలాంటి విలువలు నేర్పాలని తెలియజేశారని చెప్పారు. కానీ ఎకనామిక్స్‌తో సంబంధం లేని విద్యార్థికి ఇలాంటివి ఎలా తెలుస్తాయి. తెలియనప్పుడు ఉద్దేశపూర్వకంగా తనపై అనభ్యవదజాలంతో సామాజిక మధ్యమాల్లో పోస్టులు పెట్టడం సరికాదని తెలిపారు. మరోవైపు తనకు ప్రమోషన్ దొంగ పద్ధతిలో వచ్చిందనీ, యూనివర్సిటీ వీసీనే బ్లాక్‌మెయిల్ చేశానని ఏబీవీపీ విద్యార్థి రాశారు. ఇది పెద్ద తప్పు అని ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వెంటనే ఆ విద్యార్థిని సస్పెండ్ చేసి "పెండింగ్ ఎక్వైరీ" అని పెట్టాలి. కానీ అలా చేయలేదు. ఆ విద్యార్థిపై చర్యలు మొదలుపెట్టకుండానే ఈ నెల 24న జరిగే సమావేశానికి విద్యార్థిని హాజరు కావాల్సిందిగా తెలిపారు.



ఇటీవల 10మంది విద్యార్థులను సస్పెండ్ చేశారు. దానిపై ప్రొఫెసర్ లక్ష్మినారాయణ బహిరంగ లేఖ రాశారు. రూల్స్ పాటించడం తప్పుకాదు. కానీ పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలు మార్చాలి. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే విధంగా కాకుండా, వారిలో మార్పు తెచ్చేలా రూల్స్ ఉండాలని ఆ లేఖలో ప్రొఫెసర్ లక్ష్మినారాయణ పేర్కొన్నారు. ఇలాంటివి దృష్టిలో పెట్టుకునే ఏబీవీపీకి చెందిన విద్యార్థులు ప్రొఫెసర్ లక్ష్మినారాయణపై సామాజిక మాధ్యమాల వేదికగా ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారు. యూనివర్సిటీ పాలక మండలి కూడా ఏబీవీపీకి చెందిన విద్యార్థులు కాబట్టే 45 రోజులైనా ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. వర్సిటీలో కొద్ది రోజుల క్రితం అగ్రవర్ణానికి చెందిన ప్రొఫెసర్లను తిట్టారనే కారణంతో ఎలాంటి ఆధారాలు లేకున్నా పది వామపక్ష, అంబేద్కరిజం భావజాలంతో ఉన్న పదిమంది విద్యార్థులపై చర్యలు తీసుకున్నారు. ఇద్దరు విద్యార్థులను రెండేండ్ల పాటు సస్పెండ్ చేశారు. అదే దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్‌పై నిస్సిగ్గుగా ఏబీవీపీ జాతీయ నాయకుడు వ్యాఖ్యలు చేసినా వర్సిటీ అధికారులు మాత్రం చర్యలు తీసుకోలేదు. హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య సమయంలో వర్సిటీ వీసీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళనల్లో ముందుండి పాల్గొన్నారనే అక్కసు ఏబీవీపీ నాయకులతోపాటు వర్సిటీ ఉన్నతాధికారుల్లోనూ ఉందని దీనిద్వారా స్పష్టమవుతున్నది.

సెల్ : 9666011107

చర్యలు తీసుకోకపోవడం సరికాదు

ఓ అధ్యాపకుడిపై ఇంత ఘోరంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. ఇది వాళ్ల సంస్కృతికి అద్దం పడుతున్నది. గతంలో ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ సూరెపల్లి సుజాతతోపాటు పలువురు ప్రొఫెసర్లపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. గతంలో ప్రొఫెసర్లను తిట్టినట్టు ఎలాంటి ఆధారాలు లేకున్నా పదిమంది విద్యార్థులపై చర్యలు తీసుకున్నారు. కానీ ఇప్పుడు అన్ని ఆధారాలున్నా ఏబీవీపీ నేత అనే కారణంతోనే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

– మున్నా, ఏఎస్ఏ వర్సిటీ అధ్యక్షులు

ఆ విద్యార్థి పద్ధతి తప్పు

మొట్టమొదట ఆ విద్యార్థి ఆ సబ్జెక్టుకు చెందిన వ్యక్తి కాదు. అయినా పనిగట్టుకొని ప్రొఫెసర్‌ను నిందిస్తూ సామాజిక మధ్యమంలో పోస్టులు పెట్టడం పద్ధతి కాదు. ఏమైనా బేధాభిప్రాయాలు ఉంటే నిబంధనల ప్రకారం యూనివర్సిటీ డీన్‌కు, లేదా పాలక మండలికి ఫిర్యాదు చేయవచ్చు. కానీ ఇలా అసభ్య పదజాలంతో దూషించడం మంచిది కాదు. యూనివర్సిటీ పాలకమండలి నిబంధనల ప్రకారం ఆ విద్యార్థిపై చర్యలు తీసుకోవాలి.

– ప్రొఫెసర్ శ్రీదేవి, హెచ్‌సీయూ

వర్సిటీ నిబంధనల మేరకే బోధిస్తాం



మేం విద్యార్థులకు ఏం బోధించాలనేది వర్సిటీ అధికారులే నిర్ణయిస్తారు. వారి నిబంధనల మేరకు విద్యాబోధన, పరీక్షలు నిర్వహిస్తాం. కానీ 'కాషాయీకరణ' పేరు ఉందని, ఎకనామిక్స్ సబ్జెక్టుతో సంబంధం లేని ఓ ఏబీవీపీ నాయకుడు అసభ్యకరమైన, బూతులతో పోస్టు చేయడం సరికాదు. వర్సిటీ కల్చర్ కాపాడాలని కోరుతూ వీసీకి ఫిర్యాదు చేశాను. అయినా ఇప్పటికీ ఎలాంటి చర్య తీసుకోలేదు.

– ప్రొఫెసర్ లక్ష్మినారాయణ, హెచ్‌సీయూ



శతకాలు లేకున్నా..

సిరీస్ సాధించిన దక్షిణాఫ్రికా

సమష్టి ప్రదర్శనలే గెలుపు బాట



నవతెలంగాణ క్రీడా విభాగం

'గంగిగోవు పాలు గంటెడైనను చాలు, కడివెడైన నేమి ఖరము పాలు' అన్నాడు వేమన మహాత్ములు. ఈ పద్యము, భావం సఫారీలకు తెలియకపోయినా.. సారాంశం మాత్రం ఒంటబట్టించుకున్నట్టే కనిపిస్తున్నారు. అందుకే భారత్‌తో తాజా ఫ్రీడం సిరీస్‌లో ఒక్క భారీ ఇన్నింగ్స్ సైతం లేకుండానే సిరీస్‌ను సొంతం చేసుకున్నారు. ఏ ఒక్క ఆటగాడిపైనో ఆధారపడకుండా, సమష్టిగా పరుగులు రాబట్టారు. అలవోకగా టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకున్నారు.

క్యాచులు మ్యాచుల్ని గెలిపిస్తాయని కొందరు అంటారు. వికెట్లు మ్యాచుల్ని మన వశం చేస్తాయని మరికొందరు భావిస్తారు. మరి సెంచరీల సంగతో? నిజమే శతకాలు సైతం ఒంటిచేత్తో మ్యాచులను గెలిపిస్తాయి. క్రికెట్ చరిత్ర సైతం ఇదే చెబుతోంది. కానీ కండ్లముందు కనిపిస్తున్న గణాంకాలు మాత్రం అందుకు తల అడ్డంగా ఊపేలా చేస్తోంది. టెస్టు మ్యాచులు నెగ్గేందుకు శతకాలు, భారీ ఇన్నింగ్స్ ప్రదర్శనలు అవసరం లేదని తాజాగా దక్షిణాఫ్రికా నిరూపించింది. కేవలం మ్యాచులే కాదు ఏకంగా సిరీస్‌ను సైతం సాధించవచ్చని రుజువు చేసింది. మూడు మ్యాచుల ఫ్రీడం టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికా నుంచి ఒక్క సెంచరీ కూడా నమోదు కాలేదు. కానీ టీమ్ ఇండియా నుంచి భారీ సెంచరీ నమోదైంది. అయితేనేం.. సిరీస్ సఫారీ సొంతమైంది. అందుకు కారణం సమష్టి కృషి.

తాజా టెస్టు సిరీస్‌లో ఒకే ఒక్క సెంచరీ నమోదైంది. అది కూడా భారత సేనాని విరాట్ కోహ్లి చేసినదే. సెంచూరియన్ తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లి స్పెషల్ భారత్‌ను సఫారీకి చేరువ చేసింది. కానీ ఆ ఒక్కడి ప్రదర్శనే అందుకు సరిపోలేదు. కోహ్లి సెంచరీ కాకుండా భారత్ శిబిరం నుంచి కేవలం మరో 50 ప్లస్ స్కోరు వచ్చింది. అది కేప్‌టౌన్‌లో హార్దిక్ పాండ్య వీరోచితం. కానీ ఇదే సమయంలో దక్షిణాఫ్రికా తరఫున ఒక్క సెంచరీ కూడా నమోదు కాలేదు. అయితే అర్ధ సెంచరీలు మాత్రం ఏడు నమోదు అయ్యాయి. అవీ కూడా ఐదుగురు విభిన్న బ్యాట్స్‌మెన్ సాధించారు. సమష్టిగా రాణించటంతో దక్షిణాఫ్రికా మూడు పర్యాయాలు 250 పైచిలుకు పరుగులు చేసింది. కానీ భారత్ ఒక్కసారి మాత్రమే 250 గీత దాటింది. భారత్ వైఫల్యానికి కారణం.. అద్భుతాల కోసం ఎదురుచూడటం, వ్యక్తిగత మెరుపులు కాపాడుతాయని విశ్వసించటం.

'ప్రత్యర్థి జట్టుగా మాకు తెలుస్తోంది.. భారత్ మరీ ఎక్కువగా విరాట్ కోహ్లి పరుగులపై ఆధారపడుతోంది. అదే రెండు జట్లకు మధ్య వ్యత్యాసం. సఫారీ తరఫున డివిలియర్స్‌తో పాటు డీన్ ఎల్గార్, మర్క్‌రం, నేనూ పరుగులు చేశాం' అని సఫారీ సారథి డుప్లెసిస్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో విశ్లేషించాడు!. ఈ సిరీస్‌లో భారత్ తరఫున పాండ్య, కోహ్లి ఇన్నింగ్స్‌లే హైలైట్. కానీ అవి విజయానికి ఏమాత్రం పనికి రాలేదు. ఇదే సమయంలో కేప్‌టౌన్‌లో డివిలియర్స్ చేసిన 65, 35 పరుగులు, డుప్లెసిస్ చేసిన 62 పరుగులు సఫారీ విజయానికి బాటలు వేశాయి. సెంచూరియన్‌లోనూ రెండో ఇన్నింగ్స్‌లో డివిలియర్స్ 80 పరుగులు, మర్క్‌రం 94, ఆమ్లా 80తో పాటు ఎల్గార్ 61 రన్స్ సఫారీ విజయానికి బాటలు వేశాయి. మన జట్టుకు రెండు టెస్టుల్లో కలిపి ఇద్దరు రాణించగా.. దక్షిణాఫ్రికాకు ఐదుగురు రాణించారు. ఈ ఐదుగురి బ్యాటింగ్ శైలి భిన్నమైనవి కావటం ఇక్కడ విశేషం. మర్క్‌రం దూకుడైన బ్యాట్స్‌మన్‌గా కాగా ఎల్గార్ శైలి గ్రేమ్ స్మిత్‌ను పోలి ఉంటుంది. ఆమ్లా ఆకర్షణీయమైన స్ట్రోక్ ప్లేయర్, డివిలియర్స్ అత్యంత ప్రభావశీల బ్యాట్స్‌మన్ కాగా డుప్లెసిస్ డిఫెన్స్‌తో పాటు పరుగులు చేయటంలోనూ దిట్ట. క్లిష్ట పరిస్థితులు, ప్రత్యర్థి బౌలింగ్ నాణ్యతగా ఉన్నప్పుడు ఒకరిద్దరి ప్రదర్శనలు విజయానికి ఏమాత్రం పనికిరావు. కావాల్సినది సమష్టి ప్రదర్శనలే. అందుకే, ఓవరాల్‌గా చూస్తే దక్షిణాఫ్రికా బ్యాటింగ్ సైతం సాధారణంగా కనిపిస్తోంది. కానీ ఓ ఆటగాడు 30-40 పరుగులు చేస్తే, మరోకరు 50-60 చేశారు. కానీ భారత కథ వేరు. ఒకరిద్దరి శతక విన్యాసాలు టెస్టులు గెలిచేందుకు సరిపోవు అనేది కాదు. కానీ ప్రతికూల పరిస్థితుల్లో అద్భుతాలు జరుగుతాయని ఆశించకుండా స్కోరు బోర్డుపై అందరూ ఓ చేయి వేస్తేనే ఫలితం మనకు అనుకూలంగా ఉంటుంది. లేదంటే ఇప్పుడు దక్షిణాఫ్రికాలో ఎదురైన పరాభవమే ముున్ముందు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలలో ఎదురుచూసే ప్రమాదం లేకపోలేదు.

చెమటోడ్చిన నడాల్

- ప్రీ క్వార్టర్స్‌లో డిగోపై గెలుపు
- పేస్ జోడీ, కిర్గియోస్ ఇంటి బాట


రఫెల్ నడాల్


నిక్ కిర్గియోస్

మెల్‌బోర్న్ : నిప్పులు కక్కిన ఉష్ణ వాతావరణంలో స్పెయిన్ బుల్ చెమటోడ్చింది. రఫెల్ నడాల్ క్వార్టర్స్‌లో కాలుమోపేందుకు ఏకంగా నాల్గు గంటల పాటు తీవ్రంగా శ్రమించక తప్పలేదు. 50 డిగ్రీల సెల్సియస్ దాటిన ఉష్ణోగ్రత వద్ద రాకెట్ పట్టేందుకు ఆటగాళ్లు ఆపసోపాలు పడుతున్నారు. స్టార్ ప్లేయర్స్‌కు సైతం ఇది తప్పటం లేదు. అర్జెంటీనా ఆటగాడు డిగో స్వార్ట్‌మాన్‌తో ప్రీ క్వార్టర్స్‌లో నడాల్ నాల్గు సెట్ల పోరులో తలపడ్డాడు. 6-3, 6-7(4-7), 6-3, 6-3తో గెలుపొంది క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. యువ సంచలనం నిక్ కిర్గియోస్ క్వార్టర్స్‌కు ముందు నిష్క్రమించాడు. 7-6(3-7), 6-7(4-7), 6-4, 6-7(4-7)తో నాల్గో సీడ్ గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా)తో హోరాహోరీ పోరులో తలవంచాడు. మూడున్నర గంటలకు పైగా సాగిన మ్యాచ్‌లో కిర్గియోస్ తానోడిన మూడు సెట్లలోనూ టైబ్రేకర్ వరకూ పోరాడాడు. ఆరో సీడ్, క్రోయేషియా ఆటగాడు మారిన్ సిలిచ్ సైతం క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. 6-7(2-7), 6-3, 7-6(7-0), 7-6(7-3)తో కారెనో బుస్టా (స్పెయిన్)పై విజయం సాధించాడు. బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే లేని వేళ కైల్ ఎడ్మండ్ యుకె ఆశలను క్వార్టర్స్‌కు చేర్చాడు. 6-7(4-7), 7-5, 6-2, 6-3తో ఆండ్రియాస్ సెప్పి (ఇటలీ)పై ఎడ్మండ్ గెలుపొందాడు. మంగళవారం జరిగే క్వార్టర్‌ఫైనల్స్‌లో రఫెల్ నడాల్‌తో మారిన్ సిలిచ్, దిమిత్రోవ్‌తో ఎడ్మండ్‌లు తలపడనున్నారు. మరో ఎండ్‌లో రోజర్ ఫెదరర్, జకోవిచ్‌లు నేడు ప్రీ క్వార్టర్స్‌లో పోటీపడనున్నారు.

మహిళల సింగిల్స్‌లో కరొలినా వొజ్నియాకి (డెన్మార్క్) 6-3, 6-0తో రిబరికోవా (స్లోవేకియా)పై వరుస సెట్లలో నెగ్గింది. ఎలినా స్విట్లోనా (ఉక్రెయిన్) 6-3, 6-0తో అలర్టోవాపై అలవోక విజయం సాధించింది. స్పెయిన్ ప్లేయర్ స్వారెజ్ నవారో 4-6, 6-4, 8-6తో టైబ్రేకర్‌లో కొంటావిట్‌పై పైచేయి సాధించింది.

బోపన్న ముందుకు, పేస్ వెనక్కి : మెల్‌బోర్న్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. లియాండర్ పేస్, పురవ్ రాజాలకు మెన్స్ డబుల్స్‌లో చుక్కెదురు కాగా మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న శుభారంభం చేశాడు. 1-6, 2-6తో పేస్, రాజాలు ఆస్ట్రేలియా జంట చేతిలో ఓటమిపాలయ్యారు. హంగెరీ తార టిమియ బాబోస్ జంటగా రోహన్ బోపన్న 6-2, 6-4తో మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు.

లంకతో ఏమొచ్చింది?

టర్బోనేటర్ భజ్జీ ప్రశ్న

కోల్‌కత : కీలక దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు ప్రయోజనం లేని శ్రీలంకతో ఏం ఒరిగిందని సీనియర్ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశ్నించాడు. మరో టెస్టు ఉండగానే 0-2తో టీమ్ ఇండియా సిరీస్ కోల్పోవటంతో జట్టు సన్నాహకతపై భజ్జీ ప్రశ్నించాడు. ' స్వదేశంలో శ్రీలంకతో సిరీస్ అవసరం లేనిది. ఆ సిరీస్‌తో మనకు వచ్చినది ఏమీ లేదు. అలా కాకుండా కొంతమంది ఆటగాళ్లు ముందే దక్షిణాఫ్రికాకు వెళ్లి ఉంటే కథ వేరేలా ఉండేది. అదీ కాకుంటే, ధర్మశాలలో సాధన చేయాల్సింది. ఎందుకంటే ధర్మశాలకు మించిన ప్రిపరేషన్ మరోచోట దొరకదు. ఇది అత్యంత ఎత్తులో ఉన్న ప్రదేశం, అతి శీతల వాతావరణం, బౌన్స్ లభించే పరిస్థితులు. దక్షిణాఫ్రికాకు ఇది మంచి సన్నద్ధత అయ్యి ఉండేది' అని హర్భజన్ అభిప్రాయపడ్డాడు. అజింక్య రహానె విషయంలో భజ్జీ కెప్టెన్‌ను వెనకేసుకొచ్చాడు. నిజానికి కోహ్లి సారథ్యంలో రహానె గణాంకాలు ఆకట్టుకునేలా లేవు. సిరీస్ పోయిన తర్వాత రహానె ఆడినా, ఆడకపోయినా ఇక అనవసరం. ఒకవేళ రహానె ఆడినా ఓడి ఉంటే అప్పుడు రోహిత్‌ను తీసుకోవాలని అడిగేవారు. కెప్టెన్ వైపు నుంచి కూడా ఆలోచించాలి. కానీ భువనేశ్వర్‌కు తప్పించటం సరికాదు. అతడు మ్యాచ్ విన్నర్. ఇప్పుడైనా పోయేదేం లేదు. వాండరర్స్‌లో ఆడితే 1-2తో సిరీస్‌ను ముగించవచ్చు. జట్టు సానుకూల దృక్పథంతో ఉండాలని నా సూచన అని భజ్జీ ముగించాడు.



మెరిసిన యువీ, భజ్జీ

- సూపర్ ఓవర్‌లో పంజాబ్ గెలుపు

కోల్‌కత : సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 సూపర్ లీగ్‌లో స్టార్ క్రికెటర్లు యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్ మెరిశారు. కర్ణాటకతో ఎలిమినేటర్‌లో ఈ ఇద్దరి మెరుపులతో పంజాబ్ మెరుపు విజయం సాధించింది. 159 పరుగుల ఛేదనలో స్కోరు సమం అయ్యాయి. దీంతో విజేతను సూపర్ ఓవర్ ద్వారా నిర్ణయించారు. సూపర్ ఓవర్‌లో యువరాజ్ సింగ్, మన్‌దీప్ సింగ్‌లు చెరో బౌండరీ కొట్టగా, గౌతం ఓ సిక్సర్ సంధించాడు. పంజాబ్ 15 పరుగులు చేసింది. కానీ బదులుగా కర్ణాటక 11 పరుగులే చేసింది. సిద్దార్థ్ కౌల్ తెలివిగా బంతులేని పంజాబ్ విజయంలో కీలక భూమిక వహించాడు. స్క్వేర్‌లెగ్‌లో ఫీల్డింగ్‌లోనూ యువీ రెచ్చిపోయాడు. కండ్లుచెదిరే క్యాచులతో స్టువర్ట్ బిన్ని (2), సిఎం గౌతం (36)లను అవుట్ చేశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక ఎ జోషి (40), గౌతం (36) రాణించటంతో ఏడు వికెట్లకు 158 పరుగులు చేసింది. పంజాబ్ తరఫున మన్‌దీప్ సింగ్ (45), హర్భజన్ సింగ్ (33), యువరాజ్ సింగ్ 33 మెరిశారు. జార్ఖండ్‌తో మరో మ్యాచ్‌లో ముంబయి గెలుపొందింది. విరాట్ సింగ్ (81) చెలరేగినా ఛేదనలో జార్ఖండ్ 157 పరుగులే చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి సిద్దేశ్ లాడ్ (46), ఆదిత్య తారె (45), సూర్యకుమార్ యాదవ్ (33) రాణించటంతో ఐదు వికెట్లకు 170 పరుగులు చేసింది.


బట్లర్ అజేయ సెంచరీ

వన్డే సిరీస్ ఇంగ్లాండ్ వశం

సిడ్నీ : యాషెస్ సిరీస్‌లో 0-4తో ఓటమిపాలైన ఇంగ్లాండ్‌కు వన్డేల్లో ఊరట లభించింది. వరుసగా మూడో వన్డేలో విజయం సాధించిన మోర్గాన్‌సేన మరో రెండు మ్యాచులు ఉండగానే 3-0తో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్నది. జోశ్ బట్లర్ (100 నాటౌట్, 83 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీకి తోడు టెయిలెండర్ క్రిస్ వోక్స్ (53 నాటౌట్, 36 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ ఆరు వికెట్లు కోల్పోయి 302 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లు రాణించటంతో 189/6తో ఇంగ్లాండ్ కష్టాల్లో పడింది. కానీ బట్లర్, వోక్స్ ఏడో వికెట్‌కు అజేయంగా 113 పరుగులు జోడించారు. ఛేదనలో ఆరంభంలోనే ఆసీస్ ఓపెనర్ వార్నర్ (8)ను కోల్పోయింది. కానీ ఫించ్ (62), స్మిత్ (45) పోరాడారు. మిచెల్ మార్ష్ (55), స్టోయినిస్ (56) అర్ధ సెంచరీలు ఆసీస్ ఆశలను నిలబెట్టినా ఫలితం లేకపోయింది. నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా 286 పరుగులే చేసింది. దీంతో ఇంగ్లాండ్ 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. జోశ్ బట్లర్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



రహానె తోడుగా కోహ్లి ప్రాక్టీస్

జోహనెస్‌బర్గ్ : ఎన్నో ఆశలు, మరెన్నో అంచనాలతో చరిత్ర సృష్టించేందుకు సఫారీ పర్యటనకు వెళ్లిన కోహ్లికి తొలి రెండు టెస్టుల్లోనే పరాభవ భారం ఏమిటిదో తెలిసొచ్చింది. ఓటమిపై విమర్శల కంటే అజింక్య రహానెను తుది జట్టులోకి ఎంచుకోకపోవటంపై కోహ్లిని ఎక్కువగా విమర్శలు చుట్టుముట్టాయి. ఇన్నాండ్లూ అనుకూల పరిస్థితుల్లో విజయాలు సాధించిన కోహ్లిసేన.. ఒక్కసారిగా పరిచయం లేని పిచ్‌లపై పరేషాన్ అవుతోంది. 0-2తో సిరీస్ కోల్పోయినా.. సానుకూల దృక్పథంతో కనిపిస్తోన్న టీమ్ ఇండియా మూడో టెస్టు కోసం ముమ్మర సాధన చేస్తోంది. బుధవారం నుంచి వాండరర్స్‌లో మూడో టెస్టు ఆరంభం కానున్నది. దీంతో ఆదివారం నుంచి టీమ్ ఇండియా ప్రాక్టీస్ మొదలెట్టింది. రహానెను తుది జట్టులోకి ఎంపిక చేయనందున తీవ్ర విమర్శపాలైన విరాట్ కోహ్లి.. ఆదివారం ప్రాక్టీస్ సందర్భంగా అతడితో కలిసి సాధన చేయటం కనిపించింది. నెట్స్‌లో తొలుత చటేశ్వర్ పుజారా, మురళీ విజయ్, కెఎల్ రాహుల్‌లు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా.. తర్వాత రహానె, కోహ్లి, పాండ్యలు వరుస నెట్లలో సాధన చేశారు. ప్రాక్టీస్ మధ్యలో రహానె, కోహ్లి తరచుగా మాట్లాడుకోవటం విశేషం. శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, సాహాలు ఆఖర్లో ప్రాక్టీస్ చేశారు.

బవుమా అవుట్ : దక్షిణాఫ్రికా ఆటగాడు తంబ బవుమా భారత్‌తో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. ఏబీ డివిలియర్స్ పునరాగమనంతో తుది జట్టులో చోటు కోల్పోయిన బవుమా.. దేశవాళీ వన్డే కప్‌లో ఆడుతున్నాడు. జనవరి 17న ఓ మ్యాచ్‌లో బవుమా కుడి చేతి వేలికి గాయమైంది. దీంతో వైద్యులు కనీసం నాల్గు వారాల విశ్రాంతి అవసరమని చెప్పారు. గాయంతో బుధవారం నుంచి ఆరంభమయ్యే ఆఖరి టెస్టుకు బవుమా దూరమయ్యాడు. అయినా, బవుమా స్థానంలో మరో ఆటగాడిని క్రికెట్ దక్షిణాఫ్రికా ఎంపిక చేయలేదు. ఆస్ట్రేలియాతో సిరీస్ సమయానికి అతడు ఫిట్‌నెస్ సాధించగలడని తెలుస్తోంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.